సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
మంగళవారం, 03.03.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 131
పేజీలు: 12 వెల: రూ. 5

## సంజు శాంసన్ 'వీర' గాథ!

11 ఏళ్ల నిరీక్షణ.. 60 మ్యాచుల వేదన.. **11**




- చివరకు ఒంటి చేత్తో చరిత్ర
- విమర్శకులకు సంజు శాంసన్ అద్భుత సమాధానం
- డగ్ అవుట్ నుంచి హీరో వరకు
- సంజు శాంసన్ సంచలన ఇన్నింగ్స్ వెనుక దాగున్న కన్నీటి కథ!

## పశ్చిమాసియాలో మహా విస్ఫోటనం

**ఏడు దేశాలపై ఇరాన్ క్షిపణుల వర్షం** **10**

- అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు ఇరాన్ ఘాటైన ప్రతిస్పందన
- గల్ఫ్ దేశాల్లో అమెరికా సైనిక స్థావరాలే ప్రధాన లక్ష్యం
- డ్రోన్లు, క్షిపణులతో విస్తృత స్థాయిలో దాడులు
- అమెజాన్ డేటా సెంటర్ దెబ్బతినడంతో సేవలు నిలిపివేత
- చమురు క్షేత్రాలపై దాడులతో ఆర్థిక రంగం కుదేలవుతుందా?
- అంతర్జాతీయ స్థాయిలో ఉద్రిక్తతలు తీవ్రతరమవుతున్నాయి



పశ్చిమాసియా ఘర్షణ కొత్త మలుపు తిరిగింది. ఇరాన్ తన ప్రతీకార చర్యల్లో భాగంగా ఖతార్, కువైట్, యూఏఈ, సౌదీ అరేబియా వంటి ఏడు దేశాల ఆర్థిక, సైనిక స్థావరాలపై దాడులు చేపట్టింది. ఈ దాడుల్లో కువైట్‌లోని అమెజాన్ డేటా సెంటర్ దెబ్బతినడంతో అంతర్జాతీయ డిజిటల్ సేవలపై తీవ్ర ప్రభావం పడింది. ఇజ్రాయెల్, అమెరికా నౌకాదళం లక్ష్యంగా జరిగిన ఈ దాడులు ప్రాంతాన్ని యుద్ధభూమిగా మార్చాయి.

## కాషాయ జెండాకు ఎర్రజెండా ఎర

### బీజేపీకి విరుగుడు సూత్రం

### కేడర్ బలం కోసం ఎర్రజెండా వైపు కాంగ్రెస్ చూపు

- గ్రామీణ ఓటు బ్యాంక్ లక్ష్యంగా కొత్త రాజకీయ సమీకరణాలు
- రాజకీయ ఆశల్లో మాజీ మావోయిస్టులు
- వారిని ప్రోత్సహించే పనిలో సీఎం రేవంత్ రెడ్డి..?
- అట్టడుగు వర్గాల మద్దతు కోసం కాంగ్రెస్ కొత్త వ్యూహం
- తాము వస్తామంటున్న మాజీ మావోలు
- లెఫ్ట్ సానుభూతితో హిందుత్వ రాజకీయాలకు సవాల్

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రాజకీయ సమీకరణాల మార్పు




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** సుదీర్ఘ పోరాటం.. ఏడు పదుల వయస్సుకు వచ్చి.. ఎర్రజెండాను వీడిని మాజీ మావోయిస్టు నేతలకు రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ ఎర్రతివాచీ పర్చేందుకు సిద్ధమవుతోంది. తామూ రాజకీయాల్లోకి వచ్చేందుకు సిద్ధమే అంటూ రాజకీయ ఆశల్లో లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు ఉన్నారు. ఇదే అవకాశాన్నీ కాంగ్రెస్ ఒడిసిపట్టుకునే ప్రయత్నాలు చేస్తోంది. ప్రధానంగా సీఎం రేవంత్ రెడ్ మాజీ మావోయిస్టులను రాజకీయంగా ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలిచ్చారు. దీంతో మాజీ మావోయిస్టులు రాజకీయ రంగ ప్రవేశం చేయడం ఖాయంగా కనిపిస్తోంది. వారికి సీఎం రేవంత్ అవకాశాలు కల్పించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**సానుభూతి సూత్రం**

సీఎం రేవంత్ రెడ్డి మావోయిస్టులపై సానుభూతి చూపిస్తున్నారు. లొంగిపోడానికి రెడ్ కార్పెట్ వేస్తున్నారు. మంచి పునరావాస ప్యాకేజీలు ఇస్తున్నారు. అయితే రాజకీయ నేతలు ఇదంతా ఊరికనే చేయరు. ఖచ్చితంగా రాజకీయం ఉంటుంది. రేవంత్ రెడ్డి మాజీ మావోయిస్టు అగ్రనేతలను కాంగ్రెస్ పార్టీలో చేర్పించి రాజకీయ భవిష్యత్ ఇవ్వాలనుకుంటున్న సూచనలు కనిపిస్తున్నాయని మిగతా 02లో



## దేశం కోసం ప్రధాని అవుతా

సంఘటన సృజన్ అభియాన్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

- బీజేపీ ఆగడాల నుంచి దేశాన్ని రక్షించుకుందాం
- మతతత్వ బీజేపీని అడ్డుకోవడం అవసరం
- దేశంలో శాంతి, సమానత్వం, సామరస్యం ప్రమాదంలో ఉంది **10**

## మైనింగ్ వేలంలో భారీ అక్రమాలు

సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ



- టెండర్లు రద్దు చేయాలని డిమాండ్
- నిబంధనలు ఉల్లంఘన ఆరోపణ
- విచారణ జరిపి.. రద్దు చేయాలి
- బిడ్డర్ల ఎంపికపై సందేహాలు **03**

## ఆర్టీసీ చల్లని కబురు



- ఏసీ బస్సుల్లో టికెట్ ధరలు తగ్గింపు
- రూ.5 నుంచి రూ.10 రాయితీ
- ఖాళీ సీట్లకు చెక్.. ధరల తగ్గింపుతో ప్రయాణికుల ఆకర్షణ **09**

## సొంతూరిలో విజయ్-రష్మిక వ్రతం

- సత్యనారాయణ స్వామి వ్రతం చేసి ఊరందరికి భోజనాలు పెట్టిన జంట
- నాగర్ కర్నూల్ జిల్లా, బల్మూర్ మండలం, తుమ్మన్ పేటలో సందడి **12**




## సెకన్లలో రిపోర్టులు!

- సనత్‌నగర్ టిమ్స్‌లో సరికొత్త సాంకేతికత..
- ప్రభుత్వ ఆసుపత్రిలో 'న్యూమాటిక్ ట్యూబ్ సిస్టమ్'! **10**
- రాష్ట్రంలోనే తొలిసారి కార్పొరేట్ సేవలు
- ఉగాది నుంచి ప్రారంభించేందుకు సిద్ధం

# తీరని భూ చిక్కులు!

### ధరణి పోయె.. భూ భారతి వచ్చె.. సమస్యలు మాత్రం అలాగే




- పాత లోపాలకు కొత్త సమస్యలు తోడు
- రైతుల భూములకు స్పష్టత లేక ఆందోళన
- ఆరు నెలల్లో పరిష్కారం అంటున్న అధికారులు
- 100కి పైగా సమస్యలు ఇంకా పెండింగ్
- సాదా బైనామాల దరఖాస్తులు నిలిచిపోయిన స్థితి
- ఫీజులు చెల్లించినా రీఫండ్ లేక ఇబ్బంది
- పోర్టల్ లోపాలతో మీ సేవా దందాలు బహిర్గతం
- ప్రభుత్వానికి కోట్ల ఆదాయం నష్టం
- భూ భారతి అమలులో క్షేత్రస్థాయిలో గందరగోళం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** ధరణి వెబ్ పోర్టల్ మార్పు చెంది భూ భారతి పోర్టల్‌గా అవతరించినా పాత సమస్యలు మాత్రం ఇప్పట్లో పరిష్కారం అయ్యేలా లేవు. ఎన్నో లోపాలతో తయారైన భూ భారతి పోర్టల్‌లో ఒక్కొక్కటిగా సమస్యలు వెలుగులోకి వస్తున్నాయి. తెలంగాణలో భూముల చుట్టూ ఎన్నో చిక్కుముళ్లు. ఈ సమస్యలను పరిష్కరించాలని ప్రయత్నించే కొద్దీ, కొత్తవి పుట్టుకొస్తున్నాయి. గతంలోనూ ఇదే జరిగింది. ఇప్పుడూ అదే జరుగుతోంది. గతంలో ఉన్న ధరణి చట్టాన్ని రద్దు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం దాని స్థానంలో భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చింది. గతేడాది ఏప్రిల్ 14 నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చిందని ప్రకటించిన ప్రభుత్వం తొలుత దీన్ని 4 మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేసింది. ఇప్పుడు రాష్ట్రమంతటా అమల్లోకి తెచ్చింది. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, అవగాహన కూడా కల్పించింది. ధరణి స్థానంలో భూభారతిని తీసుకువచ్చి సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదని రెవెన్యూ నిపుణులు చెబుతున్నారు. అయితే, త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ప్రభుత్వం చెబుతోంది.

**ధరణిలో 100కుపైగా సమస్యలు**

రికార్డ్ ఆఫ్ రైట్స్(ఆర్వోఆర్)-1971 చట్టాన్ని రద్దు చేసి, 2020 నవంబరు 2న కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని తీసుకువచ్చింది అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం. దీనిని ధరణి చట్టంగా పిలిచారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ధరణి చట్టాన్ని రద్దు చేసి, దాని స్థానంలో ఆర్వోఆర్-2025 చట్టాన్ని తీసుకువచ్చింది. దీన్ని భూభారతిగా పిలుస్తున్నారు. ధరణిలో 33 మాడ్యూళ్లు ఉండగా, వాటి స్థానంలో భూభారతిలో 6 మాడ్యూళ్లు (దరఖాస్తు విధానాలు) తీసుకువచ్చారు. గతంలో ఒక మాడ్యుల్ బదులు మరో మాడ్యుల్ లో దరఖాస్తు చేసుకుంటే ప్రతిసారి రైతులు 1200 రూపాయలు కట్టాల్సి వచ్చేది. ఇప్పుడా అవసరంలేదని ప్రభుత్వం చెబుతోంది. ధరణి రాకమునుపు భూ యజమాని పేరు, ఖాతా నంబరు, సర్వే నంబరు, అనుభవదారు లేదా పట్టాదారు పేరు, భూమి స్వరూపం, విస్తీర్ణం.. ఇలా 32 కాలమ్స్ తో పహాణి నిర్వహించేవారు. ఇప్పుడు 11 కాలమ్స్‌తో పహాణీ తీసుకువస్తున్నట్లుగా మిగతా 02లో

## మార్పునకు శ్రీకారం

### ఇప్పటిదాకా ఒక లెక్క.. ఇకపై మరో లెక్క

### కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్



- ఇళ్ల నిర్మాణాలకు డబ్బులు అడగొద్దు.. దరఖాస్తుదారులను ఇబ్బంది పెట్టొద్దు
- బ్రోకర్లు, ఏజెన్సీల ద్వారా లంచాలు తీసుకుంటే ఇబ్బందులు తప్పవు
- అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించే వారిపై క్రిమినల్ చర్యలు **03**
- ఇంటి నిర్మాణానికి ఈజీగా పర్మిషన్లు వస్తాయనే నమ్మకం కలిగించండి
- కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్లతో కలిసి టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష

## రేషన్ కార్డులకు 6 నెలల గడువు

### అప్పటి వరకు తీసుకోకపోతే రద్దు!

- తెల్ల కార్డుల జాబితా శుద్ధికి అధికారుల కసరత్తు
- అనర్హుల గుర్తింపులో పౌర సరఫరాల శాఖ చర్యలు
- మండలాల వారీగా కార్డుల వివరాల సేకరణ ప్రారంభం
- రేషన్ దుర్వినియోగంపై ప్రభుత్వం కఠిన నిర్ణయం వైపు
- కొత్త కార్డుల ముందు పాత కార్డుల శుద్ధి ప్రక్రియ
- ఆరు నెలల వినియోగం లేని కార్డులపై రద్దు సూచనలు

లబ్దిదారుల ఎంపికలో పారదర్శకతకు చర్యలు

బియ్యం పంపిణీ లోపాలపై క్షేత్ర స్థాయి నివేదికలు

పూర్తి వివరాల తర్వాతే తుది నిర్ణయం తీసుకునే ప్రభుత్వం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం చేస్తున్న ప్రభుత్వం.. కొన్ని లక్షల మేర పాత కార్డులను ఏరివేసేందుకు సిద్ధమవుతోంది. ముందుగా రేషన్ సరఫరాలో కీలక మార్పుల దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అర్హులందరికీ రేషన్ అందే విధంగా సంస్కరణలు ప్రారంభించింది. అదే విధంగా రేషన్ కార్డుల రద్దు పైన పౌర సరఫరాల శాఖ అధికారులు నివేదిక సిద్ధం చేస్తున్నారు. తాజాగా మిగతా 02లో

## ఇదీ ఏఐ ముద్ర






మార్చి 3న సంభవించే చంద్రగ్రహణ ప్రభావం తెలుగు రాష్ట్రాలపైనా ఉంది. ఈసారి సంభవిస్తున్నది 'గ్రస్తోదయ' చంద్రగ్రహణం. అంటే చంద్రుడు గ్రహణంతోనే ఉదయిస్తాడు. మార్చి 3న మధ్యాహ్నం 3:20 గంటలకు గ్రహణం ప్రారంభమై, సాయంత్రం 6:47 గంటలకు ముగుస్తుంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 03.03.2026
www.mudranews.in | @mudranews



### చంద్రగ్రహణం



**ఇవి చేయద్దు..**

* గ్రహణ సమయంలో ఆహారం తీసుకోవడం శుభంగా పరిగణించరు
* ముందుగానే తిని ఉపవాసంగా ఉండటం మంచిదని నమ్మకం

# తీరని భూ 'చిక్కులు'!

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించింది ప్రభుత్వం. ధరణి రాక ముందు 76 రకాల భూ సమస్యలు ఉన్నట్లుగా ప్రభుత్వం గుర్తించింది. వాటికి పరిష్కారం లభిస్తుందని చెప్పింది. ధరణి వచ్చాక సమస్యలు తీరకపోగా, అదనంగా 45 రకాల సమస్యలు వచ్చినట్లుగా గుర్తించినట్లుగా తేలింది.

**ఫీజులు వెనక్కి ఇవ్వని ప్రభుత్వం**

ధరణి కింద భూముల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, గిఫ్ట్ డీడ్, వారసత్వ బదిలీ, జీపీఏ వంటివి చేయాలనుకుంటే నిర్దేశిత ఫీజులు చెల్లించాల్సి ఉండేది. నిరుడు ఏప్రిల్ 14న భూభారతి చట్టం వచ్చేవరకు ధరణి కింద దరఖాస్తులు తీసుకున్నారు. అయితే, ధరణి అమల్లో ఉన్నప్పుడు ఏదైనా అనుకోని కారణంతో స్లాట్ రద్దు చేసుకుంటే ఫీజు వెనక్కి ఇవ్వాలనే రూల్ ఉండేది. కానీ, ఈ ఫీజులు వెనక్కి ఇవ్వడంలో గతంలో అంతులేని జాప్యం జరిగేది. ఇప్పుడు భూ భారతి వచ్చినా సరే, గతంలో చెల్లించిన ఫీజులు వెనక్కి ఇవ్వలేదు. మరో సమస్య, సాదా బైనామాలది. తెలంగాణలో సాదా బైనామాల ద్వారా భూముల బదలాయింపు హక్కులు రాసుకున్నవి ఎక్కువ. ఇలా సాదా బైనామాల కింద 9.24లక్షల కింద దరఖాస్తులు వచ్చాయి. ఇవ్వన్నీ ధరణి ఉన్నప్పుడు నుంచే పెండింగులో ఉన్నాయి. వీటి పరిష్కారానికి ఇంకా ఆర్డీవోలకు అధికారాలు ఇవ్వకపోవడంతో, ఇంకెంతకాలం వేచి చూడాలనే ఆందోళన భూ యజమానుల్లో ఉంది.

**సమస్య అక్కడే**

ఒకప్పటి ధరణి వెబ్ పోర్టల్ మార్పు చెంది భూ భారతి పోర్టల్‌గా అవతరించినా పాత సమస్యలు మాత్రం ఇప్పట్లో పరిష్కారం అయ్యేలా లేవు. ఎన్నో లోపాలతో తయారైన భూ భారతి పోర్టల్‌లో ఒక్కొక్కటిగా సమస్యలు వెలుగులోకి వస్తున్నాయి. మండల జాయింట్ సబ్ రిజిస్ట్రార్ అండ్ తహశీల్దార్‌కు కొనుగోలుదారుడు చెల్లించే స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను వీక్షించే అవకాశం ఇవ్వకపోవడంతో మీ సేవా ఏజెంట్లు పెట్రేగిపోయి కోట్ల రూపాయలు వెనకేసుకున్నారు. ఈ తప్పిదాన్ని సరిదిద్దేందుకు ఎన్ఐసీ (నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్) నిపుణులు రంగంలోకి దిగినా, ఇప్పట్లో సమస్య పరిష్కారం అయ్యే సూచనలు కన్పించడం లేదు. ఇలాంటి సమస్యలు ఇంకా ఎన్ని ఉన్నాయనేది తనిఖీ చేసి పక్కాగా పరిష్కరించి పక్కాగా భూ భారతి పోర్టల్‌ను సిద్ధం చేసేందుకు కనీసం ఆరు నెలల సమయం తీసుకోనున్నట్లు అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నారు. గత బీఆర్ఎస్ ఏలుబడిలో తమ ప్రయోజనాల కోసం రూపొందించిన ధరణి వెబ్ పోర్టల్‌లో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని కనీసం పరిశీలించకుండా భూ భారతిగా మార్చడం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పెద్ద తప్పిదంగా వ్యాఖ్యానిస్తున్నారు.

**దేశ చట్టాలంటే భయంలేని విదేశీ కంపెనీకి ధరణి పోర్టల్**

అవినీతి తగ్గించి, జవాబుదారితనాన్ని పెంపొందించేందుకు వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ అధికారాన్ని గత బీఆర్ఎస్ పాలకులు మండల తహశీల్దార్లకు అప్పగించారు. వ్యవసాయ భూముల కోసం ప్రత్యేకంగా ధరణి వెబ్ పోర్టల్‌ను రూపొందించారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్ (ఎన్ఐసీ) కు సాఫ్ట్ వేర్ రూపొందించే బాధ్యతను అప్పగించకుండా ఊరు పేరు లేని, దేశ చట్టాలంటే భయంలేని విదేశీ కంపెనీకి అప్పగించారు. అప్పటి ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లి తహశీల్దార్ కార్యాలయంలో 2020 అక్టోబర్ 29వ తేదీన ధరణి వెబ్ పోర్టల్ సేవలను ప్రారంభించారు. సింగిల్ విండో విధానంలో ధరణి పోర్టల్‌లో పొందవచ్చని ప్రకటించారు.

**పెద్ద ఎత్తున భూ అక్రమాలను ప్రోత్సహించడం**

2010లో ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం ధరణి కోసం ఎలాంటి అనుభవం లేని ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంస్థలకు పోర్టల్ నిర్వహణ బాధ్యతలను అప్పగించాయని ఎన్ఐసీ, కాగ్ సంస్థలు లేవనెత్తాయని గత ఏడాది ధరణి పోర్టల్‌పై అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంస్థకు పోర్టల్ నిర్వహణ బాధ్యతలు అప్పగించవద్దని చెప్పినా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఏమాత్రం ఖాతరు చేయలేదన్నారు. అప్పటి మంత్రి కే.తారక రామారావుకు అత్యంత సన్నిహితుడు అయిన గది శ్రీధర్ రాజు కంపెనీకి తెలంగాణ ధరణి పోర్టల్ రూపకల్పన, నిర్వహణ బాధ్యతలు అప్పగించందిదన్నారు. ధరణి టెండర్ దక్కిన వెంటనే పేరు, యాజమాన్యం మారిందని అన్నారు. ఫిలిప్పీన్ దేశానికి చెందిన ఫాల్కన్ హెచ్.బీ, సింగపూర్‌కు చెందిన మరో కంపెనీ ఇందులోకి వచ్చాయన్నారు. ఇలా అనేక మలుపులు తిరిగి అంతర్జాతీయ చట్టాలంటే ఏమాత్రం భయం లేని దేశంలో ధరణి సర్వర్లను ఏర్పాటు చేశారన్నారు. పెద్ద ఎత్తున భూ అక్రమాలను ప్రోత్సహించడం, ప్రైవేటు సంస్థలకు రైతుల డేటా అప్పగించడం, భూములు తారుమారు చేయడం, ప్రభుత్వ భూములను ప్రైవేటుపరం చేయడం వంటి సమస్యలు పరిష్కరించేందుకు భూ భారతి చట్టాన్ని తీసుకువస్తున్నామని ప్రకటించారు. అవకతవకపై శ్వేతపత్రం విడుదల చేస్తామని, ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తామని ప్రకటించారు.

**2024లో ధరణి వెబ్ పోర్టల్ బాధ్యతలను ఎన్ఐసీకి అప్పగిస్తూ**

ఆ ప్రకారంగానే ధరణి సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి సలహాలు సూచనలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అందరినీ సంప్రదించాకే, అఖిలపక్ష భేటీ తరువాత నూతన భూ భారతి చట్టం తీసుకువస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. 2024 అక్టోబర్ నెలలో ధరణి వెబ్ పోర్టల్ బాధ్యతలను ఎన్ఐసీకి అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. శాశ్వత పరిష్కారం చూపిస్తామని, సామాన్యులకు ఇబ్బందులు లేకుండా భూ భారతి వెబ్ పోర్టల్ తీసుకువస్తున్నామని ప్రకటించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా లోపాలను సరిచేయించడంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి.

**ధరణి, భూ భారతి వెబ్ పోర్టల్‌లో లొసుగులను గమనించి..**

తాజాగా ధరణి, భూ భారతి వెబ్ పోర్టల్‌లో లొసుగులను గమనించిన మీ సేవా ఏజెంట్లు రిజిస్ట్రేషన్ ఛార్జీల సొమ్మును జేబులో వేసుకున్న కేసులో వరంగల్ పోలీసులు 15 మందిని అరెస్టు చేయగా, మొత్తం 24 మందిపై కేసులు పెట్టారు. మోసాలు జరుగుతున్నట్లు జనగామ పోలీసు స్టేషన్ లో ఈ నెల 7వ తేదీన కేసు నమోదైంది. మీ సేవా కేంద్రాలు, ఆన్ లైన్ సెంటర్లను నిర్వహించే వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి మొబైల్ అప్లికేషన్ ద్వారా ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండికొట్టినట్లు పోలీసుల విచారణలో వెల్లడి అయ్యింది. ప్రభుత్వ ఖజానాలో జమ కావాల్సిన రిజిస్ట్రేషన్ ఛార్జీ, స్టాంప్ డ్యూటీలో 90 శాతం తమ ఖాతాల్లోకి ఏజెంట్లు మళ్లించుకున్నారు. కేవలం 10 శాతం ప్రభుత్వ ఖజానాకు చెల్లించారు.

ధరణి వెబ్ పోర్టల్ రాక ముందు వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లేవారు. సబ్ రిజిస్ట్రార్ లు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించే ముందు కొనుగోలుదారుడు రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ సక్రమంగా చెల్లించాడా లేదా అనేది తనిఖీ చేసేవాడు. అన్ని సక్రమంగా ఉన్నాయని నిర్ధారణకు వచ్చిన తరువాతే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించి, ముగించేవాడు. వీళ్ల నుంచి వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ అధికారాలను తొలగించి మండల తహశీల్దార్లకు కేసీఆర్ ప్రభుత్వం అప్పగించింది.

ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్ల ఆదాయం గండి అయితే తమ దందాలకు అడ్డుగా ఉన్న ఈ విధానాన్ని కేసీఆర్ ప్రభుత్వం చాలా ముందు చూపుతో ధరణిలో తొలగించింది. ఫలితంగా తహశీల్దార్లు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను తనిఖీ చేసే అధికారం లేకుండా పోయింది. దీని వల్ల వేల ఎకరాల ప్రభుత్వ భూములు, వివాదాస్పద భూములు పరాధీనం అయ్యాయి. ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్ల ఆదాయం గండి పడింది. గత ఐదారు సంవత్సరాలుగా ఆడిట్ కూడా జరగడం లేదు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శక విధానం తెస్తున్నామని చెప్పి డొల్ల భూ భారతి పోర్టల్ తీసుకువచ్చారు. పేరు మార్చారు తప్పితే అందులో లోపాలను సరిచేయకపోవడం మీ సేవా ఏజెంట్లు, ఆన్ లైన్ సెంటర్లకు కలిసి వచ్చింది. ఇలాంటి మరికొన్ని సమస్యలను పరిష్కరించేందుకు మరో ఆరు నెలల సమయం పట్టే అవకాశాలు ఉన్నాయని ఒక అధికారి వ్యాఖ్యానించారు. సమస్యల పరిష్కారంకు ఎన్ఐసీ నిపుణులు పనిచేస్తున్నారని ఆయన వివరించారు.

# కాషాయ జెండాకు ఎర్రజెండా ఎర

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయవర్గాలంటున్నాయి. మావోయిస్టులపై ప్రజల్లో ఎంతో కొంత సానుభూతి ఉటుందని.. బీజేపీ పూర్తిగా వ్యతిరేకం అయింది కాబట్టి తమకు అనుకూలంగా మార్చుకునేందుకు లొంగుబాట్లకు ఎక్కువ ప్రాధాన్యం తెలంగాణలో కల్పించారని భావిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మావోయిస్టుల లొంగుబాటుకు సంబంధించి అత్యంత ఆకర్షణీయమైన పునరావాస ప్యాకేజీలను ప్రకటించడం వెనుక స్పష్టమైన రాజకీయ సంకేతాలు ఉన్నాయని అనుకోవచ్చు. గతంలో మావోయిస్టు ఉద్యమంలో పనిచేసిన అగ్రనేతలను, వారి భావజాలంతో ప్రభావితమైన వర్గాలను కాంగ్రెస్ వైపు తిప్పుకోవడం ద్వారా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చే యాలనేది ఆయన ఆలోచనగా కనిపిస్తోంది. కేవలం ఆర్థిక సాయంతోనే కాకుండా, వారిని గౌరవప్రదంగా సమాజంలో కలిపే ప్రయత్నం చేయడం ద్వారా ఒక రకమైన సామాజిక మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం జరుగుతోందని అంచనా వేస్తున్నారు.

**సానుభూతి అస్త్రం**

భారతీయ జనతా పార్టీ (BJP) మావోయిస్టు భావజాలాన్ని, లెఫ్ట్ వింగ్ ఎక్స్ట్రీమిజాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఈ క్రమంలో మావోయిస్టుల పట్ల సానుకూల ధోరణిని ప్రదర్శించడం ద్వారా కాంగ్రెస్ ఒక భిన్నమైన రాజకీయ మార్గాన్ని ఎంచుకుంది. తెలంగాణ సమాజంలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మావోయిస్టుల పట్ల ఇప్ప టికీ ఎంతో కొంత సానుభూతి ఉంటుంది. ఈ వర్గాలను తమ వైపు తిప్పుకోవడం ద్వారా బీజేపీ హిందుత్వ ఎజెండాకు వ్యతిరేకంగా ఒక బలమైన సామాజిక కూటమి నిర్మించాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**రాజకీయ పునరావాసం - భవిష్యత్తు ప్రణాళిక**

ఇటీవల మాజీ మావోయిస్టు అగ్రనేతలతో రేవంత్ రెడ్డి స్వయంగా సమావేశమవ్వడం, వారి రాజకీయ ఆకాంక్షల పట్ల సానుకూలంగా స్పందించినట్లుగా ప్రచారం జరుగుతోంది. మాజీ నక్సలైట్లు చట్టపరంగా రాజకీయాల్లోకి రావాలని ఆయన ఇచ్చిన సలహా, భవిష్యత్తులో వారికి కాంగ్రెస్ పార్టీ టిక్కెట్లు ఇచ్చే అవకాశం ఉందనే సంకేతాలను పంపుతోంది. క్షేత్రస్థాయిలో పట్టున్న మాజీ నేతలను ఎన్నికల బరిలో దింపడం ద్వారా ప్రత్యర్థి పార్టీల వ్యూహాలను చిత్తు చేయవచ్చని రేవంత్ భావిస్తున్నా రు. అంటే, కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మాజీ మావోయిస్టులకు ఒక సురక్షితమైన రాజ కీయ పునరావాస కేంద్రంగా మారే అవకాశం ఉందని అనుకోవచ్చు.

**వ్యూహాత్మక ప్రయోజనం - దీర్ఘకాలిక ప్రభావం**


మాజీ మావోయిస్టులను పార్టీలోకి చేర్చుకోవడం ద్వారా కాంగ్రెస్‌కు రెండు విధాల లాభం చేకూరుతుంది. ఒకటి, వారికున్న కేడర్ బలం పార్టీకి తోడవుతుంది. రెండు, అట్టడుగు వర్గాల గొంతుకగా కాంగ్రెస్ తనను తాను ప్రాజెక్ట్ చేసుకోవడానికి ఇది దోహదపడుతుంది. అయితే, ఈ వ్యూహం ఎంతవరకు ఫలిస్తుందనేది భవిష్యత్తులో జరిగే ఎన్నికలే నిర్ణయిస్తాయి. ఒకవైపు ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవిస్తూనే, మరో వైపు సాయుధపోరాటం చేసి తప్పనిసరి పరిస్థితుల్లో లొంగిపోయిన వారిని తమ గూటికి చేర్చుకోవడం రేవంత్ రెడ్డి మార్కు పాలిటిక్స్.



# రేషన్ కార్డులకు 'ఆరు నెలల' గడువు

(మొదటి పేజీ తరువాయి)

అందిన ఆదేశాల మేరకు మండల స్థాయి నుంచి ప్రభుత్వానికి నివేదికలు అందనున్నాయి. కాగా, కొత్త రేషన్ కార్డుల మంజూరు విషయంలో లబ్దిదారులకు మంజూరు పైన జిల్లాల వారీగా లెక్కలు తీస్తున్నారు. దీంతో, తాజా ప్రతిపాదనల మేరకు పెద్ద సంఖ్యలో రేషన్ కార్డులకు కోత పడే అవకాశం కనిపిస్తోంది. తెలంగాణలో రేషన్ సరఫరాలో ప్రభుత్వం కీలక మార్పులకు సమాయత్తం అవుతోంది. ప్రతీ నెలా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యం కొందరు లబ్దిదారులు తీసుకోవటం లేదనే అంశం ప్రభుత్వానికి నివేదికలు అందాయి. దీంతో...అనర్హులను గుర్తించే అంశం పైన ప్రభుత్వం ఫోకస్ చేసింది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పూర్తి లెక్కలు చేపట్టే పని





ప్రారంభించింది. రేషన్ లబ్ధిదారుల్లో వరుసగా గత ఆరు నెలలుగా ఎవరెవరు బియ్యం తీసుకోవడం లేదో, ఆ వివరాలను పౌర సరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి మండల తహసీల్దార్ ఆఫీస్ లాగిన్‌కు సిబ్బంది పంపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెద్ద సంఖ్యలో కొత్త కార్డులను మంజూరు చేసింది. వీరిలో చాలామంది సన్న బియ్యం తీసుకోవటం లేదని గుర్తించారు. దీంతో, అసలు కారణాలేమిటో గుర్తించాలని అధికారులను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.

**నివేదికల్లో ఏముంది..?**

క్షేత్ర స్థాయి నివేదికల మేరకు నిర్ణయం కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం ఇస్తున్న రేషన్ బియ్యం తీసుకొని వాటిని 10 నుంచి 20 రూపాయాలవకు అమ్ముకుంటున్న అంశం పైన క్షేత్ర స్థాయి నుంచి అధికారులు సమాచారం అందించారు. దీని కారణంగా ప్రభుత్వం అందిస్తున్న బియ్యం పక్క దారి పడుతోంది. ప్రభుత్వం అందిస్తున్న బియ్యం పోషకాలతో ఉన్నా.. మార్కెట్ లో దొరికే సాధారణ బియ్యం వైపే మొగ్గు చూపుతున్నట్లు గుర్తించారు. దీంతో.. ప్రభుత్వం ఆరు నెలల పాటు బియ్యం తీసుకోని వారి జాబితాలను సిద్ధం చేయాలని పౌర సరఫరాల శాఖ కు సూచించింది. ఈ మేరకు క్షేత్ర స్థాయి నుంచి అధికారులు నివేదికలను సిద్ధం చేస్తున్నారు. దీని ద్వారా ఆరు నెలలు రేషన్ తీసుకోని వారి కార్డులను రద్దు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీని పైన పూర్తి నివేదికలు అందిన తరువాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

# ట్రంప్, మస్క్ రాక్షసులు: గరికపాటి

ముద్ర డెస్క్ :

అమలాపురంలో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభల వేదికగా ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ లపై ఆయన చేసిన తీవ్ర వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ప్రపంచ రాజకీయ పరిస్థితులు, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, ఆధ్యాత్మిక వేదికలపై వ్యక్తమవుతున్న అభిప్రాయాల మధ్య ఉన్న సంబంధం గురించి విస్తృతంగా చర్చ జరుగుతోంది.

ప్రస్తుతం ఇజ్రాయిల్–ఇరాన్ మధ్య పెరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా ఆం దోళన కలిగిస్తున్నాయి. గల్ఫ్ దేశాలు కూడా ఈ ఉద్రిక్తతల ప్రభావానికి లోనవుతున్నాయి. దుబాయ్ వంటి ప్రాంతాల్లో కూడా భద్రతాపరమైన ఆందోళనలు పెరుగుతున్నాయి. అమె రికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చడంతో అంతర్జాతీయ సంబంధాలు మరింత క్లిష్టంగా మారాయి.

ఇలాంటి గ్లోబల్ పరిస్థితుల నేపథ్యంలో గరికపాటి నరసింహారావు చేసిన వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆయన ట్రంప్, మస్క్‌లను "రాక్షసులు"గా అభివర్ణిస్తూ.. ప్రపంచాన్ని నాశనం చేసే శక్తులుగా విమర్శించారు. అంతేకాదు వీరిని సంహరించడానికి శ్రీమహావిష్ణువు అవతరించాలంటూ వ్యాఖ్యానించడం సంచలనమైంది.. ఆధ్యాత్మిక వేదికపై ఇలాంటి రాజకీయ వ్యాఖ్యలు క్షణాల్లోనే అందరి దృష్టిని ఆకర్షించాయి.

ఇక్కడ ప్రధానంగా చర్చకు వస్తున్న అంశం ఏమిటంటే ఆధ్యాత్మిక ప్రవచనకర్తలు తమ ప్ర వచనాల్లో ఎంతవరకు రాజకీయాలపై వ్యాఖ్యానించాలి? సాధారణంగా ఆధ్యాత్మిక ప్రవచనాలు ధర్మం, జీవన విధానం, నీతులు, సంస్కృతి వంటి అంశాలపై దృష్టి కేంద్రీకరిస్తారు. ప్రజలకు మానసిక ప్రశాంతత, ఆత్మపరిశీలనకు దారి చూపడం వాటి ముఖ్య ఉద్దేశ్యం. అ యితే సమాజంలో జరుగుతున్న పరిణామాలపై స్పందించడం కూడా కొంతవరకు సహజ మే. కానీ వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం వైరల్ గా మారింది.

మరోవైపు ట్రంప్, మస్క్‌లపై వచ్చిన విమర్శల నేపథ్యంలో వారి పాత్రపై కూడా చర్చ జరుగుతోంది. ఎలాన్ మస్క్ ఒక వ్యాపారవేత్తగా ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులు పెట్టడం, కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేయడం ఆయన వ్యాపార వ్యూహంలో భాగమే. గ్లోబలైజేషన్ యుగంలో వ్యాపారం దేశాల సరిహద్దులను దాటి విస్తరిస్తుంది. దీనిని పూర్తిగా ప్రతికూలంగా చూడడం సరైనదా అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది.

అలాగే అమెరికా అధ్యక్షుల విధానాల విషయానికి వస్తే, సామ్రాజ్యవాద ధోరణి అనే విమర్శ చాలా కాలంగా ఉంది. ట్రంప్ మాత్రమే కాకుండా గతంలో బరాక్ ఒబామా వంటి నాయకుల పాలనలో కూడా అమెరికా విదేశాంగ విధానంపై ఇలాంటి విమర్శలు వినిపించాయి. కాబట్టి ఒక్క వ్యక్తిని మాత్రమే లక్ష్యంగా చేసుకుని విమర్శించడం సరైన విశ్లేషణగా భావించలేమని కొందరు అభిప్రాయపడుతున్నారు.



# ఆకాశంలో కనిపించని యుద్ధం

**బీ–2 స్టెల్త్ బాంబర్ భీకర శక్తి**

ముద్ర డెస్క్:

ప్రపంచ సైనిక చరిత్రలో సాంకేతిక అద్భుతంగా నిలిచిన యుద్ధ విమానాల్లో B–2 స్పిరిట్ స్టెల్త్ బాంబర్ ఒక ప్రత్యేక స్థానం సంపాదించింది. శత్రు దేశాల రాడార్లకు దొరకకుండా దూసుకెళ్లే సామర్థ్యం, అణు, సంప్రదాయ బాంబులను మోసే శక్తి, దూరప్రయాణాల్లో అసాధారణ సామర్థ్యం.. ఇవన్నీ కలిపి దీన్ని 'ఆకాశంలోని మృత్యుపాశం'గా మలిచాయి. అమెరికా గగనతల ఆధిపత్యానికి ఇది ప్రధాన ఆయుధంగా నిలుస్తోంది.

బీ–2 యొక్క ప్రధాన బలం దాని స్టెల్త్ టెక్నాలజీ. సాధారణంగా యుద్ధ విమానాలు రాడార్ తరంగాలను ప్రతిఫలింపజేస్తాయి. కానీ బీ–2 ప్రత్యేక ఆకృతి, ప్రత్యేక కోటింగ్ వల్ల రాడార్‌కు కనిపించకుండా ఉంటుంది. దీని వల్ల శత్రు దేశం గగనతలంలోకి ప్రవేశించినా ముందస్తుగా గుర్తించడం చాలా కష్టం. అదే సమయంలో 50,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తూ భారీ స్థాయిలో విధ్వంసం సృష్టించగలదు.

ఈ విమానం సుమారు 20 టన్నుల ఆయుధ సామర్థ్యం కలిగి ఉంటుంది. అణు బాంబులు, గైడెడ్ మ్యూనిషన్స్, బంకర్ బస్టర్ బాంబులు.. అన్నింటినీ మోసే సామర్థ్యం ఉంది. ముఖ్యంగా భూగర్భంలో ఉన్న లక్ష్యాలను ధ్వంసం చేయడానికి ఇది అత్యంత కీలకమైనది. దీని రేంజ్ కూడా విశేషమే. ఒకసారి ఇంధనం నింపితే దాదాపు 9,600 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదు. గాలిలోనే రీఫ్యూయలింగ్ ద్వారా ప్రపంచంలో ఏ మూలనైనా చేరి దాడులు చేయగలదు.

ఇరాన్‌పై జరిగిన దాడులు ఈ విమానం సామర్థ్యాన్ని మళ్లీ ప్రపంచానికి చూపించాయి. అమెరికా మిస్సోరి నుంచి బయలుదేరిన బీ–2 బాంబర్లు 37 గంటల నిరంతర ప్రయాణం చేసి లక్ష్యాలను చేరుకున్నాయని సమాచారం. మధ్యలో గాలిలోనే ఇంధనం నింపుకుంటూ ప్రయాణించడం ద్వారా ఇవి ప్రపంచంలో ఎక్కడైనా తక్షణమే దాడి చేయగల సామర్థ్యాన్ని నిరూపించాయి.

ఈ ఆపరేషన్‌లో బీబీయూ–31 వంటి గైడెడ్ బాంబులు ఉపయోగించబడినట్లు తెలుస్తోంది. ఇవి అత్యంత ఖచ్చితత్వంతో లక్ష్యాన్ని తాకగలవు. ముఖ్యంగా భూగర్భంలో ఉన్న బాలిస్టిక్ మిస్సెల్ కేంద్రాలను ధ్వంసం చేయడంలో ఇవి కీలకం. శత్రు దేశ రక్షణ వ్యవస్థలకు చిక్కకుండా ముందస్తు హెచ్చరిక లేకుండా దాడి చేయడం బీ–2 యొక్క ప్రధాన బలం.

అయితే ఇలాంటి దాడులు కేవలం సాంకేతిక సామర్థ్యాన్ని మాత్రమే కాదు.. ప్రపంచ రాజకీయాల మారుతున్న స్వరూపాన్ని కూడా ప్రతిబింబిస్తాయి. ఆధునిక యుద్ధం ఇక సరిహద్దుల వద్ద జరిగే యుద్ధం కాదు. వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను కూడా కొన్ని గంటల్లోనే దాడి చేయగల సామర్థ్యం ఇప్పుడు సూపర్ పవర్స్ చేతిలో ఉంది. ఇది యుద్ధాన్ని మరింత ప్రమాదకరంగా అంచనా వేయలేనిదిగా మారుస్తోంది.

బీ–2 బాంబర్ ఒకవైపు సాంకేతిక అద్భుతం అయినప్పటికీ మరోవైపు ఇది యుద్ధ భయానకతకు ప్రతీక కూడా. రాడార్‌కు కనిపించకుండా హెచ్చరిక లేకుండా దాడి చేసే సామర్థ్యం అంతర్జాతీయ భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇది నిరోధక శక్తిగా పనిచేస్తుందా? లేక యుద్ధాలకు మరింత దారితీస్తుందా? అన్నది ప్రపంచ నాయకులు ఆలోచించాలి.

మొత్తానికి , B–2 బాంబర్ కేవలం ఒక యుద్ధ విమానం కాదు. అది ఆధునిక యుద్ధ వ్యూహాల, సాంకేతిక శక్తి, గ్లోబల్ డామినేషన్ కు ప్రతీక. ఆకాశంలో కనిపించని నీడలా దూసుకెళ్లి లక్ష్యాన్ని ఛేదించే ఈ విమానం.. భవిష్యత్ యుద్ధాల రూపురేఖలను మార్చేస్తోంది.




సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
03.03.2026 మంగళవారం, హైదరాబాద్



**చంద్రగ్రహణం – 10 నియమాలు**

వంట చేయకూడదు
* గ్రహణ సమయంలో వంట చేయడం నివారించాలి
* ఆహారం నశించే అవకాశముందని విశ్వాసం



### కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో
# ఏసీబీ దాడులు

- **లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారి గణేష్**



**ముద్ర, కుత్బుల్లాపూర్ :**

కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏసీబీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ జారీ చేసేందుకు లంచం డిమాండ్ చేసిన జూనియర్ అసిస్టెంట్ (ఇన్‌ఛార్జ్ గ్రామ పాలనా అధికారి) జి. గణేష్, ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్గా చిక్కారు. బాధితుడి నుంచి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ ప్రాసెస్ చేయడానికి గణేష్ రూ. 20,000 లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా గతంలోనే రూ. 5,000 అడ్వాన్గా తీసుకున్నారు. మిగిలిన రూ. 15,000 నగదును సోమవారం బాధితుడి నుంచి తీసుకుంటుండగా, సిటీ రేంజ్ 1 ఏసీబీ అధికారులు ఆయనను పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.15,000 లంచం నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు, ఆయనను అరెస్ట్ చేసి నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు ధైర్యంగా ముందుకు రావాలని, ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబర్ 1064 కు లేదా వాట్సాప్ నంబర్ 9440446106 కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు కోరారు.

## పన్ను ఎగవేతదారులపై విజిలెన్స్ కొరడా

- **అక్రమ మైనింగ్, నిత్యావసర వస్తువుల దారి మళ్లింపుపై నజర్**
- **ప్రభుత్వ ఆదాయానికి రూ.10.79 కోట్ల గండి**
- **గత నెలలో ఐదు శాఖలతో ముమ్మర తనిఖీలు**
- **హైవేలు, ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్‌ల వద్ద వెయ్యికి పైగా వాహనాలు సీజ్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో పన్ను ఎగవేతదారులు, అక్రమ మైనింగ్, నిత్యావసర వస్తువుల దారి మళ్లింపుపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దృష్టిసారించింది. ఈ మేరకు గత నెలలో రవాణా, జీఎస్టీ, గనులు, అటవీ, పోలీస్ శాఖలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ముమ్మర తనిఖీల్లో భారీగా అక్రమాలను గుర్తించింది. రాష్ట్ర వ్యాప్తంగా హైవేలు, ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్‌ల వద్ద వెయ్యికి పైగా వాహనాలను తనిఖీ చేసిన సంబంధిత అధికారులు వివిధ నిబంధనల ఉల్లంఘనల కింద 200 వాహనాలను సీజ్ చేశారు. స్పెషల్ రెయిడ్స్‌లో భాగంగా 245 మెట్రిక్ టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో పాల్గొన్న 6 ఎక్స్‌కవేటర్లు, 15 ట్రాక్టర్లు సహా మొత్తం 24 వాహనాలను జప్తు చేసి, 19 మందిని అరెస్ట్ చేశారు. పీడీఎస్ బియ్యం దారి మళ్లింపుపై జరిపిన తనిఖీల్లో సుమారు 5.8 లక్షల విలువైన 131 క్వింటాళ్ల బియ్యం, 27 క్వింటాళ్ల గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. సంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లోని సంక్షేమ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అక్కడి లోపాలను సరిదిద్దాల్సిందిగా సంబంధిత శాఖలకు నివేదించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ సోమవారం హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడారు. గత నెలలో నిర్వహించిన ఆపరేషన్లతో ప్రభుత్వ ఆదాయానికి రూ.10.79 కోట్ల గండి పడిందన్నారు. అందులో ఇప్పటి వరకు రూ.1.96 కోట్లను వసూలు చేశామని తెలిపారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం చేసినా.. అక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 14432కు తెలియజేయాలని సూచించారు.

## తెలంగాణ లో బుల్‌డోజర్ల రాజ్యం

**ముద్ర, ఖమ్మం:**



రాష్ట్రంలో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని,పేదల ఇండ్లను కూల్చడమే పాలకులు ఒక పనిగా పెట్టుకున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యమంటూ పాలకులు ఊదరగొడుతున్నారని, వాస్తవానికిప్పుడు కొనసాగుతున్నది "బుల్డోజర్ల రాజ్యం"అని ఆయన దుయ్యబట్టారు. రామగుండంలో పేదల ఇండ్లను, మహబూబ్ నగర్ లో దివ్యాంగుల గూళ్లను,వెలుగుమట్లలో నిరుపేదల గుడిసెలను కూల్చారని,హైడ్రా పేరుతో పాలకులు విధ్వంసం సృష్టిస్తున్నారన్నారు.ఎంపీ రవిచంద్ర హైదారాబాద్ తెలంగాణ భవన్ లో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు జాడే కనిపించట్లేది ఆవేదన చెందారు.కాంగ్రెస్ నాయకులకు పాలించడం రాక"డైవర్షన్ పాలిటిక్స్" చేస్తున్నారని,మూసీ సుందరీకరణ,గాంధీ సరోవర్ పేరుతో అపార్టుమెంట్లు,పక్కా ఇండ్లను నేలమట్టం చేసే ప్రయత్నాలు జరుగుతుండడం శోచనీయమన్నారు. రాష్ట్రానికి వచ్చిన కాంగ్రెస్ అధినేత రాహూల్ గాంధీ ఇక్కడ నెలకొన్న గందరగోళ పరిస్థితులపై దృష్టి సారిస్తే బాగుంటుందని ఎంపీ రవిచంద్ర హితవు పలికారు.ఎన్నికలకు ముందు రాహూల్, ప్రియాంకా గాంధీలు వరంగల్, కామారెడ్డి తదితర డిక్లరేషన్లను ఆర్భాటంగా ప్రకటించి,432కుపైగా హామీలిచ్చారన్నారు. ఈ హామీల అమలు ఎంతవరకు వచ్చిందో, ఇస్తామన్న 2లక్షల ఉద్యోగాలలో ఇప్పటి వరకు భర్తీ జరిగిందెన్నో సమీక్షించాల్సిన బాధ్యత రాహూల్ గాంధీపై ఉందని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లినప్పుడు "బుల్డోజర్ రాజ్య"అంటూ విమర్శించే రాహూల్ తాము పాలిస్తున్న తెలంగాణలో ప్రతినిత్యం బుల్డోజర్ల కింద పేదల బతుకులు చితికిపోవడం గురించి పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. వెలుగుమట్ల భూదాన్ భూముల్లో కొన్నేళ్లుగా జీవనం గడుపుతున్న పేదలపై పోలీస్ బలగాలతో విరుచుకుపడి గుడిసెలను నేలమట్టం చేయడంతో "ఇరాన్, గాజా"ల మాదిరి పరిస్థితి నెలకొన్నదని ఎంపీ వద్దిరాజు ఆందోళన వ్యక్తం చేశారు. నిల్వ నీడలేక, ఆకలితో అలమటిస్తున్న బాధితులను బీఆర్ఎస్ తరఫున ఆదుకుంటుంటే ఓర్వలేని పాలకులు పోలీసులతో కొట్టిస్తున్నారని, అంబేడ్కర్ భవనం నుంచి తరిమికొట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వెలుగుమట్లలో నెలకొన్న పరిస్థితులు, బాధితుల హృదయవిదారక బతుకులను కళ్లారా చూసేందుకు ఖమ్మంలో పర్యటించాల్సిందిగా మీడియా ద్వారా రాహూల్ గాంధీని ఆయన కోరారు. బాధితులకు పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీనిచ్చినట్లు తాము అధికారంలోకి వచ్చాక కట్టించి న్యాయం చేస్తామని ఎంపీ వద్దిరాజు చెప్పారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, గాంధీ నాయక్, బొమ్మెర రాంమూర్తి, డాక్టర్ కురవ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమాసియాలో యుద్ధం

- **తెలుగు రాష్ట్రాల అలర్ట్**
- **ఢిల్లీలో తెలంగాణ భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్**
- **యుద్ధ ప్రభావంతో విదేశాల్లో చిక్కుకున్న రాష్ట్ర ప్రజలపై దృష్టి**
- **ఏపీ ప్రభుత్వం సాయం కోసం ప్రత్యేక చర్యలు ప్రారంభం**
- **ఎన్ఆర్టీ, ఆర్టీజీఎస్‌కు బాధ్యతలు అప్పగించిన ఏపీ సీఎం**
- **కేంద్రంతో సమన్వయం చేసి పౌరుల భద్రతకు చర్యలు తీసుకోవాలని ఆదేశం**



**ముద్ర, న్యూఢిల్లీ :**

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ పౌరుల కోసం రాష్ట్ర ప్రభుత్వం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24×7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. అవసరమైన సమన్వయం, సహాయం అందించేందుకు ఈ కంట్రోల్ రూమ్ పనిచేస్తుంది. మేరకు తెలంగాణ భవన్ సీనియర్ అధికారులు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత భారత రాయబార కార్యాలయాలతో ఇప్పటికే నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితులను అంచనా వేస్తున్నారు. ఆయా దేశాల్లో నివసిస్తున్న, చిక్కుకున్న తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యుల నుంచి వస్తున్న సమాచారాన్ని దృష్టిలో ఉంచుకుని వారి యోగక్షేమాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ సమన్వయంతో అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఇరాన్, గల్ఫ్ తదితర ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ పౌరులు, తెలంగాణలో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఎలాంటి ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు, అత్యవసర పరిస్థితులు ఎదురైతే ఈ కంట్రోల్ రూంను సంప్రదించవచ్చని సూచించారు.

**కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు:**

వందన బరువా : +91 9871999044
సీహెచ్. చక్రవర్తి : +91 9958322143
జావేద్ హుస్సేన్ : 9910014749
రక్షిత్ నాయక్ : +91 9643723157

**పౌరులు సురక్షితంగా ఉండేలా ఏర్పాట్లు:**

పశ్చిమాసియాలో తలెత్తిన యుద్ధం నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న రాష్ట్ర ప్రజలు సురక్షితంగా ఉండేలా చూడాలని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. దీనిపై ఆర్టీజీఎస్ అధికారులు, ఏపీఎన్ఆర్టీ ప్రతినిధులతో క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. సౌదీ అరేబియా, దుబాయ్, ఖతార్, కువైట్ తదితర దేశాల్లోని రాష్ట్ర ప్రజలు యుద్ధం కారణంగా ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. ఇందుకోసం కేంద్రంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అక్కడ చిక్కుకుపోయిన వారిని సంప్రదించి, తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం నిర్దేశించారు. సహాయక చర్యల విషయంలో ఏపీ ఎన్ఆర్టీ, ఆర్టీజీఎస్ కలిసి పనిచేయాలని, నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలని అధికారులకు సీఎం చెప్పారు. ఎయిర్ పోర్టులు మూసివేయడం, విమాన సర్వీసుల రద్దుతో వెంటనే రాష్ట్రానికి తిరిగి వచ్చే పరిస్థితులు లేనందున, పరిస్థితులు చక్కబడేవరకు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, దీనికి ఏపీ ఎన్ఆర్టీ సహకరిస్తుందని సీఎం చెప్పారు.

**హెల్ప్ లైన్:**

గల్ఫ్ దేశాల్లో రాష్ట్ర ప్రజల రక్షణ కోసం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఏపీ ఎన్ఆర్టీతో కలిసి చర్యలు చేపట్టింది. వారికి సహాయం కోసం 0863 2340678 హెల్ప్ లైన్ నెంబర్, 85000 27678 వాట్సప్ నెంబర్‌ను 24 గంటలు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఏపీ ఎన్ఆర్టీకో ఆర్డినేటర్ల ద్వారా తాత్కాలిక వసతి కల్పిస్తున్నారు. ప్రవాసాంధ్రులు సంప్రదించిన వెంటనే ఏపీ ఎన్నార్టీ వారికి తక్షణం సహాయ, సహకారాలు అందించేలా ఏర్పాట్లు చేసింది. హెల్ప్ లైన్ నెంబర్లతో పాటు helpline@apnrts.com, support@apnrts.com, info@apnrts.com ఈ మెయిళ్లు, https://apnrts.ap.gov.in వెబ్సైట్‌ను కూడా సంప్రదించవచ్చు. ఈ సమీక్షలో ఆర్టీజీఎస్ అధికారులు, ఎన్ఆర్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మార్పుకు శ్రీకారం చుట్టిన బండి సంజయ్

- **అవినీతి లేకుండా పనిచేయాలి**
- **అక్రమ నిర్మాణాలపై కొరడా**
- **కరీంనగర్ మున్సిపల్ సమీక్షా సమావేశంలో**
- **కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**



**ముద్ర, కరీంనగర్:**

రాష్ట్రమంతా టౌన్ ప్లానింగ్ విభాగంలో మార్పులకు కరీంనగర్ స్ఫూర్తిగా నిలిచేలా పని చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అధికారులకు సూచించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రక్షాళనకు ఆయన నడుం బిగించారు. అందులో భాగంగా కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావులతో కలిసి సోమవారం కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. 'ఇప్పటిదాకా ఒక లెక్క.. ఇకపై మరో లెక్క.. ఇళ్ల నిర్మాణాలకు అనుమతుల కోసం డబ్బులు అడగొద్దు.. బాధితులను ఇబ్బంది పెట్టొద్దు.. అవినీతికి తావు లేకుండా ఇంటి అనుమతుల కోసం వచ్చే ప్రజలకు సులువుగా అనుమతి ఇచ్చేలా చేయాలని.., బ్రోకర్ల ద్వారా ఏజెన్సీలను పెట్టుకుని ప్రజలను వేధిస్తూ లంచాలు తీసుకుని అనుమతి ఇవ్వాలనుకుంటే మాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదు. అలాంటి వాళ్లు ఎవరైనా ఉంటే వెంటనే బదిలీపై వెళ్లవచ్చు. నిజాయితీగా రూల్స్ ప్రకారం పనిచేసే వాళ్లపై మా రాజకీయ ఒత్తిళ్లు ఉండవు. వాళ్లపై ఈగ కూడా వాలనివ్వను.. కంటికి రెప్పలా కాపాడుకుంటా.' అని స్పష్టం చేశారు. టౌన్ ప్లానింగ్ లో కరప్షన్ పై మీడియాలో వార్తలు వస్తే వెంటనే స్పందించాలని అన్నారు. మున్సిపల్ ఆఫీసుకు వచ్చే ప్రజల కోసం హెల్ప్ డెస్క్ తరహా టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రత్యేక పేరుతో డెస్క్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఏ విభాగంలో ఏ అధికారి ఏ విధంగా పనిచేస్తున్నారు? అవినీతికి పాల్పడుతున్నారా? అనే విషయాలన్నీ నాకు తెలుసని .., అన్నారు. పనుల కోసం వచ్చే సామాన్య ప్రజలకు ఇబ్బంది లేకుండా సహకరించాలని సూచించారు. అనుమతి లేకుండా అనధికారికంగా ఇండ్లు, కమర్షియల్ భవనాలు నిర్మిస్తుంటే.. ఆరంభంలోనే వాటిని ఆపాలిలని, నోటీసులివ్వాలని సూచించారు. మూడు రోజుల్లోగా కార్పొరేటర్లు, టౌన్ ప్లానింగ్, రెవిన్యూ, శానిటేషన్ విభాగాల అధికారులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని అన్నారు. కరీంనగర్ స్ఫూర్తితో రాష్ట్రమంతటా టౌన్ ప్లానింగ్ విభాగంలో మార్పులకు నాంది పలకాలని సూచించారు.

## కళాశాల బస్సును ఢీ కొట్టిన బైక్..

- **ముగ్గురు యువకుల మృతి**

**ముద్ర, ఏలూరు:**


అతివేగం ముగ్గురు యువకుల ప్రాణాలను బలి తీసుకుంది. బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు ఓ ఇంజినీరింగ్ కళాశాల బస్సును ఢీ కొట్టి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ఏలూరు జిల్లా పెదవేగి మండలం జానంపేట ఎఫ్‌సీఐ గోడౌన్స్ సమీపంలో జరిగింది. ఏలూరు బీడీ కాలనీకి చెందిన ఈ ముగ్గురూ కూలి పనులు చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటన స్థలానికి చేరుకున్న ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ వివరాలు సేకరిస్తున్నారు.




# సూర్యాపేట మైనింగ్ వేలంలో భారీ అక్రమాలు

- **విచారణ జరిపి.. టెండర్లు రద్దు చేయాలి**
- **సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ**





**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

సూర్యాపేట జిల్లాలో మైనింగ్ ఈ వేలంలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై స్వతంత్ర విచారణ చేసి టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 1,100 ఎకరాల రిజర్వ్డ్ ఫారెస్ట్‌పై స్పష్టత లేకుండానే వేలం నిర్వహించారని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయన సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. కీలక సాంకేతిక వివరాల్లో లోపం , లాటిట్యూడ్, లాంగిట్యూడ్, డీజీపీఎస్ సర్వే వివరాలు వెల్లడించలేదని కేటీఆర్ అందులో విమర్శించారు. జియోలాజికల్ నివేదికలు సైతం లేవని ఆరోపించారు. మినరల్ ఆక్షన్ రూల్స్ 2015 ఉల్లంఘన జరిగిందని హైకోర్టు సూచనలు పట్టించుకోలేదన్నారు. పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్ల ప్రకటన, కంపెనీల ఎంపికపై అనుమానాలున్నాయని పేర్కొన్నారు. కేసులు ఎదుర్కొంటున్న డెక్కన్ సిమెంట్స్, ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్‌కు బ్లాక్‌ల కేటాయింపుపై సందేహాలున్నాయని తెలిపారు. అన్ని అనుమతుల తర్వాతే పారదర్శకంగా కొత్త వేలం నిర్వహించాలని సూచించారు. టెండర్ నోటీసు జారీకి ముందే మినరల్ బ్లాక్‌లను ఖచ్చితంగా గుర్తించి పూర్తి వివరాలు వెల్లడించడం తప్పనిసరి అన్న కేటీఆర్... అయినప్పటికీ ప్రభుత్వం ఈ నిబంధనలు పాటించలేదని విమర్శించారు. న్యాయపరమైన విచారణలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ వేలాన్ని ముందుకు తీసుకెళ్లడం, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన సూచనలను పట్టించుకోకపోవడం, చట్టపరమైన , పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్లను ప్రకటించడం వంటి అంశాలు తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు.

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేలపుట్టినిల్లు.. అందుకేమీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనాసరే.. మేంప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# ఔషధ, ఆరోమాటిక్ మొక్కలతో ఆరోగ్య సంరక్షణ, జీవనోపాధులు

- **( 03 మార్చి "ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం" సందర్భంగా)**

నాటి పాతరాతి యుగం నుంచి నేటి డిజిటల్ యుగం వరకు కూడా ప్రపంచ మానవాళి ఆహారం, ఔషధాలు, గృహనిర్మాణం, ఇంధనం, వస్త్రాల కోసం వనాలపై లేదా అటవీ వృక్ష జంతుజాలాలపై ఆధారపడి ఉంటున్నాడు. ప్రకృతి సహజ అందాల విందులు ఆరబోస్తున్న అటవీ సంపద పర్యావరణ వ్యవస్థను కాపాడడం జరుగుతున్నప్పటికీ మానవ తప్పిదాలతో వన్యప్రాణుల సంఖ్య తగ్గడం, జీవ వైవిధ్యానికి విఘాతం కలగడం జరుగుతున్నది. అన్ని రకాల వృక్ష జంతు జాతులతో మనిషి కలిసి స్నేహంగా జీవితాలను గడపని యెడల రాబోయే తరాలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వన్యప్రాణుల సమతుల్యత దెబ్బ తినకుండా వాటిని రక్షించుకుంటూ, జీవవైవిధ్యానికి పట్టం కట్టవలసిన సమయం ఆసన్నమైనది. భూమిపై సహజంగా జీవితాలను గడుపుతున్న అనేక రకాల జీవరాసులను పరిరక్షించుకోని ఎడల పలు జాతులు అంతరించే ప్రమాదంతో పాటు మానవ ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని అందరం తెలుసుకోవాలి.

భావితరాల మనుగడకు జీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థల సమతుల్యత:

మన పిల్లలకు అపార సంపదలను సంపాదించిపెట్టినప్పటికీ తాగడానికి చుక్క శుద్ధ జలం, పీల్చడానికి పరిశుద్ధ గాలి లేనపుడు మనిషి వద్ద ఎన్ని ఉన్నా నిరర్థకమే అవుతాయని తెలుసుకోవాలి. పర్యావరణ వ్యవస్థను కాపాడడం, జీవ వైవిధ్యాలను సంరక్షించడం, సహజ ప్రక్రియలను నియంత్రించడం, మానవ జాతికి కనీస అవసరాలు తీర్చడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరడానికి వన్యప్రాణులు అమూల్య సేవలను అందిస్తున్నాయి. మనిషి అడక ముందే కూడు, గూడ, గుడ్డను ఇస్తున్న వన్యప్రాణుల పరిరక్షణ అవసరాలను ప్రజల్లో ఏకరువు పెట్టడానికి, అవసర హెచ్చరికలు చేయడానికి ప్రతి ఏట 03 మార్చి "ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం" లేదా "వరల్డ్ వైల్డ్‌లైఫ్ డే" నిర్వహించడం జరుగుతున్నది. అడవుల్లో దాదాపు 60,000 వృక్ష జాతులు, 80 శాతం ఉభయచర జాతులు, 75 శాతం పక్షి జాతులు ప్రపంచవ్యాప్త 1.6 మిలియన్ల ప్రజలకు నేరుగా నిత్యావసరాలను తీర్చుతున్నాయి.

**2026 ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం ఇతివృత్తం:**

నేటి జీవజాతుల్లో దాదాపు ఒక మిలియన్ వరకు అంతరించే అంచున ఉన్నాయనే భయంకర వాస్తవమే నిజమైతే మానవ శాంతియుత జీవనం బుగ్గిపాలు కావడం తప్పనిసరి. భూమిని, భూగ్రహంపై సహజంగా జీవిస్తున్న జీవరాశులను కాపాడకపోవడం మన కనీస కర్తవ్యం అని తెలుసుకొనుటతో పాటు జీవవైవిధ్య పరిరక్షణకు అవసర నిధులు కూడా అందించి సహకరించడం ప్రధాన అంశమని ఐరాస పేర్కొంటున్నది. ప్రపంచ సగం జిడిపీ ప్రకృతి సంపద మీదనే ఆధారపడి ఉంటున్నది. జీవవైవిధ్య పరిరక్షణకు లేదా పునర్నిర్మాణానికి ప్రతి ఏట 143 బిలియన్ల డాలర్ల నిధులను ప్రపంచ దేశాలు అందిస్తున్నాయని, ఈ సత్కార్య నిర్వహణకు 824 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని, కనీసం ఏడాదికి 500 బిలియన్ డాలర్లు అయినా ప్రపంచ దేశాలు వెచ్చించాలని ఐరాస పేర్కొనడం విశేషం. "ఇంటర్నేషన్ ట్రేడ్ ఇన్ ఎండేంజర్డ్ స్పీసీస్ ఆఫ్ వైల్డ్ ఫానా అండ్ ఫ్లోరా" అనే సంస్థ 50వ వర్షికోత్సవం సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో వన్యప్రాణుల పరిరక్షణ కార్యాలు పటిష్ట పథకాలతో నడవాలి.

**ప్రపంచ వన్యప్రాణుల దినం వేదికగా చేయదగిన కార్యక్రమాలు:**

ప్రపంచ వన్యప్రాణుల దినం వేదికగా ప్రజలకు అవగాహన కల్పించడం, వన్యప్రాణులను కాపాడే సంస్థలు లేదా వ్యక్తులను గుర్తించడం, ఆర్థిక నిధుల సేకరణ, ప్రభుత్వాల చొరవ, ప్రజల సహకారం, ఎన్జీవోల చొరవ లాంటివి నిర్వహిస్తూనే వన్యప్రాణుల పరిరక్షణ ఆవశ్యకతను వివరించే కార్యశాలలు, సెమినార్లు, ఆన్‌లైన్ లేదా ఆఫ్-లైన్ అవగాహనలు, నిధుల సేకరణ కార్యక్రమాలు, ప్రపంచ దేశాల సమన్వయ సహకారాలు, విజ్ఞాన వితరణలు లాంటివి నిర్వహించడం మంచిది. పర్యావరణ సమతుల్యతకు గొడుగు పట్టడం, జీవవైవిధ్యానికి ఊపిరులూదడం, సహజ అందాలను ఆస్వాదిస్తూ కాపాడుకోవడం లాంటివి నిరంతరం కొనసాగాలి.

జీవవైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత, ఔషధాల లభ్యత, శుద్ధ జలాలు, పీల్చే గాలులు, వాతావరణ సానుకూల మార్పులు సమకూరుతాయి. ఈ ప్రధాన విషయాలను నేటి మనిషి పెడచెవిన పెట్టి విధ్వంసానికి పాలుపడితే రేపటి తరం మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, "మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కోవద్దు" అని గుణపాఠం నేర్చుకోవడంతో పాటు జీవవైవిధ్య దీపాన్ని కాపాడుకుంటూ భూగృహాన్ని లేదా ఇల్లును చక్కదిద్దుకుందాం.

ప్రపంచ వన్యప్రాణుల దినం 2026 ఇతివృత్తంగా "ఔషధ, ఆరోమాటిక్ మొక్కలు : ఆరోగ్య, వారసత్వ, జీవనోపాధి సంరక్షణ" అనబడే అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచ మానవాళి ఆయురారోగ్యాలకు జీవవైవిధ్యంతో పాటు పర్యావరణ వ్యవస్థల సమతుల్యత అవసరం అవుతాయని, వీటి సాధనకు అవసరమైన ఆర్థిక నిధులు అందించాలని ప్రపంచ దేశాలను, ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలను కోరడం జరుగుతున్నది.



డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037



# రంగుల పండుగ
## హోళీ

రంగుల పండుగ హోళీ
హృదయాలపై వెలుగులు చల్లి,
వర్ణాల వర్షంలో తడిసి
చలికే చెప్పే వీడ్కోలు.

ఎరుపు ప్రేమకు ప్రతీక,
పసుపు పుణ్యపు చిరునవ్వు,
ఆకుపచ్చ ఆశల పిలుపు,
నీలి నమ్మకపు కలువవ్వు.

చేతిలో గులాల్ పట్టుకుని
మనసులు కలిపే వేళ,
నిన్నటి నొప్పులు కడిగేసి
నవ్వులు చిందించే వేళ.

బంధాల మధ్య గోడలు కూల్చి
స్నేహం రంగులై పరచి,
కలహాలపై క్షమ కురిపించి
కరుణ కాంతులు మెరిపించు.

హోళి అంటే హంగామా కాదు,
హోళి అంటే హృదయోత్సవం,
మనుషుల మధ్య ప్రేమ చల్లే
సజీవ సౌహార్ద పర్వం.

రంగులు మన ముఖాలకే కాదు
మనసులకూ అంటుకోవాలి,
ప్రతి రోజూ హోళిలా మారి
ప్రపంచం ప్రేమమయం కావాలి.



గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం.

# ప్రకృతికి కృతజ్ఞత

- **హోళీ పండుగ భారతీయ సంస్కృతిలో ప్రత్యేకమైన స్థానం కలిగి ఉంది.**
- **ఇది రంగుల పండుగ మాత్రమే కాకుండా... అనేక పురాణ కథలతో ముడిపడి ఉంది.**

కామదహనం, హోళికా దహనం, రాధా కృష్ణుల రంగుల ఆటలు...ఈ పండుగకు ప్రాముఖ్యతను పెంచాయి.
హోళీ సామాజిక ఐక్యత, ఆనందం, సంప్రదాయాలను వ్యక్తపరిచే పండుగగా నిలుస్తుంది.రంగుల పండుగ హోళీ ఎన్నో పాటలు కూడా హోళీ మీద ఉన్నాయి చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే పండుగల్లో... మరో ముఖ్యమైన పండుగ హోళీ
హోళీ అంటే రంగుల పండుగ. ఫాల్గుణ మాసం శుక్లపక్ష పౌర్ణమి నాడు హోళీ పండుగను జరుపుకుంటారు.
పౌర్ణమి రాత్రి హోలికా దహనం సోమవారం నాడు చేస్తారు. మరునాడు హోళీ ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటూ ఉత్సాహంగా హోళీ వేడుకలను ఎంజాయ్ చేస్తారు. దీనిని ధూలేడి పండుగ అని అంటారు.
హోళీ పండుగ అంటేనే ఉత్సాహభరితమైన పండుగ. 'రంగుల పండుగ'.
చిన్నా పెద్దా అంతా దేశవ్యాప్తంగా ఎంతో ఘనంగా జరుపుకునే పండుగల్లో హోళీ కూడా... వసంతం రాకను తెలియ చెప్పే పండుగ.భారతదేశం వ్యాప్తంగా హోళీని గొప్పగా జరుపుకుంటారు. ఒక్కోప్రాంతంలో ఒక్కోలా దీనిని చేసుకుంటారు.
శ్రీకృష్ణుని జన్మస్థలమైన మధుర, బృందావనంలో హోళీకి ప్రత్యేక ప్రాధన్యత ఉంది. మేజర్గా అన్ని చోట్ల రంగులతో సెలబ్రేట్ చేసుకుంటారు.
హోళీ రోజున ఒకరిపై ఒకరు రంగులు చల్లుకోవడం తెలిసిందే, అంతేనా? కానీ ఇది మాత్రమే కాదు హోళీ రోజు రంగులను అందరు చల్లుకోరు. ముఖ్యంగా సోదర బంధం కలిగిన వారు ఒకరికొకరు చల్లుకోరు, తోడబుట్టిన వారిపై రంగులు చల్లరు. ఈ రంగు చల్లడం అనేది బావా మరదల్లు, వరస అయ్యే వారితోనే రంగులాట ఆడతారు. అయితే స్నేహితులకు, పరిచయం లేని వారికి కూడా ఈ రంగులు చల్లవచ్చు. అందుకే గొడవలు జరగకుండా హిందీలో ఒక పాపులర్ సామెత ఉంటుంది.. 'బురా నా మానో... హోళీ హై' అని, పరిచయంలేని వారిపై రంగు చల్లినపుడు, వారు కోప్పడకుండా.. తప్పుగా అర్థం చేసుకోకండి.. ఈరోజు హోళీ పండగ, వేడుకల్లో పాల్గొనండి అంటూ హోళీని జరుపుకోవడాన్ని సూచిస్తుంది.
ఆర్గానిక్ కలర్స్ వాడదాం:*
హోళీ ప్రధానంగా రంగుల చుట్టూ ఉంటుంది కాబట్టి. దీనిని ఆడేప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. పర్యావరణానికి, మన చర్మానికి ఎలాంటి హాని జరగకుండా ఉండాలంటే సేంద్రీయ, సహజమైన రంగులు ఎంచుకోవడం ఉత్తమం. అలాగే స్నేహితులతో హోళీ ఆడేటపుడు అప్రమత్తంగా ఉండాలి. ఎండలు ఎక్కువగా ఉన్నాయి,తిరగకుండా, హైడ్రేటెడ్గా ఉండాలా జాగ్రత్తపడాలి. జుట్టుకు నూనె రాస్తే రంగులు ఈజీగా వదిలిపోతాయి. కళ్లకు అద్దాలు పెట్టుకోవాలి. సన్ స్క్రీన్ వాడితే మరి మంచిది. హోళీ ఆట తర్వాత చెరువులు బావుల కాడికి వెళ్లి స్నానాలు చేస్తారు ఈత రాక మరణించే సందర్భాలు వున్నాయి యువత హోళీ ఆట తర్వాత బైక్స్ మీద ట్రిబుల్ రైడ్ చేసి మద్యం సేవించి మృత్యు వాత పడ్డ ఘటనలు ఉన్నాయి ఆనందంగా హోళీ జరుపుకుందాం పర్యావరణ హిత రంగులను వాడుదాం కెమికల్ రంగులు వాడ కుండా ఉందాం

కామిడి సతీష్ రెడ్డి జయశంకర్
భూపాల్ పల్లి జిల్లా
మార్చి 3 న హోళీ పండగ సందర్భంగా
9848445134




# మహిళల ఆరోగ్య భద్రతకు భారత్ వేసిన గొప్ప అడుగు

- **"HPV వ్యాక్సిన్ ప్రారంభం**

దేశంలో మహిళల ఆరోగ్యంపై దశాబ్దాలుగా ఉన్న ఒక పెద్ద సవాలు.. గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ . ప్రతి సంవత్సరం వేలాది మంది మహిళలు ఈ వ్యాధితో ప్రాణాలు కోల్పోతున్నారు. అయితే ఇప్పుడు ఈ ప్రమాదాన్ని పూర్తిగా తగ్గించే దిశగా భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఒక చారిత్రాత్మక మలుపు. ప్రధాని నరేంద్ర మోడీ రాజస్థాన్‌లోని అజ్మేర్ నుంచి ప్రారంభించిన HPV వ్యాక్సినేషన్ కార్యక్రమం మహిళా ఆరోగ్య సంరక్షణలో ఒక పెద్ద సంస్కరణగా నిలవనుంది.
ఈ కార్యక్రమం ద్వారా 1415 ఏళ్ల బాలికలకు ఉచితంగా HPV వ్యాక్సిన్ ఇవ్వడం ఒక దూర దృష్టి నిర్ణయం. ఎందుకంటే వైద్య నిపుణులు చెప్పినట్టు, HPV వైరస్ వల్లే సర్వైకల్ క్యాన్సర్ కేసుల్లో 90 శాతం వరకు వస్తాయి. చిన్న వయస్సులోనే టీకా వేయడం ద్వారా ఈ వ్యాధిని దాదాపు పూర్తిగా నివారించవచ్చు. అంటే ఇది కేవలం ఒక టీకా కాదు.. భవిష్యత్తు తరాల ఆరోగ్యానికి రక్షణ కవచం.
తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ కార్యక్రమం వేగంగా అమలు అవుతోంది. స్కూళ్లు, కాలేజీల్లో చదువుతున్న విద్యార్థినులతో పాటు బడి బయట ఉన్న బాలికల వివరాలను సేకరించడం ద్వారా ప్రభుత్వం సమగ్ర దృష్టితో ముందుకు సాగుతోంది. సుమారు 4 లక్షల బాలికలు ఈ పథకానికి అర్హులుగా గుర్తించడం, ఇప్పటికే లక్షల సంఖ్యలో గార్డసిల్ 4 వ్యాక్సిన్ డోసులు అందుబాటులో ఉంచడం, 1500 మంది ANMలకు శిక్షణ ఇవ్వడం ఇవన్నీ ఈ కార్యక్రమంపై ప్రభుత్వ గంభీరతను స్పష్టంగా చూపిస్తున్నాయి.
ఇక్కడ ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే ప్రైవేట్ మార్కెట్‌లో ఒక్కో డోస్ ధర రూ. 2,000 నుంచి రూ. 4,000 వరకు ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉచితంగా టీకా అందించడం అనేది సామాన్య కుటుంబాలకు ఒక పెద్ద ఉపశమనం. ఆరోగ్య పరిరక్షణను సంపన్నులకే పరిమితం చేయకుండా, ప్రతి అమ్మాయికి అందుబాటులోకి తీసుకురావడం నిజంగా సమానత్వానికి నిదర్శనం.
అయితే ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రభుత్వంతో పాటు సమాజం కూడా బాధ్యత తీసుకోవాలి. ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో, పల్లెల్లో ఆరోగ్య అవగాహన తక్కువగా ఉంది. "టీకా అవసరమా?", "దుష్ప్రభావాలు ఉంటాయా?" అనే అనుమానాలు చాలా మందిలో ఉన్నాయి. కానీ వైద్యులు చెప్పినట్టు, ఈ టీకా పూర్తిగా సురక్షితమైనది. స్వల్ప నొప్పి, తలనొప్పి వంటి చిన్నపాటి లక్షణాలు తప్ప పెద్దగా ప్రమాదం ఉండదు.
అందుకే తల్లిదండ్రులు ముందడుగు వేసి తమ కుమార్తెలకు ఈ టీకా వేయించాలి. స్కూల్స్, ఆరోగ్య సిబ్బంది కూడా ఈ విషయంలో మరింత చురుకుగా వ్యవహరించాలి. అవగాహన కార్యక్రమాలు పెంచడం, అపోహలను తొలగించడం చాలా ముఖ్యం.
సారాంశంగా చెప్పాలంటే HPV వ్యాక్సినేషన్ కార్యక్రమం కేవలం ఒక ఆరోగ్య పథకం కాదు. ఇది మహిళల జీవితాలను కాపాడే జాతీయ ఉద్యమం. సరైన అవగాహన, సమన్వయం ఉంటే, భవిష్యత్తులో సర్వైకల్ క్యాన్సర్ అనే పదమే మన దేశంలో కనిపించకుండా చేయడం సాధ్యమే.
ప్రతి అమ్మాయి ఆరోగ్యంగా ఉంటేనే, దేశం ఆరోగ్యంగా ఉంటుంది.

# పర్యాటక కేంద్రంగా మూసీ

- **గాంధీ సరోవర్ గా బాపూఘాట్ ను మార్చటాన్ని స్వాగతించాలి!!**



మూసీ నది పరివాహక ప్రాంతంలో గాంధీ సరోవర్‌ను పర్యావరణ, సాంస్కృతిక టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ యోచనను స్వాగతించాల్సిన అవసరం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2024 నవంబర్ 1న మూసీ-ఈసా సంగమ ప్రాంతంలో ప్రపంచంలోనే ఎత్తైన మహాత్మా గాంధీ విగ్రహంతో పాటు ఐడియాలజీ సెంటర్, హ్యాండ్లూమ్ హబ్, నాలెడ్జ్ సెంటర్ వంటి నిర్మాణాలను ప్రకటించారు. ఈ ప్రకటనపై విమర్శలతో పాటు అభివృద్ధి అవసరమనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి.
గాంధీ సరోవర్ నిర్మాణం నేపథ్యంలో భూసేకరణపై, ఇళ్ల కోల్పోతున్న వారిపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రభావిత కుటుంబాలకు పునరావాసం కల్పించడం ప్రభుత్వ బాధ్యత. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఆర్థిక సహాయం అందించడం ప్రారంభమైనప్పటికీ, పూర్తి స్థాయి పునరావాసంపై స్పష్టత అవసరం. పర్యావరణ పరిరక్షణకు వ్యతిరేకం కాదని చెబుతున్న కొందరు, మరోవైపు అక్రమ నిర్మాణాల తొలగింపును రాజకీయంగా విమర్శిస్తున్నారు. హైదరాబాద్ ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటి. దాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు మూసీ పునరుజ్జీవనం కీలకం. లండన్‌లో థేమ్స్ నది, సియోల్‌లో చుంగ్ యే చున్ నదులను శుభ్రపరిచి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దినట్లు, మూసీ కూడా అభివృద్ధి చెందితే నగరానికి మేలు జరుగుతుంది. మూసీ సుందరీకరణలో భాగంగా బాపూఘాట్ పరిధిలో 21 కిలోమీటర్ల అభివృద్ధి పనులు రెండు దశల్లో చేపడుతున్నారు.
ఇందుకోసం ప్రత్యేకంగా "మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్" ఏర్పాటు చేశారు. గాంధీజీ విగ్రహం, శాంతి మ్యూజియం, మెడిటేషన్ విలేజ్, ఐకాన్ టవర్ వంటి నిర్మాణాలు ప్రతిపాదిస్తున్నారు. భూసేకరణ నోటిఫికేషన్ తర్వాత వివాదాలు మొదలయ్యాయి. ఖర్చు, భూవిస్తీర్ణంపై భిన్న అభిప్రాయాలు ఉన్నాయి.
గాంధీజీ విగ్రహ నిర్మాణంపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తుండగా, గాంధీజీ మనవడు తుషార్ గాంధీ కూడా విమర్శించారు. అయితే గాంధీజీ స్ఫూర్తిని విస్తరించేందుకు స్మారక కేంద్రాలూ అవసరమే అనే వాదన కూడా ఉంది. మూసీ నది పరివాహక ప్రాంతం సంవత్సరాలుగా అక్రమణలకు గురవుతోంది. సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల మురుగు కాలుష్యం పెరిగింది. గత ప్రభుత్వాలు పలు ప్రణాళికలు ప్రకటించినా పూర్తి స్థాయిలో అమలు కాలేదు. 1997లో టిడిపి ప్రభుత్వం నందనవనం ప్రాజెక్టు ప్రారంభించగా, తర్వాత ఆగిపోయింది. 2017లో బిఆర్ఎస్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు ప్రకటించినా అమలు పరిమితంగానే జరిగింది.
ప్రస్తుతం ప్రభుత్వం నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఆర్థిక సహాయం, రుణాలు అందిస్తోంది. పునరావాసంతో పాటు అభివృద్ధి చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. గంగా, సబర్మతి, కేరళలో నదుల శుభ్రతకు తీసుకున్న చర్యల మాదిరిగా మూసీని కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.
నగర మధ్యలో నది ప్రవహించే ప్రత్యేక అవకాశం హైదరాబాద్‌కే ఉంది. మూసీ ప్రక్షాళనతో నగరం అందంగా మారుతుంది. రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి ఈ ప్రాజెక్టుకు సహకరిస్తే, హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడం సాధ్యం.



–ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 03.03.2026
www.mudranews.in | @mudranews



చంద్ర గ్రహణం – పది నియమాలు
ఆహారంపై తులసి ఆకులు పెట్టాలి



* ముందుగా తయారు చేసిన ఆహారంపై తులసి ఆకులు ఉంచాలి
* ఇది ఆహారాన్ని రక్షిస్తుందని భావిస్తారు

# ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

**ముద్ర, మేడ్చల్ జిల్లా ప్రతినిధి :**
ప్రజావాణిలో అర్జీలను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టరు విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజి గిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో డిఆర్ఓ (ఇన్‌చార్జి) చంద్రవతితో కలిసి 153 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌజింగ్ డిపార్టుమెంట్ కు అధిక సంఖ్యలో (53) దరఖాస్తులు వచ్చాయన్నారు.

**పట్టాలు రాని వారికి పట్టాలివ్వాలి**

మేడిపల్లిలో పట్టాలు రాని వారికి ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం భగత్ సింగ్ నగర్ కాలనీ 48వ సర్వే నెంబర్ లో 2007 లో అప్పటి ప్రభుత్వం జీ.వో. నెంబర్ 58 కింద కొంతమందికి పట్టాలు ఇచ్చిందని తెలిపారు. మరికొందరికి వెరిఫికేషన్ దశలోనే ఆగిపోవడంతో పట్టాలు రాలేదనీ తెలిపారు. పట్టాలు లేని వారు ఇక్కడ ఉండేందుకు వీలులేదని ప్రచారం చేస్తుండడంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కొంతమంది



భూ కబ్జాదారులు డబ్బులు వసూలు చేసి కొత్త గుడిసెలు వేయిస్తున్నారని, ఈ విషయాన్ని స్థానిక తహసీల్దార్ దృష్టికి కూడా తీసుకువెళ్లాలన్నారు. కాని వారిపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. మేడిపల్లి మండల సీపీఐ కార్యదర్శి రచ్చ కిషన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జి. దామోదర్ రెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేందర్, ఉప్పల్ మండలం కార్యదర్శి సత్యప్రసాద్, జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి లక్ష్మి, ఘట్కేసర్ మండల కార్యదర్శి ఈశ్వర్, మేడిపల్లి మండల నాయకులు సి.హెచ్ మాధవి, కె.ప్రమీల, దండు రమేష్, జయచంద్ర, జి. నాగరాజు, కే మహాలక్ష్మి, బాపురాజు, వి. బాలరాజ్, ఇస్తారీ, సోమరాజు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



**ప్రజావాణి ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలి**

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**
జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు అందించే వినతులను పెండింగ్ లో పెట్టకుండా సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి( రెవెన్యూ), జిల్లా అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

# పార్టీలకతీతంగా తాండూర్ అభివృద్ధి

**తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**





**9ముద్ర, తాండూర్:**
పార్టీలకతీతంగా తాండూర్ పట్టణాన్ని అభివృద్ధి చేయాలని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి నూతన మున్సిపల్ పాలకవర్గానికి సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో తాండూర్ ప్రాంతానికి అధిక నిధులు తెచ్చి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. సోమవారం తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్రెడ్డి, వైస్ చైర్ పర్సన్ అబ్దుల్ రజాక్ పదవి బాధ్యతల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్ పర్సన్ చాంబర్లో వేద పండితులచే పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాండూర్ ప్రాంత అభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఎన్నికల వరకే రాజకీయాలని తర్వాత అభివృద్ధి కోసం అందరూ ముందుకు రావాలని తెలిపారు. తాండూరు ప్రాంత అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ఎన్ని నిధులైన ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నారని, విజన్ 2028 నాటికి తాండూర్ రూపురేఖలు మార్చే విధంగా కృషి చేస్తామన్నారు. పార్టీలకతీతంగా అన్ని వార్డుల్లో సమాన అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, ఏ వార్డు పైన కూడా చిన్నచూపు చూడకుండా అందరితో కలిసి మెలసి అభివృద్ధి చేయాలని నూతన పాలకవర్గానికి సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభించండి



**ముద్ర, కుషాయిగూడ:**
చర్లపల్లి డివిజన్ కు మంజూరైన వాటర్ వర్క్స్ కు సంబంధించిన అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని హెచ్ఎండబ్ల్యూఎస్ కమిషనర్ అశోక్ రెడ్డి కి, మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి వినతి పత్రం అందజేశారు. నాగార్జున నగర్ మెయిన్ రోడ్ లో రూ.25 లక్షలు, చక్రిపురం లలితా వైన్స్ దగ్గర రూ.30 లక్షలు, విద్యా మారుతినగర్ లో రూ.21.03 లక్షలు, చర్లపల్లి రూ.13 లక్షలు, బి.యన్ రెడ్డి నగర్ రూ.3. 60 లక్షలు, భరత్ నగర్ రూ.4.90 లక్షలు, లక్ష్మీ నగర్ రూ.31 లక్షల పనులు గత వారం కిందట మంజూరయ్యాయని కమిషనర్ తెలిపారు. వెంటనే అధికారులకు తెలియజేసి పనులు ప్రారంభించాలని ఆమె కోరారు.

## పెండింగ్ పనులు పూర్తి చేయండి



**ముద్ర, మల్కాజిగిరి:**
మల్కాజిగిరి డివిజన్లలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కృష్ణారెడ్డికి మాజీ కార్పొరేటర్ శ్రావణ్ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషన్ తో సమావేశమై డివిజన్ పరిధిలోని పలుకాలనీలలోని సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా సఫిల్గుడా చెరువు వద్ద కేంద్రం నిధులు రూ.రెండు కోట్లతో మొదలు కావాల్సిన మురునీటి డైవర్షన్ పనులను వెంటనే చేపట్టాలని, దోమల బెడదపై చర్యలు తీసుకోవాలని, వీధి కుక్కల సమస్య చాలా తీవ్రంగా మారిందని యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు. వీధి దీపాల నిర్వహణ సైతం అధ్వానంగా ఉందని, శానిటేషన్ నిర్వహణ మెరుగుపరచాలని, శానిటేషన్ ఉద్యోగులకు జీతాలు సకాలంలో చెల్లించాలని కోరారు.

# బాల్య వివాహాల నివారణకు కృషి చేయాలి

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ముద్ర, కాప్రా:**
బాల్య వివాహాల నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బాల్య వివాహాల నిర్మూలన లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న వంద రోజుల బాల్య వివాహాల నిర్మూలన – చిల్డ్రన్స్ మ్యారేజ్ ఫ్రీ భారత్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ నియోజకవర్గంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు సమాజానికి శాపమని, ముఖ్యంగా బాలికల భవిష్యత్తును నాశనం చేసే దుష్ప్రభావం కలిగిస్తాయని పేర్కొన్నారు. 18 ఏళ్ల లోపు అమ్మాయిలకు,




21 ఏళ్ల లోపు అబ్బాయిలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేస్తూ, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, సమాజంలోని అందరూ దీనిపై అవగాహన కలిగి బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, ప్రతి కాలనీలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాల్య వివాహ రహిత తెలంగాణ లక్ష్యాన్ని సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్నలిజం విలువలు పెంచేలా కృషి చేయాలి

**టీయూడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ**



**ముద్ర, కుషాయిగూడ:**
ప్రెస్ క్లబ్ లు జర్నలిస్ట్ ల సంక్షేమంతో పాటు సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ సూచించారు. నూతనంగా ఎన్నికైన కాప్రా ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా కమిటీ ప్రతినిధులు సోమవారం ఆయనతో పాటు కోశాధికారి మోతె వెంకట్ రెడ్డిని మార్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాప్రా ప్రెస్ క్లబ్ కొత్త అధ్యక్షుడు జ్యోతిర్మయా చారి, ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శ్రీనివాస్, కోశాధికారి సురేష్ లను విరాహత్ అలీ శాలువాతో సన్మానించి నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. కొందరు రిపోర్టర్ల చేష్టల వల్ల సమాజంలో పాత్రికేయ విలువలు రోజు రోజుకి దిగజారి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రెస్ క్లబ్ లు బాధ్యతాయుతంగా ఉంటూ పాత్రికేయ విలువలు కాపాడటంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. అలాగే పాత్రికేయుల సంక్షేమంతో పాటు సమాజ సేవలో కూడా ప్రెస్ క్లబ్ లు ముందుండాలని కోరారు. ఇందుకు సంబంధించిన సేవా కార్యక్రమాలు చేపట్టి మంచి పేరు తెచ్చుకోవాలని కొత్త కమిటీ కి సూచించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కమిటీ ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్ట్ లు చంద్రమౌళి, సహదేవ చారి, ఆంధ్రప్రభ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, చంద్ర మోహన్, కడియాల రమేశ్, శ్రీనివాస్, శంకర్, బాల్ రెడ్డి, నర్సింగ్ గౌడ్, పవన్, బాలాజు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా మెగా హెల్త్ క్యాంపు

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి**

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా మహిళా ఉద్యోగుల ఆరోగ్య సమస్యల పరిష్కారం కొరకు మెగా హెల్త్ క్యాంపును నిర్వహించనున్నట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా దినోత్సవ కార్యక్రమాలు, మహిళల ఆరోగ్యంపై వంద రోజుల ప్రత్యేక ఆరోగ్య సేవా కార్యక్రమాలు, జిల్లాలో హెచ్ పి వి టీకా కార్యక్రమం నిర్వహణపై సోమవారం అధికారులతో సమీక్షించారు. ఈ వైద్య శిబిరంలో మహిళలకు ప్రత్యేక స్క్రీనింగ్ పరీక్షలు, వైద్య సేవలు అందించబడతాయన్నారు. మహిళల వైద్య సేవల కోసం జిల్లాలో వంద రోజుల ప్రత్యేక కార్యక్రమం




మొదటి దశలో మాతృ, శిశు, వృద్ధుల ఆరోగ్యం పై ప్రత్యేక చర్యలు చేపట్టబడుతున్నట్లు తెలిపారు. గర్భిణుల పర్యవేక్షణ పిల్లల ఆరోగ్య పరీక్షలు, వృద్ధులకు అవసరమైన వైద్య సేవలు సమగ్రంగా అందించేందుకు కార్యాచరణ రూపొందించారని తెలిపారు. బాలికల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా హెచ్ పి వి టీకా కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా కలెక్టర్ శ్రీ చంద్రా రెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలిత దేవి పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్షులకు రాహుల్ మార్షల్ ఆర్ట్స క్లాస్



**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతులు విజయవంతంగా ముగిశాయి. అనంతగిరి హరితా రిసార్ట్స్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు.

శిక్షణ శిబిరానికి విచ్చేసిన లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎస్ ఏ పి కాలేజీలోని హెలిప్యాడ్ వద్ద వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తో కలిసి స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా మార్షల్ ఆర్ట్స్ చేస్తూ డీసీసీ అధ్యక్షులకు క్లాస్ చెప్పారు. రాహుల్. జియు జిట్సు అనే మార్షల్ ఆర్ట్‌లో మెళకువలను డీసీసీ అధ్యక్షులకు వివరించారు. మార్షల్ ఆర్ట్స్‌ను వ్యక్తిగత జీవితంలో అన్వయించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ఐడియాలజీపై క్లాస్ చెప్పారు. నాయకులు తమ అహంకారాన్ని పక్కన పెట్టి పని చేయాలని రాహుల్ సూచించారు. ఈగోల కంటే పార్టీ ముఖ్యమని స్పష్టం చేశారు. పార్టీ కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షులు.. మరో పదిమందిని తయారు చేయాలని, పని చేస్తున్న వారిని గుర్తించాలని వెల్లడించారు. ఇండియా ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐసీసీ అగ్ర నేత వివరించారు. పాకిస్థాన్‌కు చైనా మద్దతు ఇస్తోందని ఇరాన్ వెనక చైనా, రష్యా ఉన్నాయని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు మోదీ పూర్తిగా సరెండర్ అయ్యారని ట్రంప్‌కు వ్యతిరేకంగా మోదీ పనిచేయలేరని వ్యాఖ్యానించారు.

# ప్రజాపాలనకు నిదర్శనం కాంగ్రెస్ పాలన

**ముద్ర, శేరిలింగంపల్లి:**
'ప్రజల కష్టాల్లో ప్రభుత్వం తోడుంటుంది' అనే భావనకు ప్రతీకగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వాలిదాసు జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలు కొందరు అనారోగ్యం కారణంగా చికిత్స పొందిన అనంతరం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేరిలింగపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కార్యాలయాన్ని సంప్రదించగా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించి, వారికి మంజూరైన రూ.19,58,000 చెక్కును నియోజకవర్గ నాయకులతో కలిసి బాధితురాలికి అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు ప్రభుత్వం బాధితుల పట్ల చూపించే మానవత్వం, బాధ్యతకు నిదర్శనం అని, ప్రకృతి విపత్తులు, అగ్ని ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు లేదా తీవ్రమైన అనారోగ్య పరిస్థితులే కాకుండా ఏదైనా క్లిష్ట



సమయంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా పెద్ద దెబ్బ తగులుతుందని అన్నారు. ప్రజల కష్టాల్లో ప్రభుత్వం తోడుంటుందని ప్రతి ఒక్కరికీ తెలియాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరేందర్ గౌడ్, మహిపాల్ యాదవ్, కావూరి ప్రసాద్, సురేష్ గౌడ్, మన్నేపల్లి సాంబశివరావు, మల్లికార్జున్ యాదవ్, దొంతి సత్యం, జనార్దన్ గౌడ్, విజయభాస్కర్ రెడ్డి, తిరుపతి, రవీందర్ రెడ్డి, జహంగీర్, తిరుపతి, గిరి బాబు, సౌందర్యరాజన్, శ్రీహరి, సుధాకర్, లక్ష్మణ్, రాంచందర్, రవి కుమార్, శివ కుమార్, కార్తీక్ గౌడ్, మహిళా కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు భాగ్యలక్ష్మి, అనిత, జయ, సారా ఖాన్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# బైక్ రైడర్లకు హెల్మెట్ బ్యాంక్

**మల్కాజిగిరి ట్రాఫిక్ అడిషనల్ డిసిపి లక్ష్మీ**



**ముద్ర, మల్కాజిగిరి:**
మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నేరేడ్మెట్, వాయిపూరి ప్రాంతంలో హెల్మెట్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి సూచనల మేరకు ద్విచక్ర వాహనదారుల్లో రోడ్డు భద్రతపై చైతన్యం కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ లక్ష్మి తెలిపారు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న బైక్ రైడర్లను పోలీసులు ఆపి ముందుగా కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రమాదాల సమయంలో హెల్మెట్ ప్రాణాలను ఎలా రక్షిస్తుందో వివరిస్తూ అవగాహన కల్పించారు. అనంతరం 'హెల్మెట్ బ్యాంక్' ద్వారా తాత్కాలికంగా హెల్మెట్లు అందజేశారు. సాయంత్రం వరకు అందజేసిన హెల్మెట్‌ను వినియోగించి, అనంతరం కొత్త హెల్మెట్ కొనుగోలు చేసిన తర్వాత తీసుకున్న హెల్మెట్‌ను తిరిగి డిపాజిట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ నటసింహ, పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం



**ముద్ర, కూకట్‌పల్లి:**
తన భర్త కనిపించడం లేదని నలబోలు రేణుక అనే మహిళ కూకట్‌పల్లి పోలీసులను ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం తన భర్త నలబోతు సాంబశివరావు (40) అదృశ్యమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సాంబశివరావు వృత్తిరీత్యా కేటరింగ్ సూపర్వైజర్‌గా పనిచేస్తున్నారు. ఫిబ్రవరి 28న రాత్రి సుమారు 9.20 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినప్పటికీ ఫలితం లేకపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ వ్యక్తికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 03-03-2026
www.mudranews.in | @mudranews



చంద్రగ్రహణం –10 నియమాలు

గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

బయటికి వెళ్లకుండా ఇంట్లోనే ఉండాలి. కత్తులు, సూదులు వంటి పదార్థాలు వాడకూడదు



# ఘనంగా మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి



- స్పీకర్ పదవికి వన్నె తెచ్చిన శ్రీపాదరావు
- మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్

ముద్ర, ధర్మపురి:

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గా పనిచేసి ఆ పదవికి వన్నె తీసుకు వచ్చిన గొప్ప నాయకుడు స్వర్గీయ శ్రీపాదరావు అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణ కేంద్రంలో స్వర్గీయ శ్రీపాదరావు 89వ జయంతి వేడుకలను ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి మంత్రి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబంలో పుట్టి అంచలంచలుగా ఎదిగి ఉమ్మడి రాష్ట్రంలో శాసనసభకు శ్రీపాద రావు గారు స్పీకర్ గా వ్యవహరించారని గుర్తు చేశారు. తండ్రికి తగ్గ తనయుడిగా రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు రాజకీయాల్లో రాణిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంఘనభట్ల దినేష్, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, వైస్ చైర్మన్ ఇందారం రామన్న తోపాటు పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరీంనగర్ లో..



ముద్ర, కరీంనగర్:

మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాద రావు జయంతి వేడుకలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం తో పాటు నగరంలో పలుచోట్ల ఘనంగా జరిగినాయి. ముందుగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శ్రీపాదరావు చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించినారు. అనంతరం బస్టాండ్ కూడలి వద్ద ప్రభుత్వం తరపున ఆర్డీవో మహేష్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఎండి తాజ్, కొరివి అరుణ్ కుమార్, కార్పొరేటర్లు మల్లికార్జున రాజేందర్, పర్వత మల్లేశం, వరాల నర్సింగం, గుమ్మడి రాజ్ కుమార్, పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన శ్రీపాదరావు చిత్రపటానికి జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్ సహా పలువురు అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు వెన్న రాజ మల్లయ్య, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, టేల భూమయ్య, ఆకుల ఉదయ్, , మంద నగేష్ ముదిరాజ్, మూల కృష్ణారెడ్డి,వంగల విద్యాసాగర్, విక్టర్, నాగుల సతీష్, చెర్ల పద్మ, పంజాల స్వామి గౌడ్, మూల జయపాల్, మాదాసు శ్రీనివాస్, సత్తినేని శ్రీకాంత్, శిల్ప, జ్యోతి రెడ్డి, రాచర్ల పద్మ, లాయి, అబ్దుల్ భారీ, కుంభాల రాజ్ కుమార్, బషీరుద్దీన్, మూల జయపాల్, కాంపల్లి కీర్తి కుమార్, ఎర్ర శ్రీనివాస్, స్వప్న శ్రీ, ముక్క భాస్కర్ శ్రీరాముల రమేష్, దండు రవీందర్, సలీముద్దీన్, సిరికొండ శివప్రసాద్, జొన్నల రమేష్, కొట్టే ప్రభాకర్, మామిడి సత్యనారాయణ రెడ్డి, రూపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సుంకరిగణపతి, ఊరడి లత, ములకల కవిత, మార్క రాజు, ఫజల్, అందే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో..



ముద్ర, పెద్దపల్లి:

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద, సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్చేసి ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు కృష్ణ, మార్కెట్ చైర్మన్ మినిపల ప్రకాష్ రావు, కూర మల్లారెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, చిలుక సతీష్, భూషణవ్ సురేష్ గౌడ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## నిర్మల్ లో..

ముద్ర ప్రతినిధి, నిర్మల్:

మాజీ శాసనసభ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను నిర్మల్ లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడి ప్రజల మనిషిగా నిలిచిన గొప్ప వ్యక్తి దుద్దిళ్ల శ్రీపాదరావు అని కొనియాడారు. మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ముదావహమని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కిషోర్ కుమార్, వెంకటేశ్వర్లు, ఆర్డిఓ రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, డీఈవో భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డిటిడివో అంబాజీ, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహాదేవపూర్, కాటారంలో..

ముద్ర, మహాదేవపూర్:

మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాద రావు జయంతి వేడుకలు మహాదేవపూర్, కాటారంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డిఓ హరికృష్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. మహాదేవపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మడా కార్యాలయంలోని, ఎంపీపీ కార్యాలయంలోని శ్రీపాద విగ్రహానికి నివాళులు అర్పించారు. జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఫోటో రాజబాబు, మహాదేవపురం సర్పంచ్ హసీనాభాను అక్బర్ ఖాన్, మండల యువజన కాంగ్రెస్ నాయకులు కటకం అశోక్, పార్లమెంట్ నియోజకవర్గం విలాస్ రావు, మాజీ ఎంపీపీ రాణి భాయి, జిల్లా కాంగ్రెస్ నాయకులు మతిన్ ఖాన్, చిటికెసి చక్రధర్, దాహగం సంతోష్, ఖురేషి, నైయో తదితరులు పాల్గొన్నారు.





# ధర్మపురిని చదువుల నిలయంగా మారుస్తా..

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ముద్ర, ధర్మపురి:

ధర్మపురిని చదువుల నిలయంగా మార్చడానికి తనవంతుగా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ధర్మపురికి మంజూరైన డిగ్రీ కళాశాల నూతన భవన స్థలాన్ని మంత్రి అధికారులతో కలిసి ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాట ఇచ్చిన ప్రకారం డిగ్రీ కళాశాల తీసుకు వచ్చామని తెలిపారు. ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు దినేష్ మిత్రులైన రమేష్ ధర్మపురిలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సహకరించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడిగిన వెంటనే ధర్మపురికి డిగ్రీ కళాశాల మంజూరు చేశారని తెలిపారు.

2026–27 విద్యా సంవత్సరం నుండి ధర్మపురిలో డిగ్రీ కళాశాల తరగతులు ప్రారంభమవుతాయని, ప్రస్తుతం నాలుగు కోర్సుల్లో 240 సీట్లు కేటాయించడం జరిగిందని, బీఏ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. నూతన డిగ్రీ కళా శాల తాత్కాలికం జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసి తరగతులు నిర్వహిస్తామని, ఏడాదిలో పక్కా భవనం నిర్మిస్తామని తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలోన ఇంటర్ పూర్తి చేసి న విద్యార్థులు డిగ్రీ కళాశాలలో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని అడ్మిషన్లు పొందాలని మంత్రి కోరారు.

ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు దినేష్ తో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## ఇరాన్ లో భారతీయులు అధైర్యపడవద్దు..

ఇరాన్ పై ఇజ్రాయిల్ అమెరికా చేస్తున్న దాడుల నేపథ్యంలో ఇరాన్ లో ఉన్న భారతీయులు అధైర్య పడవద్దని మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా నుండి ఉపాధి కోసం పలువురు ఇరాన్ దేశానికి వలస వెళ్లారని ప్రస్తుతం ఇరాన్ పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు గమనిస్తుందని మంత్రి తెలిపారు. ఇరాన్ లో ఉన్న భారతీయుల యోగక్షేమాల కోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని సీఎంను కోరినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు రాష్ట్ర అధికారులు సమాచారం సేకరిస్తున్నారని మంత్రి తెలిపారు. ఇరాన్ లో ఉన్న జగిత్యాల జిల్లావాసులు సైతం వారి యోగక్షేమాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వాలని మంత్రి పిలుపునిచ్చారు.

# తండ్రి, తనయకు పురస్కారాలు



ముద్ర ప్రతినిధి, నిర్మల్:

నిర్మల్ కు చెందిన వైద్యులు డాక్టర్ వేణుగోపాల కృష్ణ, ఆయన కూతురు డాక్టర్ సుహాసిని వారి "ప్రేమతో నాన్న" లఘు చిత్రానికి ఉత్తమ నటీనటులుగా నంది పురస్కారాలు అందుకున్నారు. హైదరాబాద్ లోని బిర్లా ఆడిటోరియంలో ఆదివారం రాత్రి మెగా ఎంటర్ప్రైజెస్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వీరు పురస్కారాన్ని స్వీకరించారు. ప్రేమతో నాన్న మొదటి భాగానికి కూడా ఇదివరకే వీరు ఉత్తమ పురస్కారాలు అందుకున్నారు. కుటుంబ విలువలు, భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు, జీవితంలోని కష్టసుఖాల నేపథ్యంలో నిర్మించిన ఉత్తమ చిత్రంగా ప్రేమతో నాన్న గుర్తింపు పొందింది. వేణుగోపాలకృష్ణ, కూతురు సుహాసిని ఇద్దరూ వైద్యరంగంలో ఉంటూ కళా రంగంలో విశిష్ట సేవలందించడం అభినందనీయమని నిర్వాహకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్, పారిశ్రామికవేత్త, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, మాజీ కేంద్ర మంత్రి, నిర్మల్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వేణుగోపాలచారి, టీవీ సినీ కళాకారులు అల్లం అనిల్, సభ్యులు శిరీషారెడ్డి, రుద్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలన కోసం..

# ప్రచార రథం ప్రారంభం

ముద్ర ప్రతినిధి, నిర్మల్:

జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన కోసం చేపట్టిన 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో "బాల్య వివాహ రహిత భారత్" కార్యక్రమంలో భాగంగా ఈ ప్రచార రథాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో విజన్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ శరత్ కుమార్, రాజు, బాలల పరిరక్షణ అధికారి మురళి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వహీద్, చైల్డ్లైన్ కోఆర్డినేటర్ గంగాధర్, మిషన్ శక్తి సిబ్బంది, విజన్ సంస్థ సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఏషియన్ పెయింట్ ట్రాన్స్ పోర్ట్

# డ్రైవర్ల వినూత్న నిరసన



- 14వ రోజు కి చేరిన సమ్మె

ముద్ర, కరీంనగర్:

ఏషియన్ పెయింట్ ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్లు సోమవారం వినూత్నంగా నిరసన తెలిపారు. 14వ రోజు సమ్మెలో భాగంగా వారు తలకిందులుగా నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి యూనియన్ గౌరవ అధ్యక్షుడు పున్నం రవి మాట్లాడుతూ గత 14 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ఏషియన్ పెయింట్ ట్రాన్స్పోర్ట్ డ్రైవర్ల సమస్యలపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించే వరకు నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు,

ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కామల్ల మహిపాల్, కోశాధికారి ఉత్తమల్ల వెంకటేశ్, సహాయ కార్యదర్శి మూగ తిరుపతి, లింగంపల్లి అనిల్, ముచ్చర్ల రాజశేఖర్, ఏ రవి, కే మహేష్, ఏ రమేష్, సిహెచ్. రాజేష్, మహేష్, విజయ్, వెంకటేష్ శ్రీనివాస్, నరేష్, మధు, కళాధర్ ,శ్రీకాంత్ విజయ్, రాజు, మోహన్, రాజశేఖర్, 40 మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

# 'కేజీబీవీ సమస్యలను పరిష్కరించాలి'

ముద్ర, మహదేవపూర్:

కేజీబీవీలు సమస్యలకు నిలయముగా మారాయని, ఆ పాఠశాలల్లో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది అనేక సమస్యలతో సతమతమవుతున్నారని డిటిఎఫ్ జిల్లా ఉపా ధ్యక్షుడు తిరుపతిరెడ్డి అన్నారు. కేజీబీవీలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గెస్ట్ టీచర్లకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, 28 రోజుల సమ్మె కాలపు వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి పోరాటమే ఏకైక పరిష్కారం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజయ్య, శ్రీనివాస్, సమ్మయ్య, వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్, వీరేశం, ఆంజనేయులు, అనిత, సరితా దేవి, కళ్యాణి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అటవీశాఖ ఆధ్వర్యంలో రక్తదానం

ముద్ర ప్రతినిధి, నిర్మల్:



ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో రక్తదాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాసర సర్కిల్ నిర్మల్ సిసిఎఫ్ శర్వానన్ మాట్లాడుతూ వన్యప్రాణులు మన మనుగడలో అంతర్భాగమని అన్నారు. వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా రక్తదాన కార్యక్రమం నిర్వహించటం ద్వారా ప్రమాదాల్లో రక్తం ఆవశ్యకతను వివరించేందుకు కృషి చేసినట్లు వివరించారు.

## మున్సిపల్ వైస్ చైర్మన్ కు వైద్యుల సన్మానం

ముద్ర ప్రతినిధి, నిర్మల్:



నిర్మల్ మున్సిపల్ చైర్మన్, వైస్ ఛైర్మన్ లుగా కావ్య గణేష్, గణేష్ చక్రవర్తి పదవి స్వీకరణ నేపథ్యంలో సోమవారం గణేష్ చక్రవర్తిని వైద్యులు సత్కరించారు. నిర్మల్ పట్టణాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఎల్. నర్సింహారెడ్డి, రఘునందన్ రెడ్డి, రాంచంద్రారెడ్డి, కూన ప్రదీప్, శరత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సీఏ లో ఉత్తీర్ణుడైన గ్రామీణ విద్యార్థి

ముద్ర, మహదేవ్పూర్:



గుడ్ మార్నింగ్ గ్రామర్ హై స్కూల్కు పూర్వ విద్యార్థి శ్రీ సాయి గిరిధర్ ఇటీవల చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ) గా అర్హత సాధించిన సందర్భంగా పాఠశాల యాజమాన్యం ఆయనను సోమవారం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా సాయి గిరిధర్ తో పాటు ఆయన తండ్రి కేసర్ సింగ్ ను కూడా సత్కరించి,ఆయన నిబద్ధతను కృషిని ప్రశంసించారు. ఈ సందర్భంగా సాయి గిరిధర్ తనకు బోధించినఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
03.03.2026 మంగళవారం, హైదరాబాద్



చంద్రగ్రహణం – 10 నియమాలు
దేవాలయాలు మూసివేయడం
*గ్రహణ సమయంలో దేవాలయాలు మూసివేస్తారు
*పూజలు నిలిపివేస్తారు



# విద్యార్థులే ఉపాధ్యాయులుగా..

**ముద్ర, మోత్కూర్ :**



మండలంలోని పాటిమట్ల ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు కలెక్టర్ గా డీఈవోగా ఎమ్మెల్యేగా వివిధ హోదాల్లో కనిపించి పాఠశాలలో ఉత్తేజ తర్వాత వాతావరణాన్ని కలిగించారు. ఉపాధ్యాయులుగా విద్యార్థులు బోధనలో చాలా ఆనందంగా ఉందని వ్యక్తం చేశారు. నేటి ప్రధాన ఉపాధ్యాయులుగా మొగులగాని మానస, కలెక్టర్ గా చల్ల పల్లవి, డిఈవో గా కొమ్మ మనీషా, డిప్యూటి డీఈవో గా పర్వతగిరి గ్రీష్మ, ఎమ్మెల్యేగా కురుమేటి శివ సాయి, ఉపాధ్యాయ బృందం ప్రధానోపాధ్యాయులు మిర్యాల దామోదర్, ఉపాధ్యాయులు ముక్కామల లింగమల్లు, బండారు మల్లయ్య, వంగూరి యాదయ్య, దర్శనం వెంకన్న, చిరుమర్తి యాదయ్య, కే కవిత, డి తిరుపతి, కే కృష్ణ వేణిలు పాల్గొన్నారు.

# దుద్దిళ్లకు ఘన నివాళి

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**



ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి దుద్దిళ్ళ శ్రీపాదరావు అని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలసి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ శాసనసభ్యులుగా, శాసనసభ స్పీకర్ గా ఆయన అందించిన సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ శోభా రాణి, జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, ఏఓ అంజిరెడ్డి, కలెక్టరేట్ లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**ఆత్మకూర్ (ఎం), ముద్ర:**




ఆత్మకూర్ (ఎం) మండలంలోని పొలిటికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కట్టెకోలా సుశీల హనుమంత్ గౌడ్ మాట్లాడుతూ ఒకరోజు అధికారులుగా,ప్రజా ప్రతినిధులుగా, ఉపాధ్యాయులుగా పాత్ర నిర్వహించిన విద్యార్థులు నిజజీవితంలో ఇలాంటి ఉన్నత స్థానాలలో స్థిరపడాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, ఏఏపిసి చైర్మన్ సిహెచ్ ఎల్లమ్మ ,మాజీ ఎంపీటీసీ కే హనుమంత్ గౌడ్, వెంకటయ్య ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ మార్గంలోనే ఉద్యమం

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**



తెలంగాణ ఉద్యమాన్ని అన్ని మార్గాల్లో చేసి తెగించి కొట్లాడిన ఉద్యమకారులందరు నేడు గాంధి మార్గములోనే ఉద్యమిస్తున్నారని ఉద్యమకారులకు ఇచ్చిన హామిలు వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూస శ్రీనివాస్ కోరారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన "నిరసన దీక్ష"లో పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం కోసం ధర్నాలు, రైలు రోకోలు చేశామని ఉద్యమకారులకు కాంగ్రెస్ మానిఫెస్టోలో పెట్టిన విధంగా 250 చ.గజాల స్థలము, రూ.30వేలు పెన్షన్, ఆరోగ్య కార్డు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మెరుగు మధు, డి.ఎస్. మాణిక్యమ్మ, గొర్ల లక్ష్మణ్, గోపరాజు గణేష్, మంతపురం వినోద్కుమార్, సుధాకర్, రమేష్ పాల్గొన్నారు.

# నూతన ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు

**ముద్ర,భువనగిరి ప్రతినిధి :**

భువనగిరి పట్టణంలోని 4వ వార్డ్ రాయగిరిలోని సోమ రాధాకృష్ణ ఫంక్షన్ హాల్ వద్ద నూతన ట్రాన్స్ ఫార్మర్ ను భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ల పల్లి శ్రీవాణి రవికుమార్ సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా చైర్మన్ మాట్లాడుతూ గృహాల్లో వోల్టేజ్ సమస్యను పరిశీలించి నూతన ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రామలింగం, 4వ వార్డ్ సభ్యులు నాయిని అరుణ పూర్ణచందర్, అధికారులు, వార్డు ప్రజలు, పాల్గొన్నారు.

# ఖమ్మం ఆర్ డి ఓ గా శ్రీనివాస్

**ముద్ర, ఖమ్మం:**



ఇటీవల వెలుగుమట్ల భూదాన భూముల అంశంలో పేదల గుడిసెల కూల్చివేత అంశం రాష్ట్రస్థాయిలో సంచలనం కలిగించిన నేపథ్యంలో హఠాత్తుగా బదిలీ కాబడ్డ నరసింహారావు స్తానంలో సోమవారం నూతన ఆర్డీవో గా ఎన్. శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్దురిశెట్టి ను కలుసుకొని, పూల మొక్కను అందజేశారు.

# రైతులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

- **నాగిరెడ్డిపల్లిలో బిఆర్ఎస్ మహాధర్నా, రాస్తారోకో**

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**



భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు మహాధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయిందన్నారు. యాసంగి పంటకు సకాలంలో యూరియా సరఫరా చేయకుండా యాప్ ద్వారా రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పంట పెట్టుబడి సాయం కింద రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు విడుదల చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతుల ద్రోహి అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు, తుక్కాపురం సర్పంచ్ జనగాం పాండు, బిఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నీల ఓంప్రకాష్ గౌడ్, మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు జక్కా రాఘవేందర్ రెడ్డి, చందుపట్ల మాజీ సింగిల్విండో చైర్మన్ భల్గూరి మధుసూదన్ రెడ్డి, సర్పంచులు పడాల వెంకటేశ్వర్లు, తోటకూరి శంకరయ్య, కంకల లలిత కిష్టయ్య, ర్యాకల సంతోష శ్రీనువాస్, నాగెల్లి గిరిజ రమేష్ గౌడ్, కొండూరి దానమ్మ సత్యనారాయణ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు అబ్బగాని వెంకట్ గౌడ్, మద్ది బుచ్చి రెడ్డి, చిందం మల్లికార్జున్, సుబ్బూరు రమేష్, రాసాల మల్లేశం, నోముల మహేందర్ రెడ్డి, అంకర్ల మురళి, చిన్నం పండు, కడమంచి ప్రభాకర్, మట్ట ధనుంజయ్య, చింతల శంకర్ గౌడ్, సుధాకర్ నాయక్, సాబాన్కార్ వెంకటేష్, కునుసోత్ రెడ్డి నాయక్, కూనూరు ఆంజనేయులు, పడమటి జైపాల్ రెడ్డి, జిట్టా లక్ష్మా రెడ్డి, చింతల వెంకట్ రెడ్డి, ఎలిమినేటి విఠల్ రెడ్డి, షేర్ ఖాన్, పోల ప్రవీణ్, పిన్నింటి మధు రెడ్డి, చింతల దేవేందర్, నల్లమాస రాజు, జనగాం మహేష్, రాసాల లింగ స్వామి పాల్గొన్నారు.

# హక్కుల కోసం పోరాటానికి సిద్ధం

- **ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్**

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**




అర్హులైన కళాకారులకు గుర్తింపు కార్డులు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని కళాకారుల సమస్యలపై జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన అనంతరం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజానాట్య మండలి కళాకారులు అనేక సంవత్సరాలుగా గుర్తింపు లేకుండా, సరైన పారితోషికం లేకుండా, సామాజిక భద్రతా హామీలు లేకుండా దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ మాట్లాడుతూ 50 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికునికి రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలని, సంస్కృతిక రంగానికి ప్రత్యేకంగా వెయ్యికోట్ల బడ్జెట్ కేటాయించాలని, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే, తెలంగాణ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, ర్యాలీలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్, చిగుర్ల లింగం, జిల్లా సమితి సభ్యులు అన్నేమైన వెంకటేష్, ప్రజానాట్యం మండలి జిల్లా అధ్యక్షులు భూషిపాక నరసింహ, ఉపాధ్యక్షులు పిట్టల శంకర్ ఇంజా హేమలత, కట్ల యాదగిరి జిల్లా సహాయ కార్యదర్శి పోతు ప్రవీణ్, సోమ నర్సయ్య, మొగుళ్ల శేఖర్ రెడ్డి, మూల పోచయ్య, కళాకారులు మనోహర, జాను, శ్రీనివాస్, రాజప్ప, రేణుక, నవనీత, నవనీత, కృష్ణమ్మ, వసంత, కవిత, ఎలేంద్ర, లక్ష్మి పాల్గొన్నారు.

# ప్రజావాణికి 62 అర్జీలు



**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 62 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 37,గ్రామీణాభివృద్ధి శాఖ 7,మున్సిపాలిటీ 5,హౌసింగ్ 4, ఎం .పి. డి.ఓ 2, పంచాయతీ 2,జిల్లా పరిషత్ ,ఎలక్ట్రిసిట్ ,అటవీ శాఖ ,విద్య శాఖ, ఆర్.టి.సి , శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. స్టేట్ ప్రజావాణి లో వివిధ శాఖలకు సంబంధించిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ జయమ్మ,జెడ్పీ సి.ఈ.ఓ శోభ రాణి గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కన్నబిడ్డలే పట్టించుకోవడంలేదు

- **యాదాద్రి కలెక్టర్ ను ఆశ్రయించిన వృద్ధ దంపతులు**
- **ఆదరించి ఆశ్రమంలో చేర్పించిన కలెక్టర్ అనురాగ్ జయంతి**

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**



యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనురాగ్ జయంతి సోమవారం జరిగిన ప్రజా వాణి కార్యక్రమంలో ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కన్న కొడుకులు నిర్లక్ష్యంతో తల్లిదండ్రుల బాగోగులు పట్టించు కోకపోవడంతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కి వృద్ధ దంపతులు మొరపెట్టుకున్నారు. మానవతా హృదయంతో చలించిపోయిన కలెక్టర్ ఆ వృద్ధ దంపతులను ఆదరించి వయో వృద్ధుల ఆశ్రమం లో చేర్పించారు. వివరాల్లోకి వెళితే ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన ధర్మ సోమిరెడ్డి, రమణమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తిని పంచుకొని, వారిని నిర్లక్ష్యం చేయడంతో గత సంవత్సరం డిసెంబర్ నెలలో జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేశారు. మరుసటి రోజే భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి గ్రామానికి విచారణకు వెళ్ళి, పూర్తి వివరాలు సేకరించారు. వృద్ధ దంపతుల కుమారులైన ధర్మ వెంకట నరసింహ రెడ్డి, ధర్మ గోవర్దన్ రెడ్డి లను పలుమార్లు ఆర్డీఓ కార్యాలయం లో కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం భువనగిరి ఆర్డీవో, సీనియర్ సిటిజన్ యాక్ట్ 2007 ప్రకారం సబ్ డివిజన్ ట్రిబ్యునల్, వెల్ఫేర్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్, రాజస్వ మండలాధికారి భువనగిరి ఉత్తర్వు 2647/2025, తేదీ 27012026 నాడు జడ్జిమెంట్ ఆర్డర్ పంపించారు. అయినా ఆ కుమారులు మారలేదు, ఆర్డీఓ ఆర్డర్ ను బేఖాతరు చేశారు. దిక్కుతోచని ఆ వృద్ధ దంపతులు అప్పిలేట్ అధికారి అయిన జిల్లా కలెక్టర్ ను సోమవారం ప్రజావాణి లో కలిసి మొరపెట్టుకున్నారు. మాకు ఎవరూ లేరు. మాకు మీరే దిక్కు, మమ్మల్ని అనాథాశ్రమం లో చేర్పించండి అంటూ ప్రాధేయపడ్డాడు. దీంతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆ వృద్ధ దంపతులకు అండగా నిలిచారు. చౌటుప్పల్ మండలం పెద్ద కొండూరు లోని వయోవృద్ధుల ఆశ్రమంలో చేర్పించారు.

# పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలని వినతి

**ముద్ర ప్రతినిధి, బీబీనగర్:**



బీబీనగర్ మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన, పెండింగ్లో ఉన్న అన్ని రకాల పింఛన్లను త్వరిత గతిన మంజూరు చేయాలని రాఘవాపురం పంచాయతీ వార్డ్ సభ్యుడు, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా నేత జక్కి నగేష్ కలెక్టర్ ను కోరారు. ఆసరా పెన్షన్లు వితంతువులు, దివ్యాంగులు, బీడి కార్మికులు, నేతన్నలు, కల్లు గీత కార్మికులు, హెచ్.ఐ.వి/ ఎయిడ్స్ రోగులు, ఫైలేరియా రోగులు, ఒంటరి మహిళలు, డయాలిసిస్ రోగులు, వృద్ధులు, వితంతువులు పలువురు ప్రభుత్వ పింఛన్లు రాక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రీవెన్స్ డే సందర్భంగా సోమవారం భువనగిరిలో కలెక్టర్ అనురాగ్ జయంత్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లు కోసం బీబీనగర్ మండలం, రాఘవాపురం గ్రామానికి చెందిన సుమారు 60 మంది నేరుగా లేదా ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని ఉన్నారని అన్నారు కాని నెలలు గడుస్తున్నప్పటికీ వారిక పెన్షన్ రాకపోవడంతో వారు, పెన్షన్ రాకపోవడానికి గల కారణాలు తెలుసుజూదానికి మీసేవా కేంద్రాలకు వెళితే సైట్ ఓపెన్ కావడం లేదని చెబుతున్నారని నగేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవపురం గ్రామపంచాయతీ వార్డు సభ్యులు. దొంతిరెడ్డి రాజశేఖర్ రెడ్డి. బండారి అశ్విని రాఘవేందర్ గౌడ్.బుయ్య పాండు. గుంటిమిది విజయ తదితరులు పాల్గొన్నారు


సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 03.03.2026
www.mudranews.in | @mudranews



**చంద్రగ్రహణం- 10 నియమాలు**

మంత్రాలు, జపాలు చేయాలి

★ గ్రహణం సమయంలో జపం చేయడం శ్రేయస్కరం



★ ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుందని నమ్మకం

# ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలి

**- మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టాక మొదటిసారిగా సోమవారం కలెక్టరేట్ లో ప్రజావాణి నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవించుకున్నారు. అనంతరం అధికారులతో శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి అని పేర్కొన్నారు. ప్రతి సోమవారం ప్రజల సమస్యలపై ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో ప్రజావాణి ఎప్పటి మాదిరిగా కొనసాగుతుందని చెప్పారు. శాఖల వారీగా పనితీరు మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. అధికారులందరూ క్షేత్ర స్థాయిలో పర్యటించాలని పేర్కొన్నారు. ప్రజలు అందించిన దరఖాస్తులపై క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు పరిష్కార దిశగా కృషి చేయాలని ఆదేశించారు. విద్యా, వైద్యం, వ్యవసాయం, తాగునీరు, సాగునీరు, వివిధ అంశాలపై ప్రజల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. డీఆర్ఓ భుజంగరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డిఓ శ్రీనివాస్ రావు, కలెక్టరేట్ ఏఓ యూనస్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మార్కెట్ విలువ చెల్లించండి..**

రామాయంపేట పట్టణ ఫరిదిలోని భూమి నేషనల్ హైవే రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్నవారికీ మార్కెట్ విలువ ప్రకారం గజానికి 30 వేలు చెల్లించాలని బాధితులు కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ భూమిగా కాకుండా వ్యవసాయేతర భూమిగా పరిగణలోకి తీసు కొని మార్కెట్ విలువ ప్రకారం ధర నిర్ణ యించి నష్టపరిహారం చెల్లించాలని కోరా రు. 33 ఎకరాల భూమి కోల్పోతున్నట్లు తెలిపారు.

**ప్రతిరోజూ రావచ్చు: ఎస్పీ డీవీఎస్**

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రతిరోజూ పోలీస్ శాఖ అందుబాటులో ఉంటుందని, నిర్భయంగా వచ్చి కలవాలని ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజావాణిలో భాగంగా జిల్లాలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వివాదాలు, పోలీస్ సంబంధిత ఇబ్బందులను ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావుకు నేరుగా విన్నవించుకున్నారు. ప్రతి ఫిర్యాదుదారునితో వ్యక్తిగతంగా మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదులను క్షుణ్నంగా పరిశీలించి, తక్షణమే పరిష్కార చర్యలు తీసుకునేలా సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

**హోలీ ప్రశాంతంగా జరుపుకోవాలి..**

ప్రతి ఒక్కరూ ప్రశాంతమైన వాతావరణంలో కుటుంబ సమేతంగా సంతోషంగా హోలీ పండుగను జరుపుకోవాలని ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి జరిమానాలకు, రోడ్డు ప్రమాదాలకు కారకులై జైలు పాలు కావద్దని హెచ్చరించారు. హోలీ పండుగ వేళ మన తోటి అడపడుచుల పట్ల గౌరవప్రదంగా నడుచుకోవాలని, పండగ పేరుతో అనవసరంగా కొత్త చిక్కులు కొని తెచ్చుకోవద్దని సూచించారు. గొడవలకు, అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించబోమని, చట్టపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. మద్యం మత్తులో చెరువులు, కుంటాల వద్ద స్నానాలకు వెళ్లి ప్రమాదాలకు గురై అనేక కుటుంబాలకు విషాదాన్ని మిగిల్చిన ఘటనలను గుర్తు చేశారు. మద్యం మత్తులో ఎవరూ కూడా చెరువులు, కుంటాల వద్దకు వెళ్లి ప్రమాదాలకు గురి కావద్దని తెలిపారు. చిన్న పిల్లలు తప్పనిసరిగా తల్లిదండ్రుల సమక్షంలోనే స్నానాలకు వెళ్లాలని సూచించారు. పిల్లల కదలికల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా దృష్టి పెట్టాలని సూచించారు.

## ఘనంగా శ్రీపాదరావు జయంతి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను నిర్వహించారు. జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ శాఖ ఆధ్వర్యంలో శ్రీపాద రావు చిత్రపటానికి కలెక్టర్ ప్రతిమా సింగ్ నివాళులు అర్పించారు. డీఆర్ఓ భుజంగరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డిఓ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసన సభ స్పీకర్ గా శ్రీపాదరావు చేసిన సేవలను స్మరిస్తూ, శ్రద్ధాంజలి ఘటించారు.

**ఎస్పీ కార్యాలయంలో..**

మెదక్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ డి. వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ దుద్దిళ్ల శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, ఆర్ఐలు శైలందర్, రామకృష్ణ, సీఐలు సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



## సాంకేతిక విద్యపై ఆసక్తి పెంచాలి



**ముద్ర, హైదరాబాద్:** విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్యపై ఆసక్తిని పెంచాలని మెదక్ జిల్లాలోని శివంపేట్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సూచించారు. నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలను సోమవారం శివంపేట్ పాఠశాల నుంచి వంద మంది విద్యార్థులు, పది మంది ఉపాధ్యాయులు సందర్శించారు. విద్యార్థులను రెండు బ్యాచులుగా విభజించి తద్వారా ప్రతీ విద్యార్థికి అన్ని సౌకర్యాలను సమగ్రంగా వీక్షించే అవకాశం లభించింది. ఈ సందర్భంగా విద్యార్థులకు కళాశాలలోని ప్రయోగశాలలను పరిచయం చేశారు. ఈసీఈ, ఈఈఈ, బీఎంఈ సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల అధిపతులు పర్యవేక్షణలో ఈ పర్యటన అత్యంత సజావుగా జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఈ పర్యటనలో విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్య పట్ల ఆసక్తిని పెంచడంలో ఎంతగానో తోడ్పడిందని, కళాశాల అత్యాధునిక ప్రయోగశాలలు విద్యార్థులలో వినూతన ఆలోచనలను రేకెత్తించాయని ఈ విద్యా పర్యటన విద్యార్థుల భవిష్యత్ కేరీర్ ఆకాంక్షలకు ప్రేరణగా నిలుస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజయ్లూబే, బాజా సే భారత దేశ సలహాదారు డా.కే.సి వోరా. డైరెక్టర్ డా. కె. లక్ష్మీప్రసాద్, మేనేజర్ బాపిరాజు పాల్గొన్నారు.

## రైతుబంధు నిధులు విడుదల చేయాలి

**ముద్ర, హైదరాబాద్:** రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లిలో అన్నదాతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాల్వల ద్వారా నీటిని విడుదల చేయాలని కోరారు.

# ప్రజల నమ్మకాన్ని విస్మరించొద్దు


**- సిద్దిపేట కలెక్టర్ హైమావతి**



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** ప్రజావాణిలో తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే ప్రజల నమ్మకాన్ని విస్మరించొద్దని కలెక్టర్ కె.హైమావతి స్పష్టం చేశారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి సందర్భంగా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తో కలిసి ఆమె ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజల నుంచి 165 దరఖాస్తులు తీసుకున్నట్లు తెలిపారు. అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతని ఇవ్వాలని సూచించారు. ప్రజల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వీలైనంత మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ విషయంలో అలసత్వం చేయవద్దన్నారు. అంతకుముందు జిల్లా అధికారులతో పలు అంశాలపై నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని గురుకులాలు, హాస్ట ళ్లలో భోజనం, వసతి తదితర విషయాలను పర్యవేక్షణ చేయడానికి జిల్లా, మండల స్థాయి అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ నాగ రాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి

**- సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య**



**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్లు మాధురి, పాండు, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమహారతి తో కలిసి ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీదారులు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, వ్యవసాయ, విద్య, వైద్య, పశుసంవర్ధక తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను కలెక్టర్ కు అందజేశారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 56 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఆయా వినతులను నిశితంగా పరిశీలించి త్వరగా పరిష్క రించాలని అధికా రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికా రులు, కలెక్టరేట్ ఏఓ తదితరులు పాల్గొన్నారు .

**అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి..**

జహీరాబాద్ ప్రాంతంలోని నిమ్జ్ పరిశ్రమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ చాంబర్ లో నిమ్జ్ మొదటి దశ లో స్వాధీనం చేసుకున్న భూముల సరిహద్దుల గుర్తింపు, పెండింగ్ పనులు, సమీప రహదారుల అభివృద్ధి, నిమ్జ్ కు అనుసంధానించే ముఖ్య మార్గాల విస్తరణ వంటి అంశాలపై నిమ్జ్, సర్వే, రెవిన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిమ్జ్ లో మౌలిక వసతులు కల్పించే ఎస్ఆర్అర్ కన్స్ట్రక్షన్ కంపెనీకి ఇప్పటి వరకు సేకరించిన భూములను అప్పగించాలని సూచించారు. లే అవుట్ అభివృద్ధి చేసేందుకు వీలుగా పది రోజుల్లో సర్వే పూర్తి చేయాలని పేర్కొన్నారు. లే అవుట్ ప్రకారం రోడ్లు, ఇతరత్ర మౌలిక వసతులు కల్పించేందుకు సేకరించిన భూముల్లో హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. గతంలోనే భూములు తీసుకుని రైతులకు నష్ట పరిహారం సైతం చెల్లించామని చెప్పారు. పనులు చేపట్టక పోవడంతో పంటలు సాగు చేసు కునేం దుకు అవకాశం ఇచ్చామన్నారు. సర్వేను శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అడిషనల్ కలెక్టర్ లు మాధురి, పాండు లతో పాటు టీజీఐఐసీ జోనల్ మేనేజర్ విఠల్, జహీరాబాద్ ఆర్డీవో దేవుజా, నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశాలాక్షి పాల్గొన్నారు.

## ఏడుపాయలలో అమ్మవారి పల్లకీ సేవ



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ఏడుపాయల వన దుర్గామాత సన్నిధిలో పౌర్ణమి పురస్కరించుకొని సోమవారం సాయంత్రం అమ్మవారి పల్లకీ సేవ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు అమ్మవారి నామస్మరణ చేశారు.

## గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలి

**- గజ్వేల్ టౌన్ సీఐ రవి కుమార్**



**ముద్ర, హైదరాబాద్:** గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని గజ్వేల్ టౌన్ సీఐ రవి కుమార్ సూచించారు. సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలం బేగంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన నాలుగు కమ్యూనిటీ సీసీ కెమెరాలను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ టౌన్ సీఐ రవి కుమార్, బేగంపేట ఎస్సై డి.మహిపాల్ రెడ్డి, వీపీఓ బి. ప్రేమరాజ్, ఏఎస్సైలు హాజరై సీసీ కెమెరాలను ఆవిష్కరించారు. గ్రామ సర్పంచ్ మద్దా గీతా ప్రవీణ్, ఉప సర్పంచ్, మంకిడి స్వామి, వార్డు సభ్యులు, దాతలు, గ్రామ ప్రజల సమక్షంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐ రవి కుమార్ మాట్లాడుతూ గ్రామంలో భద్రతా పరిరక్షణను బలోపేతం చేయడం, చోరీలు, ఇతర అనైతిక చర్యలను అరికట్టడం లక్ష్యంగా కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని, భద్రతా వ్యవస్థ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని పేర్కొన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని.. ప్రతీ గ్రామంలో ప్రధాన వీధుల్లో సీసీ కెమెరాలు ఉంటే నేరాలు జరగవని వారు పేర్కొన్నారు. ఒక సీసీ కెమెరా వంద మందితో సమానమని. అంత టెక్నాలజీని వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. బేగంపేట గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ఎంతో హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. రాయపోల్ మండలంలోని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు రావాలని పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
03.03.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### చంద్రగ్రహణం – 10 నియమాలు

**నిద్రపోవద్దు**

- గ్రహణ సమయంలో నిద్రించకూడదు
- ధ్యానం లేదా జపం చేయడం మంచిది



# సర్వేల పేరుతో .. వైసీపీలో ధీమా..!



ఏపీలో ప్రధాన ప్రతిపక్షంగా వైసీపీ ఉంది. అయితే అసెంబ్లీలో వైసీపీ కనిపించడం లేదు. ఆ పార్టీ అధినాయకత్వం అయితే జనంలోకి వెళ్లడం లేదు. ఇక పార్టీ నాయకులు కూడా జనంలోకి వెళ్తున్న విషయాలు తక్కువగానే ఉన్నాయి. మరో వైపు చూస్తే మీడియా మీటింగులతోనే హడావిడి చేసే నేతలు కనిపిస్తున్నారు. ఇటీవల కాలంలో తిరుమల లడ్డూ వివాదంలో కూడా వైసీపీ కొంత ఇబ్బంది పడింది. అయినా సరే తన వైపు వెర్షన్ ని వినిపిస్తోంది.

ఇంకో వైపు చూస్తే వైసీపీకి చెందిన నేతలు వరసగా జైలు పాలయ్యారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు జైలుకు వెళ్లి వచ్చారు. ఆయన మీడియా ముందు మళ్లీ గట్టిగానే మాట్లాడుతున్నారు. అంబటి ఏపీలో హాట్ టాపిక్ అయ్యారని, వైసీపీకి సానుభూతి వచ్చిందని ఆ పార్టీ నేతలు చెప్పుకుంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే ఏపీలో కేవలం ఇరవై నెలలలోనే టీడీపీ కూటమి పని అయిపోయింది అని వైసీపీ నేతలు అంటున్నారు. వచ్చేది జగన్ ప్రభుత్వమే అని ధీమాగా చెబుతున్నారు.

ఇదిలా ఉంటే ఆ మధ్యన లిక్కర్ స్కాం కేసులో జైలుకి వెళ్లి వచ్చిన ఒక నాయకుడు మళ్లీ సర్వేలు చేయిస్తున్నారని అంటున్నారు. ఆయన తాజాగా సర్వే చేయించి అధినాయకత్వం ముందు పెట్టారని, ఆ సర్వేలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే వైసీపీ స్వీప్ చేస్తుందని పేర్కొన్నారని అంటున్నారు. దానికి కారణాలు ఏమిటి అంటే లడ్డూ ఇష్యూ అధికార పక్షానికి బూమరాంగ్ అయిందని, అలాగే అంబటి రాంబాబు ఎపిసోడ్ లో సానుభూతి వచ్చిందని, కూటమి పాలన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని అంటున్నారు. అయితే అంత వ్యతిరేకత కూటమి ప్రభుత్వం మీద నిజంగా ఉందా అన్నది ఒక చర్చ. ఈ రకమైన సర్వే నివేదికను సొంత పార్టీ వారే పెద్దగా నమ్మడం లేదని అంటున్నారు.

ఇక ఆ నాయకుడు గతంలో అంటే వైసీపీ అధికారంలో ఉన్నపుడు కూడా ఇదే తీరున సర్వేలు చేయించి తమ పార్టీకి ఢోకా లేదని బ్రహ్మాండమైన మెజారిటీతో గెలుస్తుందని చెప్పారని గుర్తు చేస్తున్నారు. తీరా ఫలితం చూస్తే దారుణంగా వచ్చిందని అంటున్నారు. అందువల్ల సర్వేలను నమ్ముకోకుండా వైసీపీ జనంలోకి వెళ్లాలని గ్రౌండ్ రియాలిటీస్ చూడాలని సూచనలు వస్తున్నాయి. ఏ పార్టీ అయినా ప్రజలతో ఉంటేనే జనాల ఆదరణ దక్కుతుందని, వైసీపీ ఆ విధంగా ముందుకు సాగాలని తప్పించి సర్వేలను నమ్ముకుంటే మళ్లీ ఇబ్బందులే ఎదురవుతాయని అంటున్న వారూ ఉన్నారు. మొత్తానికి చూస్తే వైసీపీలో ధీమా పెరుగుతోంది. ఏ రాజకీయ పార్టీకి అయినా ధీమా ఉండడం తప్పు లేదు. కానీ అది అతి ధీమా కాకూడదని అంటున్నారు. పైగా గ్రౌండ్ లెవెల్ రియాలిటీస్ ఎప్పటికపుడు చెక్ చేసుకోవాలని అంటున్నారు.

**కనపర్తి రవి**

# రాష్ట్ర ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు

- **మంత్రి పొన్నం ప్రభాకర్**


**ముద్ర, హైదరాబాద్:**



రాష్ట్ర ప్రజలందరికీ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగ మన సంస్కృతిలో స్నేహం, ఆనందానికి ప్రతీక అన్నారు. రంగుల మాదిరిగా మన జీవితాలు సంతోషాలతో నిండాలని, ప్రతి ఇంట్లో ఐక్యత, శాంతి, సుఖసమృద్ధులు నెలకొనాలని ఆకాంక్షించారు. మన రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న ఈ సందర్భంలో, అందరం కలిసికట్టుగా సామరస్యంతో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ద్వేషాలకు తావులేకుండా ప్రేమ, పరస్పర గౌరవంతో సమాజాన్ని మరింత బలపరచుదామని కోరారు. సహజసిద్ధమైన రంగులు, సంప్రదాయ పద్ధతిలో హోలీ పండుగ జరుపుకోవాలని సూచించారు. హోలీ పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త ఆశలు, విజయాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# చైనా రక్షణ వ్యవస్థ తుస్.. మళ్లీ ఫెయిల్

**ముద్ర డెస్క్ :**



చైనాకు, మరేదేశానికి మధ్య యుద్ధం లేదు. యుద్ధ వాతావరణమూ లేదు. కానీ చైనా భయపడుతోంది. అమెరికా, ఇజ్రాయిల్ ఇరాన్ మధ్య యద్ధం. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య బాంబు దాడులు . రష్యా, ఉక్రెయిన్ మధ్య ఏళ్ల తరబడి యుద్ధం. ఈ యుద్ధాల్లో చైనా ఎక్కడా ప్రత్యక్షంగాను, పరోక్షంగాను పాల్గొనలేదు. కేవలం తన మిత్రుదేశాలకు మద్దతుగా మాత్రమే మాట్లాడుతోంది. కానీ చైనాలో భయం మొదలైంది. ఎందుకు చైనా భయపడుతోందన్నది అసలు ప్రశ్న. చైనా భయపడుతోంది అమెరికాను చూసి కాదు. ఇంకేదో దేశాన్ని చూసి కాదు. తాను తయారు చేసిన ఆయుధాలను చూసి. ఎందుకు భయపడుతోందన్న వివరం ఈ స్టోరీలో తెలుసుకుందాం.

ప్రపంచ ఆయుధ తయరీ పరిశ్రమలో చైనా మూడో భారీ ఎగుమతిదారు. తక్కువ ధరకు ఆయుధాలను తయారు చేసి చాలా దేశాలకు అమ్ముతుంది. తక్కువ ధరకు అమ్ముతుంది కాబట్టే.. చైనా ఆయుధాలకు డిమాండ్ కూడా ఎక్కువ. అమెరికా మొదటి స్థానంలో ఉంది. కానీ అమెరికా ఆయుధాలు ఎక్కువ ధరకు విక్రయిస్తారు. అందుకే చైనా ఉత్పత్తులకు డిమాండ్ ఎక్కువ. అమెరికా ఖరీదైన ఆయుధాలను కొనుగోలు చేయలేని దేశాలు.. చైనా ఆయుధాలపైనే ఎక్కువగా ఆధారపడుతాయి. ఇదే చైనాను ఆయుధ అమ్మకాల్లో మూడో ఎగుమతిదారుగా నిలిపింది. పాకిస్థాన్, ఇరాన్, వెనుజువెలాతో పాటు చైనాతో సత్సంబంధాలు ఉన్న దేశాలు చైనా ఆయుధాలను కొనుగోలు చేస్తాయి. తక్కువ ధర.. ఎక్కువ డిమాండ్, మిత్ర దేశాలతో వ్యాపారం చైనాకు ప్రపంచ ఆయుధ తయారీ, అమ్మకాల్లో కొత్త మార్కెట్ ను ఏర్పరించింది.

చైనా ఆయుధాలకు డిమాండ్ బాగానే ఉంది. తనకంటూ ప్రత్యేక మార్కెట్ సృష్టించుకుంది. కానీ ఇప్పుడు ఆ ఆయుధాలను చూసి భయపడుతోంది. ఎందుకంటే, యుద్ధ భూమిలో చైనా తయారు చేసిన ఆయుధాల పర్ఫార్మెన్స్ దారుణంగా ఉంది. వాటిని చూసే చైనా భయపడుతోంది. అమెరికా వెనుజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను కిడ్నాప్ చేసినప్పుడు.. చైనా ఆయుధాల పనితీరు పేలవంగా ఉంది. అమెరికా సేనలను చైనా ఆయుధాలు ఆపలేకపోయాయి. ఆ తర్వాత ఇరాన్ అమెరికా, ఇజ్రాయిల్ మధ్య యుద్ధంలో కూడా ఇదే పరిస్థితి. చైనా ఆయుధాల పనితీరు ఏమాత్రం కూడా చెప్పుకోదగినదిగా లేవు. ఇండియా, పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్ని సమయంలో కూడా చైనా ఆయుధాల పనితీరు ప్రపంచ దేశాల ముందు వాటి సామర్థ్యాన్ని, స్థాయిని బట్టబయలు చేసింది. లిప్పి నిలబెట్టాయి. అందుకే వాటిని చూసి చైనా భయపడుతోంది.

# వేసవిలో ఆర్టీసీ చల్లని కబురు

- **ఏసీ బస్సుల్లో టికెట్ ధరలు తగ్గింపు**
- **రూ.5 నుంచి 10 వరకు రాయితీ**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**




గ్రేటర్ లో ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు టీజీఎస్ ఆర్టీసీ శుభవార్త చెప్పింది. హైదరాబాద్‌లో బస్సు టికెట్ ధరలను తగ్గించింది. వేసవి కాలం రావడంతో.. ఏసీ బస్సుల్లో ప్రయాణికుల ఆక్యుపెన్సీ పెంచుకునేందుకు భారీగా రాయితీలను ప్రకటించింది. టికెట్ ధరపై రూ.5 నుంచి రూ.10 వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపింది. ఒకవైపు మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఏసీ బస్సులు ఖాళీగా ప్రయాణిస్తుండటంతో ఆర్టీసీ టికెట్ ధరలను తగ్గించింది.

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తున్న సంగతి తెలిసిందే. అయితే భారీగా మహిళలు ఈ ఫ్రీ బస్ పథకాన్ని ఉపయోగించుకోవడంతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఫుల్ అవుతున్నాయి. దీంతో డబ్బులు చెల్లించి ప్రయాణించే పురుషులు నిలబడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. అదే సమయంలో డీలక్స్, లగ్జరీ, ఏసీ బస్సుల్లో పూర్తి స్థాయిలో సీట్లు నిండటం లేదు. ఇక హైదరాబాద్ మహా నగరంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ( టీజీఎస్ ఆర్టీసీ ) ఏసీ బస్సులను ఆయా రూట్లలో నడుపుతోంది. ఉచిత బస్సు ప్రయాణం కావడంతో మహిళలు ఈ ఏసీ బస్సుల వైపు చూడటం లేదు. ఇక టికెట్ ధరలు ఎక్కువగా ఉండటంతో పురుషులు కూడా చాలా మంది ఈ ఏసీ బస్సులు ఎక్కేందుకు ఆసక్తి చూపించడం లేదు. అది గమనించిన టీజీఎస్ ఆర్టీసీ అధికారులు కీలక సంస్కరణలు తీసుకువచ్చారు. ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు, మెట్రో డీలక్స్ బస్సులు 60 శాతం నుంచి 70 శాతం వరకు ఆక్యుపెన్సీతోనే నడుస్తున్నాయని గుర్తించారు. ఈ క్రమంలోనే ఏసీ బస్సుల్లో టికెట్ ధరలను తగ్గిస్తూ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రయాణికులను ఏసీ బస్సుల్లో ఎక్కేలా చేయాలని నిర్ణయించుకుంది. టికెట్‌పై కనిష్టంగా రూ.5 తగ్గించగా.. గరిష్టంగా రూ.10 వరకు ఈ రాయితీ వర్తిస్తుందని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. ఏసీ బస్సుల్లో 5 స్టేజీలు లేదా 10 కిలోమీటర్ల దూరానికి ప్రస్తుతం టికెట్ ధర రూ.50 ఉండగా.. తాజాగా ప్రకటించిన రాయితీతో కేవలం రూ.40 కే ప్రయాణించవచ్చు. అదే విధంగా 10 స్టేజీలు లేదా 20 కిలోమీటర్ల దూరానికి ప్రస్తుతం నాన్ ఏసీ సూపర్ లగ్జరీ బస్సుల్లో రూ.55 టికెట్ ధర ఉండగా.. రూ.10 రాయితీ కల్పించడంతో రూ.45 కే ప్రయాణించవచ్చు.

హైదరాబాద్ నగరంలో హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మణికొండ, కొండాపూర్, శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, సికింద్రాబాద్, ఎల్‌బీనగర్, ఈసీఐఎల్, దిల్‌సుఖ్‌నగర్, కోఠీ, ఉప్పల్, ఇబ్రహీంపట్నం సహా చాలా ప్రాంతాలకు ఆర్టీసీ అధికారులు ఏసీ బస్సులను నడుపుతున్నప్పటికీ.. ఆశించిన మేర మాత్రం ప్రయాణికుల నుంచి ఆదరణ రావడం లేదు. దీంతో ప్రస్తుతం ఎండాకాలం రానున్న నేపథ్యంలో ప్రయాణికులను ఏసీ బస్సులు ఎక్కేలా అధికారులు టికెట్ ధరలపై రాయితీలను ప్రకటించారు. ఈ టికెట్ ధరల తగ్గింపు ఈ నెల 1 నుంచే అమల్లోకి వచ్చాయి.

# ఎన్నికల హామీలు ఏమయ్యాయి..?

- **రాహుల్ గాంధీకి జాగృతి కవిత నిలదీత**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన రాహుల్ గాంధీ...రాష్ట్రంలోని యువతను దగా చేశారని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. డీసీసీ అధ్యక్షుల శిక్షణ కోసం హైదరాబాద్ కు వస్తున్న రాహుల్ గాంధీని.. కవిత ఎక్స్ వేదికగా నిలదీశారు. . యూత్ డిక్లరేషన్ ను బోగస్ చేశారని, జాబ్ క్యాలెండర్ పత్తా లేకుండా పోయిందన్నారు. వెంటనే 2 లక్షల ఉద్యోగాలు ఇవ్వకపోతే నిరుద్యోగులు కాంగ్రెస్ కు కర్రుకాల్చి వాత పెడతారని హెచ్చరించారు.

**ముందస్తు అరెస్ట్ లు దుర్మార్గం..**

రాహుల్ గాంధీని అడ్డుకుంటారన్న నెపంతో తెలంగాణలో పోలీసులు ముందస్తు అరెస్ట్ లు చేయటాన్ని కల్వకుంట్ల కవిత ఖండించారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాల్సింది పోయి అర్ధరాత్రి నిరుద్యోగులు, జాగృతి కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయటం దుర్మార్గమని చెప్పారు.

**ఎస్సీ ఉప కులాలకు రిజర్వేషన్ ఫలాలు దక్కాలి..**

ఎస్సీల్లోని ఉపకులాలకు కూడా రిజర్వేషన్ ఫలాలు దక్కాలని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సోమవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఎస్సీ ఉప కులాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరిగిన ఎస్సీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని కోరారు. అందుకు అనుగుణంగా రిజర్వేషన్ ల పెంపునకు అసెంబ్లీ లో తీర్మానం చేయాలని కోరారు. ఈ సమావేశంలో 20 ఎస్సీ ఉప కులాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఆ ముగ్గురి డీఎన్ఏ ఒక్కటే

- **ట్రంప్, మోదీ, నెతన్యాహులకు ముస్లింలపై ద్వేషం**
- **భారత్, ఇజ్రాయిల్ లో మతం ఆధారంగా పాలన**
- **అమెరికాలో ట్రంప్ జాత్యాహంకారాన్ని పెంచి పోషించారు**
- **ఇరాన్ అధ్యక్షుడి మృతిపై స్పందించని మోడీ..**
- **సౌదీపై దాడిని ఖండించడమేంటీ..?**
- **సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.అరుణ్ కుమార్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్, ఇజ్రాయిల్ ప్రధానమంత్రులు నరేంద్రమోదీ, నెతన్యాహు ముగ్గురి డీఎన్ఏ ఒక్కటేనని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.అరుణ్ కుమార్ విమర్శించారు. ముస్లింలపై ద్వేషం నరనరాన పేరుకుపోయిందని ఆరోపించారు. భారత్ తో పాటు ఇజ్రాయెల్ లోనూ మతం ఆధారంగా పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. అమెరికాలో ట్రంప్ జాత్యాహంకారాన్ని పెంచుతున్నారని ఆరోపించారు. ఇరాన్ పై ఇజ్రాయిల్, అమెరికా చేస్తున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. సీపీఎం రాష్ట్ర విస్తృత సమావేశం సోమవారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఇందులో ఆ పార్టీ సీనియర్ కేంద్ర కమిటీ సభ్యులు టి.జ్యోతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడారు. అమెరికా ఫస్ట్ అని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నట్టుగా, ఇండియా ఫస్ట్ అని భారత ప్రధాని నరేంద్ర మోడీ ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ను ప్రసన్నం చేసుకోవడానికి మోదీ సాగిల పడుతున్నారని విమర్శించారు. ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లిన మోదీ.. ఆ దేశ అధ్యక్షుడు నెతన్యాహు మంచి పనులు చేస్తున్నారంటూ ప్రశంసించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇరాన్ ఇస్లాం మత నాయకుడు ఖమేనీ సహా మరో 40 మంది చనిపోతే స్పందించని మోదీ.. యూఏఈపై ఇరాన్ దాడి చేస్తే ఖండించారని గుర్తు చేశారు. వెనిజులా అధ్యక్షుడు మధురోను అపహరిస్తే అనేక దేశాలు ఖండించినా మోదీ మాత్రం స్పందించలేదని చెప్పారు. సోషలిస్టు క్యూబాను అమెరికా దిగ్బంధనం చేసిందన్నారు. విశ్వ గురు అని చెప్తున్న మోదీ గొంతెత్తడం లేదని విమర్శించారు.

**భారత్‌పై టారిఫ్‌ను తగ్గించని అమెరికా..**

అమెరికాతో భారత ప్రభుత్వం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుందని అరుణ్ కుమార్ చెప్పారు. అమెరికా విధించిన 50 శాతం టారిఫ్ ను 18 శాతానికి తగ్గించడమే విజయంగా భారత ప్రభుత్వం ప్రకటించిందన్నారు. గతంలో మూడు శాతం టారిఫ్ ఉండేదని గుర్తు చేశారు. భారత్ లో అమెరికా వస్తువుల దిగుమతిపై 30 శాతం టారిఫ్ లు ఉంటే దాన్ని సున్నా శాతానికి తగ్గించిందని వివరించారు. దీనివల్ల భారత వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పత్తి, సోయాబీన్ దిగుమతి చేసుకుంటే ఆ రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఇప్పటికే దిగుమతులు పెరగడం, సబ్సిడీలు తగ్గడం, గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల పత్తి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఉపాధి హామీ చట్టం వచ్చాక ఆత్మహత్యలు తగ్గాయని వివరించారు. ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం స్వరూపాన్ని పూర్తిగా మార్చి వేసిందన్నారు. దీంతో వ్యవసాయ కార్మికులకు ఉపాధి హక్కుగా ఉండబోదన్నారు. కేంద్రం నిర్ణయాల వల్ల వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టివేసే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. అణు ఒప్పందం చట్టంలోనూ కేంద్రం మార్పులు చేసిందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే అణు రియాక్టర్‌లు తయారు చేసే వారిని కాకుండా నిర్వాహకులను శిక్షించాలంటూ నిబంధనలను మార్చిందని చెప్పారు. భోపాల్ దుర్ఘటన జరిగినా యాజమాన్యంపై చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు.

**ఎన్నికల్లో గెలిచేందుకు బీజేపీ కుట్ర..**

అస్సాం సహా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు రాబోతున్నాయని, అస్సాంలో ముస్లిం వ్యతిరేకతను పెంచడం ద్వారా మత వైషమ్యాలను పెంచి గెలిచేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని అరుణ్ కుమార్ విమర్శించారు. బంగ్లాదేశ్ నుంచి ముస్లింలు వచ్చారని ప్రచారం చేస్తున్నదని చెప్పారు. అక్కడి భూములను కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తున్నదని అన్నారు. కార్పొరేట్లు, సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం మోదీ ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. కేరళ సీఎం పినరయి విజయన్ పై కూడా తప్పుడు కేసులను నమోదు చేసిందన్నారు. ఎస్ఐఆర్ పేరుతో బీహార్, పశ్చిమ బెంగాల్ లో లక్షల సంఖ్యలో ఓటర్లను తొలగించారని గుర్తుచేశారు. ఈసీ పక్షపాతంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆర్ఎస్ఎస్ ఏజెండాను ఈసీ అమలు చేస్తుందని చెప్పారు. మతం, కులం ఆధారంగా దాడి పెరిగిపోతున్నాయన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం రాష్ట్ర బడ్జెట్ లో కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తుందన్నారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు అన్యాయం జరిగిందని చెప్పారు. గ్లోబల్ సమ్మిట్, దావోస్ పర్యటనలు చేసినా పెట్టుబడులు రాలేదన్నారు. ప్రచారార్భాటం తప్ప ఏమీ లేదని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపులపై రాష్ట్ర ప్రభుత్వం నాటకం ఆడుతున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. నాగయ్య, జూలకంటి రంగారెడ్డి, పాలడుగు భాస్కర్, టి సాగర్, మల్లు లక్ష్మి, పి. ప్రభాకర్, బండారు రవికుమార్, నున్నా నాగేశ్వరరావు, ఎండీ జహంగీర్ పాల్గొన్నారు.

**చంద్రగ్రహణం – 10 నియమాలు**

శుభకార్యాలు చేయకూడదు

- పెళ్లిళ్లు, కొత్త పనులు ప్రారంభించరాదు
- ఈ సమయం అనుకూలం కాదని భావిస్తారు

# దేశం కోసం ప్రధాని అవుతా

- బీజేపీ ఆడగాల నుంచి దేశాన్ని రక్షించుకుందాం
- మతతత్వ బీజేపీని అడ్డుకోవడం చాలా అవసరం
- దేశంలో శాంతి, సమానత్వం, సామరస్యం ప్రమాదంలో ఉంది
- మేం అహింసా సిద్ధాంతాన్ని పాటిస్తే.. బీజేపీ హింస మార్గాన్ని ఎంచుకున్నది
- సంఘటన స్పృజన్ అభియాన్ కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ






**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

బీజేపీ పాలనలో గాడి, అదుపు తప్పుతోన్న దేశంలో శాంతి, సమానత్వం, సామరస్యం స్థాపన కోసం, ఈ దేశం కోసం ప్రధానమంత్రి అవుతానని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. పదకొండేళ్ల మోడీ పాలనలో దేశం అన్ని రంగాల్లో వెనకబాటుకు గురయిందనీ... ప్రధానంగా శాంతి భద్రతల స్థాపన విషయంలో కేంద్రం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ద్వేషం ప్రజల మధ్య విభేదాలు సృష్టించి ఎలాగైనా అధికారంలోకి రావాలని చూస్తోందన్న రాహుల్ గాంధీ.. మనం అప్రమతంగా ఉండి బీజేపీ ఆగడాలను అడ్డుకొని దేశాన్ని రక్షించాలన్నారు. “సంఘటన సృజన్ అభియాన్” కార్యక్రమం భాగంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో నిర్వహించిన డీసీసీ అధ్యక్షుల పది రోజుల శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాహుల్ గాంధీ, కేసి వేణు గోపాల్, సీఎం రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతం అహింస, శాంతి, సత్యాన్వేషణ అన్నారు. ఈ సిద్ధాంతాల ఆచరణ కోసం ప్రతి కార్యకర్త నిరంతరం పని చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో సమానత్వ సిద్ధాంతానికి అత్యంత ప్రాధాన్యత ఉంటుందన్న రాహుల్ గాంధీ.. కుల, మత, వర్గ, లింగ బేధాలు లేకుండా, పేద ధనిక అనే తార తమ్యాలు లేకుండా అందరిని గౌరవిస్తూ పార్టీని నడిపించాలని పార్టీ జిల్లాల అధ్యక్షులకు పిలుపునిచ్చారు. అహంకారాన్ని విడి పార్టీ, ప్రజల కోసం పని చేయాలని సూచించారు. ప్రజలు పార్టీకి బలం కావాలనీ అదే సమయంలో పార్టీ ప్రజలకు బలం కావాలన్నారు. ప్రజలతో కలిసిపోయి వారితో మమేకం అయ్యి వారి కోసమే కాంగ్రెస్ పార్టీ పని చేసే విధంగా మన కార్యాచరణ ఉండాలన్నారు. మన పార్టీ గుర్తు చేయి గుర్తు అంటే అభయ ముద్ర, ప్రపంచంలోని అన్ని మతాల చిహ్నం కూడా అభయ ముద్రనే అన్నారు. అదే మన సిద్ధాంతమన్నారు. ప్రధానంగా పార్టీలో మహిళలను గౌరవించాలన్న రాహుల్ గాంధీ.. వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా బాధ్యులకు సూచించారు. డీసీసీ అధ్యక్షులు పార్టీ బలోపేతం కోసం ప్రజల కోసం పని చేయాలన్నారు. మీ భవిష్యత్ నేను చూసుకుంటా. మీరు బాగా పని చేస్తే ఏ స్థాయి వరకు అయినా నాయకులుగా ఎదిగే అవకాశం ఉంటుందని భరోసా ఇచ్చారు. మీ కార్యాచరణ మీ పని విధానము.. ప్రజల కోసం ఉండాలన్నారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ పట్ల విశ్వసం ఏర్పడి వాళ్ళు పార్టీ వైపు ఆకర్షితులు కావాలన్నారు. డీసీసీ అధ్యక్ష పదవి ఆకర్షణ కోసం కాదనీ అది ఒక బాధ్యతగా పని చేయాలన్నారు. కాంగ్రెస్ అంటే శాంతి, అహింస, సత్య వాక్కు వీటితోనే మనం ప్రజల్లోకి వెళ్లాలన్నారు. ప్రజల సమ్మతితోనే మనం అధికారంలోకి రావాలన్నారు.

**రాహుల్ ను ప్రధాని చేద్దాం**

రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే కాంగ్రెస్ కార్యకర్త లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేశం కోసమైనా రాహుల్ గాంధీ ప్రధాని కావాలని ఆకాంక్షించారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ప్రజా జీవితంలో తానెప్పుడూ పైరవీలు చేయలేదని అన్నారు. గతంలో ప్రజా సమస్యలపై గళం విప్పిన నాపై కేసులు పెట్టారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళికబద్ధంగా తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ అంశాలపై నేతలతో రాహుల్ గాంధీ చర్చించారు.

### రాహుల్ సూచనతోనే బీసీలకు ప్రాధాన్యత : టీపీసీసీ చీఫ్

రాహుల్ గాంధీ చూపిన బాటలో తెలంగాణ లో బిసి లకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. వందేళ్లలో చేయని కులగణన అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి చరిత్ర ఎన్నడు లేని విదంగా సీఎం రేవంత్ రెడ్డి పట్టుదలతో అసెంబ్లీలో బిల్లు పాస్ చేశారన్నారు. ఆ బిల్లు అమలు కాకుండా బీజేపీ, బిఆర్ఎస్ లు కుట్రలు చేస్తే పార్టీ పరంగా బిసి లకు.పంచాయతీ, మునిసిపల్, కార్పొరేటర్లు లలో అధిక ప్రాధాన్యత ఇచ్చి వారిని గెలిపించి నిరూపించామని చెప్పారు. చట్టపరంగా 28 శాతం బిసి లకు రిజర్వేషన్లు ఉంటే అనేక జనరల్ స్థానాలలో బిసి లను నిలబెట్టి గెలిపించిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. అత్యంత కీలకమైన డీసీసీ ల నియామకంలో బీసీలకు ప్రాధాన్యత ఇచ్చామన్న మహేశ్ కుమార్ గౌడ్... త్వరలోనే అన్ని జిల్లా కమిటీలు పూర్తి చేసి పార్టీ ని అత్యంత బలోపేతం చేస్తామని ప్రకటించారు.డీసీసీ అధ్యక్షులకు 10 రోజుల పాటు పార్టీ సిద్ధాంతాలపై సంపూర్ణంగా శిక్షణ ఇవ్వడం అందులో లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొనడం చరిత్రాత్మకమైందని చెప్పారు.

## ఇరాన్ ప్రతీకార దాడుల జ్వాల

**ముద్ర డెస్క్ :**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రమవుతున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఇరాన్ భారీ స్థాయిలో క్షిపణి, డ్రోన్ దాడులకు దిగింది. ఏకకాలంలో గల్ఫ్ ప్రాంతంలోని పలు దేశాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరపడం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసింది. ఖతార్, కువైట్, యూఏఈ, బహ్రెయిన్, సౌదీ అరేబియా వంటి దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను ప్రయోగించింది. అదే సమయంలో దక్షిణ ఇజ్రాయెల్‌పై కూడా బాలిస్టిక్ మిసైళ్లతో దాడులు కొనసాగించింది. ఈ దాడులతో పలు ప్రాంతాల్లో భారీ నష్టం సంభవించినట్లు సమాచారం. కువైట్‌లోని అమెజాన్ డేటా సెంటర్‌పై క్షిపణి దాడి జరగడంతో ఆ సేవలు తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది. యూఏఈలోని కీలక మౌలిక వసతులు కూడా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. సౌదీ అరేబియాలోని చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడులు జరపడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. అమెరికా యుద్ధ నౌక ‘అబ్రహం లింకన్’పై కూడా డ్రోన్లతో దాడి జరిగిందన్న సమాచారం బయటకు వచ్చింది. దీనితో అమెరికా తన రక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తోంది. ప్రాంతంలో సైనిక కదలికలు పెరగడంతో పరిస్థితి ఎటువంటి మలుపు తిరుగుతుందో అన్న ఆందోళన నెలకొంది. ఇరాన్ ప్రతీకార దాడులతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం మరింత వేడెక్కుతోంది. ఈ పరిస్థితులు మరింత విస్తరించి అంతర్జాతీయ స్థాయిలో పెద్ద సంక్షోభానికి దారితీయొచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

**ఇరాన్ కు మద్దతుగా లెబనాన్ ఎంట్రీ**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ హత్యతో మొదలైన సంక్షోభం ఇప్పుడు విస్తృత యుద్ధంగా మారే ప్రమాదాన్ని సూచిస్తోంది. ఇప్పటికే ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య తీవ్ర ప్రతిస్పందనలు కొనసాగుతుండగా లెబనాన్‌కు చెందిన శక్తివంతమైన మిలిటెంట్ గ్రూప్ హెజ్బొల్లా యుద్ధరంగంలోకి దిగడం పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మార్చింది. ఖమేనీ హత్యకు ప్రతీకారంగా హెజ్బొల్లా ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడులకు దిగింది. ముఖ్యంగా హెజ్బొల్లా వంటి మిలిటెంట్ గ్రూప్ ప్రత్యక్షంగా యుద్ధంలో దిగడం వల్ల ఇది పూర్తి స్థాయి మల్టీఫ్రంట్ వార్‌గా మారే ప్రమాదం ఉంది. హెజ్బొల్లా దాడులకు వెంటనే ప్రతిస్పందించిన ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ లెబనాన్‌పై భారీగా ప్రతీకార దాడులు ప్రారంభించింది. ముఖ్యంగా లెబనాన్ రాజధాని బీరుట్‌లోని హెజ్బొల్లా స్థావరాలు, ఆయుధ గోదాములు, కమాండ్ సెంటర్లను లక్ష్యంగా చేసుకుని మిస్సైల్ దాడులు కొనసాగిస్తోంది. తూర్పు, దక్షిణ లెబనాన్ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఇళ్లు ఖాళీ చేసి వెళ్లాలని ఐడీఎఫ్ హెచ్చరికలు జారీ చేసింది. సుమారు 53 గ్రామాల ప్రజలు ఒక్కసారిగా తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాల వైపు తరలిపోవడంతో భారీ ఎత్తున వలసలు చోటు చేసుకున్నాయి. బీరుట్ నగరంలో రహదారులు వాహనాలతో నిండిపోవడం, ఆహారం, నీరు వంటి అవసరాలు కొరత పడడం వంటి పరిస్థితులు నెలకొన్నాయి. ఈ యుద్ధ ప్రభావం గల్ఫ్ దేశాలపై కూడా పడుతోంది. యూఏఈ లోని అమెజాన్ డేటా సెంటర్‌పై ఇరాన్ మిస్సైల్ శకలాలు పడిన ఘటన ఆందోళనకు గురిచేస్తోంది. గ్లోబల్ డిజిటల్ నెట్‌వర్క్‌లు, ఆయిల్ సరఫరా మార్గాలు, అంతర్జాతీయ వాణిజ్యంపై కూడా దీని ప్రభావం పడే అవకాశం ఉంది. అమెరికా, యూరోపియన్ దేశాలు, ఐక్యరాజ్యసమితి శాంతి చర్చలపై దృష్టి సారించినప్పటికీ ప్రస్తుతానికి యుద్ధం ఆగే సూచనలు కనిపించడం లేదు. ఇలాగే కొనసాగితే ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, భద్రతా పరిస్థితులపై కూడా తీవ్రమైన ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.




## పోషకాహారంతో టీబీ నిర్మూలన

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

**ముద్ర, హైదరాబాద్:**

టీబీ వ్యాధిగ్రస్తులకు మెడిసిన్స్ తో పాటు పోషకాహారం అందిస్తే వ్యాధి నిర్మూలించవచ్చని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అభిప్రాయపడ్డారు. సోమవారం ట్యూబర్‌కులోసిస్ (టీబీ) రోగులకు పోషకాహార అందించే దిశగా కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద “ప్రాజెక్ట్ ఓజస్” కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని నాంపల్లిలోని కేర్ హాస్పిటల్స్ లో ఆమె ప్రారంభించి మాట్లాడారు. ట్యూబర్‌కులోసిస్ ఒక సంక్రమణ వ్యాధి అన్నారు. ఇది బ్యాక్టీరియాతో వస్తుందన్న ఆమె సమయానికి గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. టీబీని అపహాస్యంగా చూడకూడదనీ ఇది సమాజంలోని అన్ని వర్గాల వారిని ప్రభావితం చేసే వ్యాధి అని అన్నారు. ఈ వ్యాధి ఇన్ఫెక్షన్ తో వచ్చినప్పటికీ, పోషకాహార లోపం శరీర రోగనిరోధక శక్తిని తగ్గించి టిబి వ్యాధి ప్రబలడానికి కారణమవుతుందని వివరించారు. ముఖ్యంగా ప్రోటీన్లు, సూక్ష్మ పోషకాల లోపంతో రోగనిరోధక శక్తి తగ్గుతుందన్నారు. ప్రజలు సమతుల్య, ప్రోటీన్, పోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని వినియోగించాలని సూచించారు. టిబి కేవలం ఊపిరితిత్తులకే కాకుండా శరీరంలోని ఇతర భాగాలను కూడా ప్రభావితం చేయగలదని తెలిపారు. అందుకే ప్రారంభ దశలోనే స్క్రీనింగ్ ద్వారా గుర్తించడం అత్యంత ముఖ్యమని చెప్పారు. చికిత్స పూర్తిగా తీసుకోకపోతే వ్యాధి తీవ్రమై ఔషధ నిరోధక రూపాలకు దారితీసే అవకాశముందని హెచ్చరించారు. హైదరాబాద్ జిల్లాలో ప్రస్తుతం 19 టీబీ చికిత్స కేంద్రాలు పని చేస్తున్నాయని 10వేలకు పైగా టీబీ రోగులు చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఇప్పటివరకు 7.5 లక్షల మందికి పైగా స్క్రీనింగ్ నిర్వహించగా, రాబోయే నెలల్లో మరిన్ని 2.5 లక్షల మందికి స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఒక టిబి రోగి చికిత్స లేకపోతే గాలిమార్గం ద్వారా పలువురికి వ్యాధిని వ్యాప్తి చేయగలడన్నారు. ఆరోగ్య శాఖ అధికారులు స్క్రీనింగ్‌ను మరింత విస్తరించి, ప్రతి కేసును ప్రారంభ దశలోనే గుర్తించి పూర్తిస్థాయి చికిత్స అందించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ టిబి రోగులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. వెంకటి, జిల్లా టిబి నియంత్రణ అధికారి డా. చల్లా దేవి, కేర్ హాస్పిటల్స్ సీఈఓ పవన్ కుమార్, చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ నిఖిల్ మాథూర్, జగతి ఫౌండేషన్ సీఈఓ దుర్గా కల్యాణి, డా. ఫైజాన్ అజీజ్, కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.




### ఐటీ కారిడార్‌లో 6.30 ఎకరాల భూమిని కాపాడిన హైడ్రా

**హైదరాబాద్:**

ఐటీ కారిడార్‌కు ఆనుకుని ఉన్న గంధంగూడలో 6.30 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. దీని విలువ రూ. 600 కోట్ల వరకు ఉంటుందని అంచనా. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం గంధంగూడ సర్వే నంబరు 86/పి లో 6.30 ఎకరాల భూమిని జలమండలికి సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కోసం ప్రభుత్వం కేటాయించింది. అయితే ఈ భూమి ఆక్రమణలకు గురైంది. కొన్ని షెడ్డులు కూడా వేసి కబ్జా చేశారు. జలమండలి నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు మున్సిపల్, రెవెన్యూ అధికారులతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ భూమిగా గుర్తించి ఆక్రమణకు గురైన భూమిలో షెడ్డులను తొలగించింది. మొత్తం 6.30 ఎకరాల జలమండలికి కేటాయించిన భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.

## సెకన్లలో రిపోర్టులు..

- టిమ్స్‌లో న్యూమాటిక్ ట్యూబ్ సిస్టమ్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

హైదరాబాద్ సనత్‌నగర్‌లో నిర్మిస్తున్న టిమ్స్ (తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆసుపత్రి రాష్ట్ర వైద్యరంగానికి కొత్త దిశను చూపనుంది. 1000 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఉగాది నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.ఈ ఆసుపత్రిలో అత్యాధునిక న్యూమాటిక్ ట్యూబ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. గాలి పీడనంతో పనిచేసే ఈ వ్యవస్థ ద్వారా రక్త నమూనాలు, ఇతర మెడికల్ శాంపిల్‌స్‌ను సెకన్లలోనే ఒక విభాగం నుంచి మరొక విభాగానికి చేరవేయవచ్చు. దీంతో టెస్టుల ప్రక్రియ వేగవంతమై, రోగులకు త్వరగా రిపోర్టులు అందే అవకాశం ఉంటుంది.ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో ఈ టెక్నాలజీ కీలకంగా మారనుంది. డాక్టర్లు తక్షణ నిర్ణయాలు తీసుకునేందుకు ఇది సహాయపడుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ తరహా సాంకేతికతను ప్రవేశపెట్టడం రాష్ట్రంలో ఇదే తొలిసారి కావడం విశేషం. టిమ్స్ ప్రారంభంతో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు ఉచితంగా అందేలా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో తెలంగాణ వైద్య రంగంలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది.

## దేశంలో హై అలర్ట్..

- తెలంగాణలో ఆందోళన
- అప్రమత్తంగా ఉండాలన్న సీఎం రేవంత్ రెడ్డి
- జగిత్యాల జిల్లావాసుల భద్రతపై మంత్రి అడ్లూరి ఆందోళన

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఇజ్రాయెల్, అమెరికా ఇరాన్ దాడులు, ఇరాన్ సుప్రీం ఖమేనీ మృతి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. యుద్ధవాతావరణం నేపథ్యంలో భారతదేశంలో మతపర అల్లర్లు జరిగే అవకాశం ఉందని అందువల్ల అలర్ట్ గా ఉండాలని ఈ మేరకు కేంద్ర హోం శాఖ రాష్ట్రాల పోలీసు శాఖలకు లేఖ రాసింది. ముఖ్యంగా మతపరమైన సభలు, ప్రార్థనా స్థలాలలో ఇరాన్ అనుకూల రాడికల్ బోధకులు రెచ్చగొట్టే ప్రసంగాలు చేసే అవకాశం అటువంటి వాటిపై నిఘా ఉంచాలని ఆదేశించింది. దేశీయంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, గూఢచారి విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించింది. మరోవైపు ఖమేనీ మృతికి నిరసనగా భారత్ లోని ముఖ్యమైన నగరాల్లో ఆదివారం భారీ నిరసన ప్రదర్శనలు జరిగాయి. హైదరాబాద్, కర్నాటక, ఢిల్లీ, యూపీతో పాటు పలు ముఖ్యమైన నగరాల్లో ప్రజలు నిరసన తెలిపారు. వీటిని ఆసరాగా చేసుకుని కొంతమంది హింసాత్మక ఘటనలకు దారి తీసేలా రెచ్చగొట్టే అవకాశం ఉందని, దీనిని అదుపు చేయాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ముందస్తుగా జాగ్రత్త వహించాలంటూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. అలాగే పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై ఆదివారం రాత్రి ప్రధాని మోడీ నేతృత్వంలో భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) సమీక్షించింది.

**ఇరాన్ లో 2వేల మంది తెలంగాణ విద్యార్థులు**

ఉపాధి నిమిత్తం తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో గల్ఫ్ దేశాల్లో ఉంటున్న తెలంగాణ వాసుల పట్ల వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న ఇరాన్‌లోని పలు నగరాల్లో ఒక్క తెలంగాణకు చెందిన 2 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. హైదరాబాద్ నుంచే 900 మంది ఇరాన్‌లోని టెహ్రాన్, కుం వంటి నగరాల్లో చదువుకుంటున్నారు. మరోవైపు ఇంటర్నేషనల్ విమానాలు భారీగా రద్దు కావడంతో ఆ దేశంలో చిక్కుకుపోయిన వారు తిరిగి స్వదేశాలకు కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది. దీంతో ఇరాన్‌లో చిక్కుకుపోయిన తమ పిల్లల కోసం ఇక్కడ వారి తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. విద్యార్థులు, ఇంజనీర్లతోపాటు బిజినెస్‌మెన్‌లు తరచూ హైదరాబాద్ నుంచి ఇరాన్‌కు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఇక ఇరాన్‌లో ఉన్న హైదరాబాదీలకు సంబంధించిన సమాచారం తెలియకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఇరాన్‌లో ఇంటర్నెట్ సౌకర్యాన్ని అక్కడి ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేయడంతో తమ వారి ఫోన్లు కూడా కలవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**అప్రమత్తంగా ఉండండి : సీఎం రేవంత్ రెడ్డి**

ఇరాన్‌లో ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్, గల్ఫ్ ప్రాంతాల్లో ఉన్న తెలుగు వారు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. దాడుల నేపథ్యంలో అక్కడి అధికారులు సూచించే భద్రతా మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలన్నారు. ఆ దేశాల్లో ఉన్న భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు పాటించాలని తెలిపారు. ఏదైనా ఎమర్జెన్సీ అయితేనే తప్ప బయటకు రావద్దని హితవు పలికారు. ఇరాన్‌లో చిక్కుకున్న తెలుగువారిని స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వంతో తాము సమన్వయం చేసుకుంటామని వివరించారు. పరిస్థితిని తాము ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. మరోవైపు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాలలో మీడియాతో మాట్లాడారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తున్నాయని తెలిపారు. జగిత్యాల జిల్లాకు చెందిన ప్రజలు ఎక్కువగా జీవనోపాధి కోసం దుబాయ్, ఖతార్, ఇరాన్ వంటి గల్ఫ్ దేశాలకు వెళ్లారన్న ఆయన ఆ దేశాల్లో చిక్కుకున్న జగిత్యాల ప్రజల సమస్యలను రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

చంద్రగ్రహణం – 10 నియమాలు

గ్రహణం ముగిసిన తర్వాత స్నానం చేయాలి
* గ్రహణం తర్వాత పవిత్ర స్నానం చేయాలి
* ఇల్లు శుభ్రపరచుకోవడం మంచిది







# భారత్–అఫ్గనిస్థాన్ సిరీస్‌కు రంగం సిద్ధం

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27 చక్రంలో భాగంగా భారత జట్టు స్వదేశంలో మరో కీలక సిరీస్ ఆడనుంది. దక్షిణాఫ్రికా చేతిలో ఎదురైన వైట్‌వాష్‌తో వెనుకబడిన శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని భారత్ జట్టు, జూన్‌లో అఫ్గనిస్థాన్‌ను ఆతిథ్యం ఇవ్వనుంది. అష్మతుల్లా షాహిదీ సారథ్యంలోని అఫ్గన్ జట్టు భారత్‌కు వచ్చి రెండు ఫార్మాట్లలో పోటీపడనుంది. ముందుగా జూన్ 6న న్యూ ఛండీగఢ్ స్టేడియంలో ఏకైక టెస్టు మ్యాచ్ జరుగుతుంది. దీని తర్వాత మూడు వన్డేల సిరీస్ నిర్వహించనున్నారు. ఇరు జట్ల మధ్య చివరిసారిగా టెస్టు మ్యాచ్ 2018లో బెంగళూరులో జరిగింది. ఆ మ్యాచ్‌లో భారత్ ఇన్నింగ్స్ 262 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. అప్పటి నుంచి మళ్లీ రెడ్‌బాల్ ఫార్మాట్‌లో పోటీ పడలేదు. వన్డే సిరీస్ షెడ్యూల్ ప్రకారం తొలి మ్యాచ్ జూన్ 14న ధర్మశాలలో, రెండో వన్డే జూన్ 17న లక్నోలో, మూడో వన్డే చెన్నైలో మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభం కానుంది. ఈ సిరీస్ ద్వారా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో మెరుగైన స్థానం దక్కించుకోవాలని భారత్ భావిస్తోంది.

# సంజు శాంసన్ 'వీర' గాథ!




11 ఏళ్ల నిరీక్షణ, ఎన్నో నిరాశలు, తక్కువ అవకాశాలు... చివరకు ఒంటి చేత్తో జట్టును గెలిపించిన ఇన్నింగ్స్‌తో సంజు శాంసన్ విమర్శకులకు ఘాటైన సమాధానం ఇచ్చాడు. టీ20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్‌పై జరిగిన కీలక మ్యాచ్‌లో భారత్ 196 పరుగుల లక్ష్యాన్ని 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇది టీ20 ప్రపంచకప్ చరిత్రలో భారత్‌కు అత్యధిక ఛేదనగా నిలిచింది. ఈ విజయానికి సంజు శాంసన్ (97 నాటౌట్) ప్రధాన కారకుడు. 50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 97 పరుగులు చేసి జట్టును ముందుకు నడిపించాడు. టాప్ ఆర్డర్ విఫలమైన సమయంలో ధైర్యంగా నిలబడి, కఠిన మైన బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొన్నాడు. తిలక్ వర్మతో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పి ఒత్తిడిని తగ్గించాడు. ఒక దశలో వరుసగా వికెట్లు పడినప్పటికీ మ్యాచ్ బాధ్యతను తన భుజాలపై మోసాడు. టోర్నీకి ముందు వరుస వైఫల్యాలతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న సంజు, తనపై వచ్చిన అనుమానాలకు ఈ ఇన్నింగ్స్‌తో సమాధానం ఇచ్చాడు. 11 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో తక్కువ మ్యాచ్‌లే ఆడినా, అవకాశాలు వచ్చినప్పుడు సత్తా చాటగలడని నిరూపించాడు. జింబాబ్వేపై గతంలో చేసిన వేగవంతమైన ఇన్నింగ్స్‌లాగే, ఈసారి కూడా కీలక సమయంలో మెరిసి జట్టును సెమీఫైనల్‌కు చేర్చాడు.

# దుబాయ్‌లో చిక్కుకున్న సింధు...

## ఆల్ ఇంగ్లండ్‌పై అనిశ్చితి



పశ్చిమాసి ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం భారత స్టార్ షట్లర్ పీవీ సింధుపై పడింది. ఇరాన్ క్షిపణి దాడుల నేపథ్యంలో దుబాయ్‌లో విమాన రాకపోకలు నిలిచిపోవడంతో ఆమె అక్కడే నిలిచిపోయింది. ఈ పరిణామాలతో ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె పాల్గొనడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బర్మింగ్‌హమ్‌లో మార్చి 3 నుంచి ప్రారంభమయ్యే ఈ సూపర్ 1000 టోర్నీకి భారత జట్టులోని పలువురు ఇప్పటికే చేరుకున్నారు. లక్ష్య సేన్, ఆయుష్ శెట్టి, సాత్విక్-చిరాగ్ జోడీతో పాటు మిక్స్‌డ్ డబుల్స్ క్రీడాకారులు ఇతర మార్గాల ద్వారా ఇంగ్లండ్‌కు చేరినట్లు సమాచారం. అయితే సింధు మాత్రం తన కోచ్‌తో కలిసి దుబాయ్‌లోనే ఉండిపోయింది.ప్రస్తుత పరిస్థితుల్లో తాము సురక్షితంగా ఉన్నామని, కానీ ప్రయాణాలపై ఆంక్షలు ఉన్నాయని సింధు సోషల్ మీడియాలో వెల్లడించింది. దుబాయ్ గగనతలం మూసివేయడంతో ఆమె ఇంగ్లండ్ చేరుకోవడం కష్టంగా మారింది. తొలి రౌండ్‌లో థాయ్‌లాండ్ క్రీడాకారిణి సుపానిద కటేథోంగ్‌తో సింధు తలపడాల్సి ఉంది. అయితే సమయానికి చేరుకోగలదా అన్నది స్పష్టత లేదు. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య పరిస్థితిని పరిశీలిస్తూ, అక్కడ చిక్కుకున్న క్రీడాకారులను సురక్షిత మార్గాల్లో తరలించే అవకాశాలు పరిశీలిస్తోంది.ఇక ఆల్ ఇంగ్లండ్ టోర్నీలో ఇప్పటివరకు భారత తరఫున ప్రకాశ్ పదుకొనే, పుల్లెల గోపిచంద్ మాత్రమే విజేతలుగా నిలిచారు. సైనా నెహ్వాల్, లక్ష్య సేన్ ఫైనల్ వరకు చేరినా టైటిల్ సాధించలేకపోయారు. ఈసారి సింధు నుంచి మంచి ఫలితాల ఆశలు ఉండగా, తాజా పరిస్థితులు ఆమె అవకాశాలపై సందేహం రేపుతున్నాయి.



# సెమీఫైనల్స్‌కు వర్షం ముప్పు.. ఐసీసీ నిబంధనలు ఇవే?

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 తుదిదశకు చేరుకుంది. మరో మూడు నాకౌట్ మ్యాచ్‌లతో టోర్నీ ముగియనుంది. సెమీఫైనల్స్‌కు సౌతాఫ్రికా, ఇంగ్లండ్, భారత్, న్యూజిలాండ్ జట్లు అర్హత సాధించాయి. మార్చి 4న కోల్‌కతాలో న్యూజిలాండ్-సౌతాఫ్రికా తొలి సెమీఫైనల్ జరగనుండగా, మార్చి 5న ముంబై వాంఖడే మైదానంలో భారత్-ఇంగ్లండ్ రెండో సెమీఫైనల్ నిర్వహించనున్నారు. ఈ కీలక మ్యాచ్‌ల సమయంలో వర్షం పడితే పరిస్థితి ఎలా ఉంటుందనే చర్చ మొదలైంది. మ్యాచ్ రోజున ఆట పూర్తిగా సాగకపోతే రిజర్వ్ డే ఏర్పాటు చేశారు. మొదటి రోజు ఆట ఎక్కడ ఆగితే, మరుసటి రోజు అక్కడి నుంచే మ్యాచ్ కొనసాగుతుంది.


అయితే రిజర్వ్ డే రోజూ వర్షం కారణంగా మ్యాచ్ జరగకపోతే ఫలితాన్ని నిర్ణయించే విధానం కూడా స్పష్టంగా ఉంది. సూపర్8 దశ ముగిసే సమయానికి గ్రూప్‌లో మెరుగైన స్థానం సాధించిన జట్టుకే ఫైనల్ అవకాశాన్ని ఇస్తారు. ఈ నిబంధన ప్రకారం సౌతాఫ్రికా-న్యూజిలాండ్ మ్యాచ్ రద్దయితే సౌతాఫ్రికాకు లాభం చేకూరుతుంది. అలాగే భారత్-ఇంగ్లండ్ మ్యాచ్ కూడా రద్దయితే గ్రూప్‌లో అగ్రస్థానంలో ఉన్న ఇంగ్లండ్ ఫైనల్‌కు చేరుతుంది. అప్పుడు భారత్ మ్యాచ్ ఆడకుండానే టోర్నీ నుంచి తప్పుకోవాల్సి ఉంటుంది.దీంతో సెమీఫైనల్ రోజుల్లో వర్షం అంతరాయం కలగకూడదని అభిమానులు ఆశిస్తున్నారు.

# సంజూది కాదు గొప్పతనం.. దూబేదే : గంభీర్

టీ20 ప్రపంచకప్ సెమీస్‌కు భారత్ చేరిన నేపథ్యంలో భారత కోచ్ గౌతమ్ గంభీర్ జట్టు విధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. వెస్టిండీస్‌పై విజయానంతరం మాట్లాడుతూ, క్రికెట్ ఒక్కరి ప్రదర్శనతో గెలిచే ఆట కాదని స్పష్టం చేశారు. సంజూ శాంసన్ 97 పరుగులతో మెరిసినా, చివర్లో శివమ్ దుబే చేసిన చిన్న సహకారం కూడా అంతే ముఖ్యమని గంభీర్ పేర్కొన్నారు. భారీ స్కోర్లకే ప్రాధాన్యం ఇవ్వడం సరైంది కాదని, జట్టు విజయానికి ప్రతి ఆటగాడి పాత్ర కీలకమని అన్నారు. తన కోచింగ్ కాలంలో వ్యక్తిగత రికార్డుల కంటే జట్టు ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఉంటుందని వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.



# పాకిస్తాన్ ప్లేయర్లకు ఒక్కొక్కరికి 50 లక్షల ఫైన్




టీ20 ప్రపంచకప్‌లో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. సూపర్ 8 దశలోనే జట్టు నిష్క్రమించడంతో బోర్డు కఠిన నిర్ణయాలు తీసుకుంది. నిరాశాజనక ప్రదర్శన చేసిన ఆటగాళ్లపై భారీ జరిమానాలు విధించినట్లు సమాచారం. ప్రధాన ఆటగాళ్లకు ఒక్కొక్కరికి సుమారు 5 మిలియన్ పాకిస్తాన్ రూపాయల వరకు ఫైన్ విధించినట్లు తెలుస్తోంది. జట్టు బాధ్యతను సరిగా నిర్వర్తించలేదనే కారణంతో ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొంటున్నారు. సీనియర్ క్రికెటర్లూ ఈ జాబితాలో ఉన్నారని వార్తలు వినిపిస్తున్నాయి. భవిష్యత్తులో జట్టులో స్థానం సంపాదించాలంటే మెరుగైన ప్రదర్శన తప్పనిసరి అని బోర్డు స్పష్టం చేసినట్లు సమాచారం. జట్టు ప్రయోజనాలకే ప్రాధాన్యం ఉంటుందని, నిర్లక్ష్యాన్ని ఏమాత్రం ఉపేక్షించబోమని పీసీబీ హెచ్చరించినట్లు తెలుస్తోంది.

# శ్రీపాద రావు సేవలు చిరస్మరణీయం

- **ఘనంగా నివాళులర్పించిన స్పోర్ట్స్ అథారిటీ**

**ముద్ర,, హైదరాబాద్:**



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం కీర్తిశేషులు ఉమ్మడి రాష్ట్ర పూర్వ శాసనసభ సభాపతి దుద్దిల్ల శ్రీపాద రావు గారి జయంతి వేడుకలను ఈరోజు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

**ఈ కార్యక్రమానికి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్**
సోనిబాలాదేవి ముఖ్య అతిథిగా హాజరై, శ్రీపాద రావు గారి చిత్రపటానికి పూలమాలలు అర్పించి, ప్రజాసేవలో ఆయన చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. రాష్ట్ర రాజకీయ, శాసన పరిపాలనా రంగాల్లో ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా కొనియాడారు.ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి శ్రీమతి అనిత, డిప్యూటీ డైరెక్టర్లు సుజాత మరియు రవితేజ, ఇంజనీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ డైరెక్టర్ కె.ఆర్. భట్టర్, పి.ఆర్.ఓ కాలేరు సురేష్ తదితర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. జయంతి సందర్భంగా శ్రీపాద రావు గారి సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను కొనసాగించాలని అధికారులు పిలుపునిచ్చారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
03.03.2026 మంగళవారం, హైదరాబాద్






# టైటిలే కాదు... కథ కూడా మారింది

**ఉస్తాద్ భగత్ సింగ్ గురించి హరీశ్ శంకర్ వ్యాఖ్యలు**

పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాపై దర్శకుడు హరీశ్ శంకర్ ఆసక్తికర విషయాలు వెల్లడించారు. మొదట ఈ ప్రాజెక్ట్‌ను 'భవదీయుడు భగత్ సింగ్' అనే పేరుతో ప్రకటించినప్పటికీ, తర్వాత టైటిల్ మాత్రమే కాదు కథలో కూడా మార్పులు చేసినట్టు తెలిపారు. ప్రారంభంలో కాలేజ్ నేపథ్యంతో కథను సిద్ధం చేశామని చెప్పారు. అయితే తమ కాంబినేషన్‌పై అభిమానులు మాస్ అంశాలు ఆశిస్తున్నారని గ్రహించామని, ఆ అంచనాలకు అనుగుణంగా కథను మళ్లీ మలిచామని వివరించారు. 'గబ్బర్ సింగ్' తరహాలో శక్తివంతమైన పోలీస్ పాత్రతో కథను రూపొందించి 'ఉస్తాద్ భగత్ సింగ్'గా మార్చినట్టు వెల్లడించారు. టైటిల్ వెనుక ఉన్న భావం సినిమా ప్రారంభంలోనే స్పష్టమవుతుందని హరీశ్ శంకర్ చెప్పారు. అభిమానులు ఆశించే మాస్, యాక్షన్ అంశాలు పుష్కలంగా ఉంటాయని పేర్కొన్నారు.
మార్చి 26న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో ప్రచార కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి.




# అవార్డు వేదికపై మెరిసిన రకుల్

నటి రకుల్ ప్రీత్ సింగ్ ప్రస్తుతం సక్సెస్ మూడ్‌లో ఉంది. ఆమె నటించిన 'దే దే ప్యార్ దే 2' సినిమా విజయంతో పాటు ప్రశంసలు అందుకోవడంతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చినట్టు కనిపిస్తోంది. తాజాగా జరిగిన జీ సినీ అవార్డ్స్‌లో ఆమెకు "పర్ఫార్మర్ ఆఫ్ ది ఇయర్" అవార్డు దక్కడం ఈ ఆనందాన్ని మరింత ప్రత్యేకంగా మార్చింది. అవార్డుల వేడుకలో రకుల్ ధరించిన నీలిరంగు సీక్విన్ గౌన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లోనెక్ డిజైన్, మెరిసే అవుట్‌ఫిట్‌తో ఆమె గ్లామర్ లుక్ అందరినీ ఆకట్టుకుంది. సాఫ్ట్ మేకప్, స్లీక్ హెయిర్ స్టైల్, మినిమల్ ఆభరణాలతో స్టైలిష్‌గా కనిపించిన రకుల్ రెడ్ కార్పెట్‌పై ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ అవార్డును ఎంతో ప్రత్యేకంగా భావిస్తున్నట్లు సోషల్ మీడియాలో తెలిపిన రకుల్, దర్శకుడు లవ్ రంజన్, సహనటులు అజయ్ దేవగన్, ఆర్ మాధవన్‌తో పాటు చిత్రబృందానికి, ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపింది.




# కళాకారులా.. క్రిమినల్సా?

**ఆసక్తికరంగా సంప్రదాయిని.. సుప్పిని.. సుద్దపూసని ట్రైలర్**

క్రిమినల్ కుటుంబమా? లేక కళాకారుల కుటుంబమా? అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కిన చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' మార్చి 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. కుటుంబ కథా నేపథ్యంలో వినోదం, ఉత్కంఠ మేళవించి దర్శకుడు సుధీర్ శ్రీరామ్ ఈ సినిమాను రూపొందించారు. ఈ చిత్రంలో శివాజీ, లయ ప్రధాన పాత్రల్లో నటించారు. తాజాగా విడుదలైన ట్రైలర్ సోషల్ మీడియాలో చర్చనీయాంశమవుతోంది. వైరల్ అవుతున్న ఓ సంభాషణతో ప్రారంభమయ్యే ఈ ట్రైలర్ కథపై ఉత్కంఠ పెంచేలా కట్ చేశారు. కుటుంబం చుట్టూ తిరిగే సంఘటనలు, వారి అసలు స్వభావం ఏమిటన్న సందేహాలను రేకెత్తించే సన్నివేశాలు ఇందులో కనిపిస్తున్నాయి. చివర్లో అలీ చెప్పే "మీ ఒరిజినాలిటీ నాకు మాత్రమే తెలుసు" అనే డైలాగ్ కథలో కీలక మలుపు ఉంటుందనే సంకేతం ఇస్తోంది. కామెడీతో పాటు భావోద్వేగాలకు ప్రాధాన్యం ఇచ్చిన ఈ సినిమా ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

# మంజుమ్మల్ బాయ్స్ దర్శకుడిపై కేసు



మలయాళ చిత్ర పరిశ్రమతో పాటు ఇతర భాషల్లోనూ మంచి ఆదరణ పొందిన 'మంజుమ్మల్ బాయ్స్' చిత్ర దర్శకుడు చిదంబరం వివాదంలో నిలిచారు. కేరళలోని ఎర్నాకుళం పోలీస్ స్టేషన్‌లో ఆయనపై లైంగిక వేధింపుల కేసు నమోదు కావడం చర్చకు దారితీసింది. పోలీసుల సమాచారం ప్రకారం ఓ మహిళ చేసిన ఫిర్యాదుతో ఈ కేసు నమోదు చేశారు. 2022లో తనను లైంగికంగా వేధించారని ఆమె ఆరోపించారు. ఫిర్యాదు ఆధారంగా చిదంబరంపై కేసు నమోదు చేసి విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేశారు. ఈ వ్యవహారంపై దర్శకుడు ఇంకా స్పందించాల్సి ఉంది. 2021లో 'జాన్ ఈ మ్యాన్' చిత్రంతో సినీ రంగంలోకి వచ్చిన చిదంబరం, 2024లో 'మంజుమ్మల్ బాయ్స్' సినిమాతో విశేష గుర్తింపు పొందారు.



# 'ఆయా షేర్' ఆగేదేలేదు...

నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రం నుంచి విడుదలైన తొలి గీతం 'ఆయా షేర్' దూసుకుపోతోంది. విడుదలైనప్పటి నుంచి ఈ పాటకు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. యూట్యూబ్‌లో ట్రెండింగ్ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతూ మిలియన్ల వ్యూస్ సాధిస్తోంది. అనిరుధ్ రవిచందర్ అందించిన బీట్‌లు, నాని మాస్ లుక్ కలిసి ఈ సాంగ్‌ను మరింత వైరల్ చేశాయి. ముఖ్యంగా పాటలో కనిపించిన నాని మేకోవర్ అభిమానులను ఆకట్టుకుంటోంది. గుబురు జుట్టు, గడ్డంతో రఫ్ స్టైల్‌లో కనిపించిన ఆయన 'జడల్' పాత్రపై ఆసక్తి పెంచారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే అంచనాలు ఉండగా, 'ఆయా షేర్' విజయంతో అవి మరింత పెరిగాయి. విడుదలకు ముందే సాంగ్ ఈ స్థాయిలో స్పందన అందుకోవడం చిత్రబృందానికి ఉత్సాహాన్నిస్తోంది.



# మిలాన్ ఫ్యాషన్ వీక్‌లో శ్రీలీల సందడి

ఇటీవల ఇటలీలోని మిలాన్ ఫ్యాషన్ వీక్లో నటి శ్రీలీల ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జపాన్‌కు చెందిన ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ 'ఒనిట్సుకా టైగర్'కు ఆమె ప్రతినిధిగా హాజరవడంతో, ఇప్పటివరకు ఇండియా అంబాసిడర్‌గా ఉన్న రష్మిక మందన్న స్థానంలో మార్పు జరిగిందా అన్న చర్చలు మొదలయ్యాయి. అయితే ఇది కేవలం ప్రచార కార్యక్రమానికి సంబంధించిన నిర్ణయమేనని, అధికారిక ప్రకటన ఏదీ వెలువడలేదని సమాచారం. నలుపు రంగు మినీ డ్రస్‌పై ప్రకాశవంతమైన ఆరెంజ్ జాకెట్‌తో శ్రీలీల స్పోర్టీ శైలిలో మెరిసింది. మోకాళ్ల వరకు సాక్స్, క్లాసిక్ షూలతో ఆమె స్టైల్ యువతరాన్ని ఆకట్టుకుంది. ఆత్మవిశ్వాసంతో ఇచ్చిన పోజులు ప్రత్యేకంగా నిలిచాయి. ఇదిలా ఉండగా, ఆమె నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రంలో పవన్ కళ్యాణ్, రాశీ ఖన్నా ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రం 2026 మార్చిలో విడుదలకు సిద్ధమవుతోంది.

# సొంతూరిలో విజయ్–రష్మిక వ్రతం.. గ్రామస్తులకు విందు

టాలీవుడ్ ప్రముఖులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ఇటీవల వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఫిబ్రవరి 26న రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌లో కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో వీరి పెళ్లి ఘనంగా జరిగింది. అనంతరం హైదరాబాద్‌కు చేరుకున్న ఈ జంట తాజాగా విజయ్ స్వగ్రామాన్ని సందర్శించింది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని తుమ్మన్‌పేట గ్రామంలో కొత్తగా నిర్మించిన ఫామ్‌హౌస్‌లో నవదంపతులు సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. చాలా సంవత్సరాల తర్వాత స్వగ్రామానికి వచ్చిన విజయ్‌కు గ్రామస్తులు డప్పులు, జానపద నృత్యాలతో ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వ్రతం అనంతరం గ్రామంలోని దాదాపు మూడు వేల మందికి పైగా భోజన విందు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. పెళ్లి తర్వాత పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించిన ఈ జంట, మార్చి 4న హైదరాబాద్‌లో సినీ ప్రముఖుల కోసం ప్రత్యేక విందు కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమాచారం.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com